RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



05 జూన్ 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:5



**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:**ఇందిరా భవన్‌లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని సందర్శించిన ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ , టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు, వినతులు స్వీకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## ఆర్సీబీ విక్టరీ సంబరాల్లో చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో పదకొండు మంది మృతి


బెంగళూరు,జూన్ 4రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విక్టరీ సంబరాల్లో తీవ్ర విషాదం నెలకొంది. చిన్నస్వామి స్టేడియంలో విక్టరీ సంబరాల నేపథ్యంలో పెద్ద ఎత్తున ఫ్యాన్స్ అక్కడికి చేరుకున్నారు. పాసులు లేని వాళ్లు కూడా రావడం వల్ల క్రౌడ్ పెరిగింది. ఈ క్రమంలో స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పదకొండు మంది మరణించారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.17 ఏళ్ల తర్వాత ఐపీఎల్?లో ఆర్సీబీ ఛాంపియన్?గా నిలవడం వల్ల ఈ విక్టరీని పెద్ద ఎత్తున సెలబ్రేట్ చేయాలని ఫ్రాంచైజీ నిర్ణయించింది. ఈ క్రమంలోనే బెంగళూరు నగరంలో బస్ పరేడ్ ఆ తర్వాత చిన్నస్వామి స్టేడియంలో కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటగాళ్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ఈవెంట్?కి ఫ్రీ పాసులు అందించనున్నట్లు మేనేజ్?మెంట్ సోషల్ మీడియాలో పేర్కొంది.ఈ క్రమంలోనే పాసులు లేని అభిమానులు కూడా భారీ ఎత్తున స్టేడియానికి తరలి వచ్చారు. భద్రతా బలగాలు ఉన్నప్పటికీ క్రౌడ్ ఎక్కువవ్వడం వల్ల పరిస్థితి కంట్రోల్ తప్పింది. గేట్ నెం18 వద్ద తొక్కిసలాట జరిగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. అయినప్పటికీ ఈ ఘటనలో పదకొండు మంది మృతి చెందగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు.మరోవైపు ఈ ఘటనపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. తొక్కిసలాట ఘటనపై అభిమానులకు ఆయన క్షమాపణలు తెలిపారు. భారీ స్థాయిలో అభిమానులు రావడం వల్లే ఈ ఘటన జరిగిందని అన్నారు. ఈ పరిస్థితితో తీవ్ర ఆగ్రహానికి గురైన అభిమానులు స్టేడియం బయట ఓ కారు అద్దాలు ధ్వంసం చేశారు.

## తనను జైల్లో పెట్టారని.. జగన్‌ను కూడా జైలులో పెడతామంటే ఎలా!

**ఇది వరకు నేరస్థులు ప్రభుత్వానికి బయపడి వెళ్ళిపోయేవారని.. ఇప్పుడు మనం నేరస్థులతో రాజకీయాలు చేయాల్సిన పరిస్థితి మంత్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి'**

**ఏపీ కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు**

అమరావతి, జూన్ 4 : ఏపీ కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. తనను జైల్లో పెట్టారని.. జగన్‌ను కూడా జైలులో పెడతామంటే ఎలా కుదురుతుంది.. అది కరెక్ట్ కాదు కదా' అని మంత్రులతో సీఎం అన్నారు. బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా.. 'జగన్ తప్పు చేశాడు కదా? మనం ఎందుకు చర్యలు తీసుకోకూడదు' అని మంత్రి



గుమ్మడి సంధ్యారాణి ప్రశ్నించగా.. 'అతను తప్పులు చేసినట్లు రుజువులు ఉంటే చట్టానికి దొరికితే మనం చర్యలు తీసుకోవాలి. మంత్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి' ముఖ్యమంత్రి సూచించారు.ఇది వరకు నేరస్థులు ప్రభుత్వానికి బయపడి వెళ్ళిపోయేవారని.. ఇప్పుడు మనం నేరస్థులతో రాజకీయాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నేరం చేసి మళ్ళీ ప్రభుత్వంపైనే నిందలు వేసే పరిస్థితి నేడు నెలకొందని తెలిపారు. గంజాయ్ బ్యాచ్ నేరాలు చేసిందని.. తప్పులు చేసి.. తిరిగి ప్రభుత్వంపైనే నెడుతున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది మంత్రులు బాగా పనిచేశారని.. ఇంకా కష్టపడాలని.. ఈ ఏడాది ఏం చేశారనేది ఒకసారి సమీక్ష చేసుకోవాలని సూచించారు. రాబోయే ఏడాదికి ప్లాన్ చేసుకోవాలన్నారు. సంక్షేమ కార్యక్రమాలు బాగా చేశామని, కానీ ఏం చేసినా జనాన్ని ఎంపవర్ చేయాలని మంత్రులకు తెలిపారు.పోలవరం, బనకచర్ల ప్రాజెక్ట్‌లకు కేంద్రం సాయం చేస్తుందన్నారు. కేంద్రం సానుకూలంగా స్పందిస్తోందని.. ఆలస్యం అయితే ప్రతీ ఏడాది వ్యయం పెరుగుతుందని అన్నారు. నిధుల సమీకరణ కూడా జరుగుతోందన్నారు. పోలవరం, బనకచర్లకు కేంద్రం, రాష్ట్రం, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, హైబ్రిడ్ అన్యూటీ మోడల్లో కూడా నిధులు వస్తాయని అన్నారు. క్వాంటం వ్యాలీని చేయాలని.. 2026 జనవరికి కార్యరూపం తీసుకురావాలని వెల్లడించారు. క్వాంటం వ్యాలీ బిల్డింగ్ డిజైన్స్‌ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు చూపించాలని అధికారులకు సీఎం ఆదేశించారు.ఈ నెల 15న తిరుపతిలో సినిమా సెలబ్రిటీలతో యోగా నిర్వహించాలని తెలిపారు. టూరిజం మంత్రి వెళ్లి సెలబ్రెటీలను ఆహ్వానించాలని.. తాను కూడా కొంత మందికి ఫోన్లు చేసి చెబుతానని సీఎం అన్నారు. 1983లో మహానాడుకు షర్ట్‌లు పసుపునీళ్లలో ముంచుకుని అటెండ్ అయ్యారని.. అప్పటి నుంచి మహానాడు నిర్వహిస్తున్నారన్నారు. వాతావరణం బాగా సహకరించిందని.. ఇది వరకు సమ్మర్‌లో అల్లాడిపోయామన్నారు. కానీ ఇప్పుడు వాతావరణం మంచిగా సహకరించిందని అన్నారు. ఈ సారి మహానాడు బాగా జరిగింది... కార్యకర్తలు కూడా బాగా వచ్చారని కేబినెట్ సమావేశంలో తెలిపారు.

సీఎంకు మంత్రుల అభినందనలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా సీఎంకు మంత్రులు అభినందలు తెలిపారు. కూటమిలోని పక్షాల మధ్య సమన్వయం బాగా ఉందని సీఎం అన్నారు. పీ4కు సంబంధించి ప్రతి జిల్లాలో ఒక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గం వరకు వెళ్ళాలని మంత్రులకు సూచించారు. విజయ మాల్య లాంటి వాళ్ళు డబ్బులు తిని వెళ్ళిపోయారని.. రాజకీయ ముసుగులో ఉండి జగన్ నేరాలు చేస్తున్నారని విమర్శించారు. నేరస్థులను కూడా ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు.

జగన్, మిథున్ రెడ్డి ఇద్దరిలో ఎవరు ముందు జైలుకు వెళ్తారనే అంశంపై వైసీపీలో చర్చ జరుగుతోందన్నారు. తప్పులు చేసిన వారు ఎవరు కూడా తప్పించుకోకూడదని స్పష్టం చేశారు. చట్టం, న్యాయ ప్రకారం వెళ్ళాలని సీఎం తెలిపారు. నేరస్థుడు నేరం చేసి బయటకు వెళ్లిన తరువాత అతను ఏం చేస్తున్నాడనేది తెలుసుకోవాలన్నారు. ఆ సిస్టం వెంటనే అమలు చేయాలని చెప్పారు. నదుల అనుసంధానంపై కేంద్రం సానుకూలంగా ఉందంటూ సీఎం సంతోషం వ్యక్తం చేశారు. పోలవరం, బనకచర్లను చేపట్టి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు.

కేబినెట్‌లో యువగళం గురించి మంత్రి లోకేష్ ప్రస్తావిస్తూ.. యువగళం ప్రభుత్వానికి బ్రేక్ త్రూ అని వ్యాఖ్యానించారు. అధికారంలోకి రావడానికి, అధికారాన్ని అనుభవించడానికి యువగళం పాత్ర కూడా ఉందని సీఎం అన్నారు. గత ఏడాది ఇదే రోజు మనం ఊహించని విజయం లభించిందన్నారు. ప్రజలు ఆశయాలకు, అంచనాలకు అనుగుణంగా పని చేయాలని ఈ సందర్భంగా మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా బాధ్యత

**నేటి క్యాబినెట్ సమావేశంలో నివేదిక సమర్పిస్తాం,**
**పరిష్కారం కనుగొంటాం**
**ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశంలో**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా ప్రభుత్వం బాధ్యత, సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల సబ్ కమిటీని, అధికారుల కమిటీని నియమించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సబ్ కమిటీ సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు తదితరులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలపై మీ అందరితో చర్చించి సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి సానుకూలంగా నిర్ణయం తీసుకునే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల కమిటీకి సూచించారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన త్రీమెన్ కమిటీ ఉద్యోగ సంఘాలతో పలుమార్లు సమావేశమై విజ్ఞప్తులను స్వీకరించారు. మీ వద్ద స్వీకరించిన సమాచారాన్ని కమిటీకి పలు దఫాలుగా వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా బకాయిలు పేరుకుపోవడంతో అన్ని ఒకేసారి చేయలేకపోయాం, ఇక ఎక్కువ కాలం పెండింగ్లో పెట్టకుండా ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలనదే ప్రభుత్వ ఆలోచన అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉద్యోగ సంఘాలకు వివరించారు. గురువారం క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో అధికారుల నివేదికతో పాటు నేరుగా ఉద్యోగ సంఘాలతో చర్చించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములు గా ప్రజా ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. ప్రజలకు చేయాల్సిన పనులు, అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆదాయం, వ్యయం వీటన్నిటితో పాటు ఉద్యోగ వ్యవస్థకు ఇవ్వాల్సినవి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తుందని డిప్యూటీ సీఎం వివరించారు. ఒకవైపు ప్రజలకు మరోవైపు ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా కలిసి కూర్చుని చర్చించుకుని ముందుకు పోవాలన్న ఆలోచనతోనే క్యాబినెట్ సమావేశానికి ముందు ఉద్యోగ సంఘాలతో సమావేశమైనట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. గత పది సంవత్సరాల పాలనతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి అయినప్పటికీ ఉద్యోగులకు సాధ్యమైనంత మేరకు మేలు చేయాలి, వారి సమస్యలు పరిష్కరించాలన్న ఆలోచనలో భాగంగానే మా ప్రభుత్వం రాగానే మొదటి తారీకు నే జీతాలు చెల్లిస్తుందని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, కొత్త పథకాలు పెద్ద సంఖ్యలో తీసుకువచ్చాం, విజయవంతంగా అమలు చేస్తున్నాం వీటికి తోడు ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలన్న తపనలో ప్రజా ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. వనరులు సమకూర్చుకొని ప్రజలపై అదనంగా ఒక్క రూపాయి భారం పడకుండా ముందుకు పోతున్నాం అదే నేపథ్యంలో ఉద్యోగుల సంక్షేమం కోసం ఆర్థికపరమైన కసరత్తు చేస్తున్నాం ఈ కసరత్తు విజయవంతం కావాలని మనసున్న ప్రభుత్వం కోరుకుంటుందని వివరించారు. ఉద్యోగులకు మంచి చేయాలన్న ఆలోచనతోనే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని వివరించారు.ప్రభుత్వ ఆదాయానికి మరియు ఖర్చుకు చేయాల్సిన పనులను బేరీజు వేసుకొని ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి బలంగా ఉన్నారని డిప్యూటీ సీఎం ఉద్యోగ సంఘాలకు భరోసా ఇచ్చారు. ఉద్యోగుల కుటుంబాల్లో పెళ్లిళ్లు, ఆసుపత్రుల ఖర్చులకు సంబంధించిన సమస్యలపై క్యాబినెట్ సహచరులం అంతర్గతంగా పలుమార్లు చర్చించుకున్నామని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న అంశంపై ఎవరికీ భిన్నాభిప్రాయం లేదని తెలిపారు. గురువారం క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో ఉద్యోగ సంఘాల సమస్యలపై ఏర్పాటు చేసిన అధికారుల త్రీ మెన్ కమిటీ, ఆర్థిక శాఖ, ఇతర అధికారులతో చర్చించి ఒక నివేదిక రూపొందించి క్యాబినెట్ కు నివేదిస్తాం, పరిష్కారం కనుగొంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఉద్యోగ సంఘాల నేతలకు వివరించారు. సమావేశం లో అధికారులు నవీన్ మిట్టల్, లోకేష్ కుమార్, కృష్ణభాస్కర్, సందీప్ కుమార్ సుల్తానియా, మహేష్ దత్ ఎక్కా తదితరులు పాల్గొన్నారు.

## 65 మంది లబ్ధిదారులకు28 లక్షల 48 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అర్హులైన 65 మంది లబ్ధిదారులకు 28 లక్షల 48 వేల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మెడికల్ హబ్ గా మారింది అన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారిందని రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచి ప్రజా ఆరోగ్య భద్రతపై ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధిని చాటుకున్నారని తెలిపారు.



ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, కూరగాయల కొమరయ్య, చిలుక రమేష్, పులి రాంబాబు గౌడ్, గూడూరి మధు, ముప్పిడి శ్రీధర్, ఇప్పపూల వినోద్, నాగుల విష్ణు ప్రసాద్, అంబటి చందు, సిరిగిరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

05 జూన్ 2025 గురువారం

## ఉక్రెయిన్ దాడి పర్యవసానాలేమిటి?

నాటో కూటమి దేశాలు సృష్టించిన ఉక్రెయిన్ సంక్షోభం అక్షరాలా పదకొండు వందల తొంభై ఆరవ రోజులో ప్రవేశించింది. ఎప్పుడు, ఎలా ముగుస్తుందో తెలియదు. ఆదివారం నాడు రష్యా గడ్డమీద ఆపరేషన్ స్పైడర్ వెబ్ (సాలెగూడు) పేరుతో ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ల దాడిలో భారీ మొత్తంలో నష్టం చేకూర్చినట్లు జెలెన్స్కీ ప్రకటించాడు. దాన్ని ఉగ్రవాద చర్యగా వర్ణించిన రష్యా ప్రతిగా వెంటనే పెద్ద ఎత్తున దాడి చేసింది. ఉక్రెయిన్ చర్య మీద మంగళవారం నాడు ఇది రాసిన సమయానికి అటు డోనాల్డ్ ట్రంప్ వైపు నుంచి ఇటు వ్లదిమిర్ పుతిన్ నుంచి ఎలాంటి స్పందన వెలువడలేదు. దాడి గురించి ఉక్రెయిన్ తమకు ఎలాంటి ముందస్తు సమాచారమూ ఇవ్వలేదనే ఒక్కమాట మాత్రమే అమెరికా అధ్యక్ష భవనం నుంచి వెలువడింది. సోమవారం నాడు టర్కీ నగరమైన ఇస్తాంబుల్‌లో రెండు దేశాల మధ్య యుద్ధ ఖైదీలు, మరణించిన వారి మృతదేహాల మార్పిడికి సంబంధించిన అవగాహన కుదిరింది. మూడు రోజుల పాటు కాల్పుల విరమణ చేస్తామని రష్యా ప్రతిపాదిస్తే బేషరుతుగా అంగీకరించాలని ఉక్రెయిన్ చేసిన ప్రతిపాదనను పుతిన్ దూతలు తిరస్కరించారు.పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. రెండు శిబిరాలూ తాజా పరిస్థితికి అనుగుణంగా ఎత్తుగడలను రూపొందించుకొనే కసరత్తులో ఉన్నాయని వేరే చెప్పనవసరం లేదు. బందీల విడుదల గురించి గతంలోనే ఒక అవగాహన కుదిరి అమలు చేశారు, మరోసారి మిగిలిన వారి గురించి చర్చలలో పాల్గొనటానికి ఇరువురికీ అభ్యంతరం ఉండనవసరం లేదు. దానికి ఉక్రెయిన్ జరిపినదాడికీ సంబంధం లేదు. గడచిన మూడున్నరేం డ్లుగా రెండు దేశాల మధ్య ఇలాంటి దాడులు, ప్రతిదాడులూ జరుగుతూనే ఉన్నాయి. అయితే ఆదివారం నాడు ఉక్రెయిన్ జరిపిన దాడికి ఉన్న ప్రాధాన్యతను తక్కువ అంచనా వేయనవసరం లేదు. యుద్ధమన్న తర్వాత రెండు వైపులా నష్టం ఉంటుంది. మూడున్నరేండ్ల రష్యా మిలిటరీ చర్యలో ఉక్రెయిన్ ఇప్పటి వరకు కోల్పోయిన ప్రాంతం, ఇతర వాటితో పోల్చితే ఆది వారం నాటి రష్యా నష్టం పెద్దదేమీ కాదు.ఇక ఇస్తాంబుల్ చర్చల విషయానికి వస్తే జూన్ రెండవ తేదీన ఖైదీల మార్పిడి గురించి తప్ప శాంతి ప్రతిపాదనల మీద ఎలాంటి పురోగతీ లేదు. ఉక్రెయిన్ దాడిని అవకాశంగా తీసుకొని పశ్చిమ దేశాల పండితులు రష్యన్ సామర్ధ్యం గురించి కథనాలు వండి వారుస్తున్నారు, ప్రచారదాడికి పూనుకున్నారు.

వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న సైబీరియాతో సహా రష్యా భూభాగంలోకి ఉక్రెయిన్ డ్రోన్లను ఎలా పంపింది. ఏక కాలంలో ఐదు వైమానిక స్థావరాల మీద ఎలా దాడి చేసింది అన్నది ఇంకా బహిర్గతం కావాల్సి ఉంది. ఈ పథకాన్ని రచించేందుకు తమకు పద్దెనిమిది నెలలు పట్టిందని జెలెన్స్కీ చెప్పుకున్నప్పటికీ పశ్చిమ దేశాలన్నింటి ఉమ్మడి హస్తం దీనివెనుక లేకుండా ఉక్రెయిన్‌కు అంతసీన్ లేదు. అంతర్గతంగా రష్యాలో కొందరు చేతులు కలిపిన కారణంగానే డ్రోన్ల రవాణా జరిగిందన్నది ప్రాథమిక సమాచారం. రష్యా పత్రిక మాస్కో టైమ్స్ కథనం సారాంశం ఇలా ఉంది. ఉక్రెయిన్ నగరాల మీద బాంబులు వేసేందుకు ఉపయోగించే 41టియు 95, టియు 22 బాంబర్లు, ఏ 50 అనే రాడార్ విమానాన్ని ధ్వంస చేసినట్లు ఉక్రెయిన్ చెప్పినదాన్ని నిర్ధారించుకోవాల్సి ఉంది. వీటిలో పదికంటే తక్కువే మిలిటరీ సర్వీసులో ఉన్నాయి.మరో రెండింటిని 2024లో ఉపరితలం నుంచి ప్రయోగించే క్షిపణులతో ఉక్రెయిన్ కూల్చివేసింది. మూడున్నర సంవత్సరాలలో ఇది రష్యాకు మూడవ పెద్ద దెబ్బ. ఈ రకం విమానాలను ఇప్పుడు రష్యా ఉత్పత్తి చేయటం లేదు. టియు 160 రకం బాంబర్లు గాక ఇవి ఒకే సారి 16క్షిపణులను రెండు వేల కిలోమీటర్ల దూరం మోసుకుపోగలవు. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో అనేక విమానాలకు నిప్పంటుకున్నట్లు, ఆర్పివేసినట్లు, ఎలాంటి మరణాలు లేవని, అనుమానితులను అరెస్టు చేసినట్లు రష్యన్ రక్షణ మంత్రిత్వశాఖ నిర్ధారించింది. రష్యా వ్యూహాత్మక బాంబర్లలో 34శాతాన్ని ధ్వంసం చేశామని వాటి నష్టం 7 బిలియన్ డాలర్లని ఉక్రెయిన్ భద్రతా సంస్థలు చెప్పాయి. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా విశ్లేషించిన వారు మొత్తం 13 విమానాలు నాశనం లేదా దెబ్బతినట్లు చెప్పారు. ఎనిమిదని వాషింగ్టన్ డిసికి చెందిన నిపుణుడు క్రిస్ బిగ్గర్స్ ఎక్స్‌లో పోస్టు చేశాడు.మరోచోట ఐదు అని ఉక్రెయిన్ ఒకో హౌరా గ్రూపు విశ్లేషకులు పేర్కొన్నారు. చెక్క పెట్టెల్లో117 డ్రోన్లను ఉంచి రష్యా ట్రక్కులలోనే రహస్యంగా తరలించామని, రిమోట్ కంట్రోలుతో చెక్క పెట్టెల మూతలను తొలగించి డ్రోన్లతో దాడి చేసినట్లు ఉక్రెయిన్ పేర్కొన్నది. వైమానిక కేంద్రాల సమీపం నుంచి వాటిని ప్రయోగించినట్లు రష్యా రక్షణ మంత్రిత్వశాఖ చెప్పింది.ఒక వైమానిక కేంద్రం ఉక్రెయిన్ నుంచి సైబీరియాలో 4,300 కిలోమీటర్లు, మరొకటి 1,900కి.మీ దూరంలో ఉంది. మూడు కేంద్రాల మీద జరిగిన దాడిని తిప్పికొట్టిన్లు పేర్కొన్నది. పర్యవసానాలు, రష్యన్ మిలిటరీ సామర్ధ్యాన్ని అంచనా వేయటం ఈ దశలో కష్టం. ఇదీ మాస్కో టైమ్స్ మరుసటి రోజు విశ్లేషణ. ఉక్రెయిన్ దాడి మీద రష్యా ఎలా స్పందిస్తుందోనని ప్రపంచమంతా ఎదురు చూస్తున్నది. అది అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ మీద ఆధారపడి ఉంటుందన్నది ఒక తర్కం. తాను అధికారానికి వచ్చిన 24 గంటల్లోనే పరిష్కరిస్తానని చెప్పిన సంగతి తెలిసిందే. ఫారిన్ పోలిసీ అనే పత్రిక సిఐఏలో రష్యా గురించి విశ్లేషణ చేసిన మాజీ డైరెక్టర్ జార్జి బీబీతో మాట్లాడింది. పరిస్థితిని సాధారణ స్థాయికి తీసుకురావాల్సింది డోనాల్డ్ ట్రంప్ అని బీబీ చెప్పాడు. ఉక్రెయిన్ దాడి మీడియా ప్రత్యేకించి పశ్చిమదేశాల దృష్టిని పెద్దగా ఆకర్షించవచ్చు, రష్యా మీద పెద్ద ప్రభావం చూపుతుందని అనుకోవటం లేదు, దాని సామర్ధ్యాన్ని దెబ్బతీయదని, రెండు దేశాల మధ్య పెద్ద మార్పులు తెస్తుందని అనుకోవటం లేదన్నాడు.

రష్యన్ మిలిటరీ వైమానిక, పెద్దడ్రోన్ల దాడిని ఎలా ఎదుర్కోవాలా అన్నదాని మీదే భద్రత గురించి దృష్టి సారించింది తప్ప భూమి మీద నుంచి డ్రోన్లను ప్రయోగించి దెబ్బతీసే ఎత్తుగడల గురించి కేంద్రీకరించలేదన్నది ప్రాథమికంగా కనిపిస్తున్నది.తక్కువ ఎత్తులో సమీపం నుంచి దాడి చేసే చిన్న డ్రోన్ల గురించి దృష్టి సారించలేదు. ఇది ఒక్క రష్యాకే కాదు యావత్ ప్రపంచానికి ఒక మిలిటరీ గుణపాఠం. ఎలాంటి అనుమానం కలగకుండా రష్యన్ డ్రైవర్లు వాటిని ట్రక్కులలో వైమానిక స్థావరాల వద్దకు తీసుకు వెళ్ల గలిగారు. మాస్కోలోని ప్రధాన గూఢచార కార్యాలయం సమీపం నుంచే స్పైడర్‌వెబ్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి రిమోట్ కంట్రోలతో పని చేయించారని చెబుతున్నారు, నిర్ధారించుకోవాల్సి ఉంది. ఈ దాడి కారణంగా రెండు దేశాల చర్చల క్రమంలో మార్పు రాదని మరుసటి రోజే జరిగిన సమావేశం వెల్లడించింది. అయితే దీనికి, ఎవరికి వారు వేసే ఎత్తుగడలకు సంబంధం ఉండదు. ఈ దాడి తర్వాత పుతిన్‌పై ట్రంప్ పట్టు పెరుగుతుందని కొందరు భావిస్తున్నారు. ఇప్పటి వరకు రష్యాకు అనుకూలంగా పరిస్థితి ఉందని వేసిన అంచనాలను సవరించుకోవాలని సూచిస్తున్నారు. అందువలన రష్యా డిమాండ్ చేస్తున్న షరతులతో ఒప్పందానికి అంగీకరించే అవకాశం ఉండదని సూత్రీకరిస్తున్నారు. ఇంతకుముందే ఆ షరతులకు ట్రంప్ అంగీకరించలేదని, ఇప్పుడు మరింతగా వైఖరి గట్టిపడుతుందని అంటున్నారు. దాడికి ముందే గత కొద్ది రోజులుగా రష్యా మీద మరింత కఠిన వైఖరి తీసుకోవాలని, ఆంక్షల తీవ్రతను పెంచాలనే వత్తిడి ట్రంప్ మీద వస్తున్నది, ఐరోపా దేశాలు బహిరంగంగానే చెప్పాయి. పుతిన్ స్వయంగా కాల్పుల విరమణకు అంగీకరించకపోతే కొత్త ఆంక్షలను అమలు జరుపుతామనే సందేశాన్ని పంపగలడని విశ్లేషకులు చెబుతున్నారు. కొద్ది వారాల క్రితం ట్రంప్ తన ఓవల్ కార్యాలయంలో జెలెన్స్కీతో మాట్లాడుతూ ప్రయో గించటానికి తురుపుముక్కలేవీ లేవని చెప్పిన సంగతి తెలిసిందే. నాటో ప్రధాన కార్యాలయంలో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేత్ ఫిబ్రవరిలో మాట్లాడుతూ 2014కు ముందు కలిగి ఉన్న ప్రాంతాలన్నీ తిరిగి వస్తాయని ఉక్రెయిన్ భావించటం వాస్తవ విరుద్దమన్నాడు. ఇప్పుడు ధ్వంసం చేశామని చెబుతున్న ఫైటర్‌లు రష్యా దగ్గర ఉన్నవాటిలో ఒక చిన్న భాగమే.రష్యా మిలిటరీ బలగంతో పోల్చితే ఉక్రెయిన్ ఏ మాత్రం పోల్చటానికి లేదు. అయినప్పటికీ మూడున్నరేండ్లుగా అది నిలిచి ఎదిరిస్తున్నది. కొందరు చెబుతున్నదాని ప్రకారం ఉక్రెయిన్ తన సమాచారం మొత్తాన్ని మైక్రోసాఫ్ట్‌కు తరలించింది. దాని క్లౌడ్ సేవలను ఉపయోగించుకుంది. పలు పశ్చిమ దేశాలు సమన్వయం చేసుకొని రష్యా మీద సైబర్‌దాడులు జరిపాయి. ఎలన్ మస్క్ స్పేస్‌ఎక్స్ కంపెనీ స్టార్‌లింక్‌ను అందచేసింది. ఇది ఉక్రెయిన్ సమాచార వ్యవస్థలను పటిష్టం కావించింది.

# కోడెలను కాపాడలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది మీకు ప్రజలు అంటే లెక్కలేదు. దేవుళ్ళంటే లెక్కలేదు

## నర్సాపూర్ లో హరీష్‌రావ్, సునీతా లక్ష్మారెడ్డి



**నర్సాపూర్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి:** వేములవాడ దేవాలయంలో కోడెల మరణం తెలంగాణ రాష్ట్రానికి అరిష్టం.

వారం రోజుల్లో భక్తులు సమర్పించిన కోడెలు మరణించడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయి.

రోజూ కోడెలు చనిపోతున్నా కూడా ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేకపోగా కనీస స్పందన కూడా లేదు.

రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం కోడెలకు గడ్డిపెట్టే పరిస్థితి లేదా? ఎందుకు ఇంత నిర్లక్ష్యం.

కలెక్టర్, అధికారులు, దేవదాయ శాఖ, పశు సంవర్ధక శాఖ ఏం చేస్తున్నట్టు?

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ దేవస్థాన పరిస్థితి ఇలా ఉంటే ఎలా?

కోడెలను కాపాడలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది

కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాకపోతే చెప్పండి. బీఆర్ఎస్ పార్టీకి కోడెల సంరక్షణ బాధ్యత అప్పగించండి.

మీకు ప్రజలు అంటే లెక్కలేదు. దేవుళ్ళంటే లెక్కలేదు.

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ రాసిచ్చి ప్రజల్ని మోసం చేశారు.

500 రోజులు దాటినా ఇప్పటివరకు 6 గ్యారంటీల అమలుకు దిక్కులేదు.

దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి రుణమాఫీ చేస్తామని రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేశారు.

రేవంత్ రెడ్డి నీ నిర్లక్ష్య వైఖరి వల్ల రాష్ట్రానికి అరిష్టం జరుగుతుంది.

రేవంత్ రెడ్డి పాలన అంతా ఆగమాగం. ఒక్క మాట అయినా నిలబెట్టుకున్నవా రేవంత్ రెడ్డి.

కేసీఆర్ గారేమో ఈ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపాడు.

రేవంత్ రెడ్డి అబద్ధాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపాడు.

మొదటి సంతకంతో రుణమాఫీ చేస్తానని, నోరు కట్టుకుంటే ఏడాదిలో 40 వేల కోట్ల రుణమాఫీ పూర్తి చేస్తానన్నావు.

ఎందుకు నోరు కట్టుకోవడం లేదు రేవంత్ రెడ్డి . 40 వేల కోట్ల రుణమాఫీ ఇప్పటివరకు చేయలేదు.

పంటలు కోతకొచ్చి అమ్ముకున్నా ఇప్పటివరకు రైతులకు యాసంగి రైతుబంధు రాలేదు.

వడ్ల కుప్పల మీద రైతుల ఊపిరి ఆగిపోతుంటే పిట్టల్లా రైతులు రాలిపోతుంటే, రేవంత్ రెడ్డికి అందాల పోటీ మీద ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదు.

కనీసం ఆ రైతు కుటుంబాలను ముఖ్యమంత్రి కానీ మంత్రులు గాని పరామర్శించకపోవడం దుర్మార్గం.

రైతు బీమా ప్రీమియం రేవంత్ రెడ్డి కట్టకపోవడం వల్ల చనిపోయిన రైతు కుటుంబాలకు రైతు భీమా రావడం లేదు.

కొత్త రేషన్ కార్డులు ఇస్తానని చెప్పి ఒక్క రేషన్ కార్డు ఇయ్యలేదు. ఇంద్రమ్మ ఇల్లు అన్నావు దాని ఊసు లేదు.

యువ వికాసాన్ని వాయిదా వేస్తివి. రైతుబంధు వేస్తా అన్నావ్ అది వాయిదా వేస్తివి.

సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం 1100 కోట్లు బకాయి పడింది.

వెంటనే 1100 కోట్ల బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా.

48 గంటలలో కొన్న వడ్లకు డబ్బులు వేస్తున్నాం అని చెప్పిండు ఉత్తం కుమార్ రెడ్డి. 48 రోజులు అయిపోయినా డబ్బులు రాలేదు.

ఉమ్మడి మెదక్ జిల్లా, కామారెడ్డి జిల్లా, నిజామాబాద్ జిల్లాల్లో జొన్న కొనుగోలు జరిగింది కానీ రెండు నెలలు అయినా ఒక్క రూపాయి కూడా జొన్నలకు ప్రభుత్వం విడుదల చేయలేదు.

ప్రస్తుత క్యాబినెట్ మీటింగ్లో రైతుబంధు డబ్బులు మూడు పంటలకు కలిపి ఎకరాకు 18 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

పోయిన వానా కాలం 6,000 రూపాయలు, పోయిన యాసంగి 6,000 రూపాయలు, వచ్చే వానాకాలానికి 6,000 కలిపి ఎకరానికి 18 వేల రూపాయలు రైతుబంధు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం.

భట్టి విక్రమార్కగారు గత మూడు బడ్జెట్ సమావేశాల్లో రైతులు ఒక్క రూపాయి కట్టకుండా ప్రభుత్వమే డబ్బులు కట్టి పంటల బీమా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

బడ్జెట్ స్పీచ్ లో, అసెంబ్లీలో చెప్పినా కూడా అమలు చేయరా?

ఇక నుండి ఒక రూపాయి తీసుకోకుండా అసెంబ్లీలో చెప్పిన మాట ప్రకారం ఈ వానాకాలం పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

జీలుగు విత్తనాలు సరఫరా చేయడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది.

విత్తనాలను కూడా సరఫరా చేయడం చేతగాని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.

సన్నబడ్లకు బోనస్ లేదు, వడ్లు కొనడం లేదు, రైతుబంధు లేదు, రైతు బీమా లేదు, పంటల బీమా అని రైతులను మోసం చేశారు. ఏ ఒక్క పథకం కూడా రైతుల కోసం అమలు చేయలేదు.

వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులకు నిధులు విడుదల చేశామని ముఖ్యమంత్రి ప్రకటించారు కానీ ఇప్పటివరకు ఒక రూపాయి రైతులకు ఇవ్వలేదు.

రైతులంటే ఈ ప్రభుత్వానికి ఎందుకు అంత చిన్న చూపు?

పదేండ్ల కేసీఆర్ పాలనలో ఏ రోజు కూడా రైతు బీమా ఆగలేదు. రైతుబంధు ఆగలేదు. రైతులకు ఇచ్చే విత్తనాలు ఆగలేదు.

కాంగ్రెస్ నాయకుల సొంత ఆదాయం మీద దృష్టి పెడుతున్నారు తప్ప ప్రజల గురించి ఆలోచించడం లేదు.

విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.

ఆనాడు కిరణ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయి 2 వేల కోట్లు పెట్టిపోతే మా ప్రభుత్వ హయాంలో వాటిని చెల్లించి పథకాన్ని కొనసాగించాం.

18 నెలల్లో ఢిల్లీ నుంచి వచ్చిన డబ్బులే తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ కి ఒక రూపాయి చెల్లించలేదు.

అసెంబ్లీలో చెప్పి, బడ్జెట్ స్పీచ్ లో చెప్పిన మాటలకు విలువ లేకపోతే ప్రజల్లో ఏం గౌరవం ఉంటుంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలు ఫీజులు చెల్లించలేక చదువులు మధ్యలోనే ఆపే పరిస్థితి వచ్చింది.

రీజనల్ రింగ్ రోడ్ కేసీఆర్ గారి ప్రభుత్వం ఉన్నప్పుడే సాంక్షన్ అయ్యింది.

కేసీఆర్ గారి ప్రభుత్వంలోనే రీజినల్ రింగ్ రోడ్డుకి ల్యాండ్ అక్విజేషన్ జరిగింది.

ఈ ప్రభుత్వం వచ్చాక రీజనల్ రింగ్ రోడ్ లో భూములు కోల్పోయిన రైతులకు ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం చెల్లించలేదు.

రీజినల్ రింగ్ రోడ్ లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చేందుకు హడ్కో నుండి 3,000 కోట్లు అప్పు తెచ్చారు. కానీ ఒక రైతుకి కూడా చెల్లించలేదు. ఆ డబ్బుని బడా కాంట్రాక్టర్లు కట్టబెట్టారు.

ప్రభుత్వ నోటిఫికేషన్ ఇచ్చినందుకు ఆ భూమిని అమ్ముకోలేకపోతున్నారు. పెళ్లికో, పిల్లలు చదువుకో అమ్ముకోలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

నర్సాపూర్ కొత్తపేట గ్రామానికి చెందిన కంచనపల్లి శేఖర్ అనే రైతు ఈ రోజు ఆత్మహత్యాయత్నం చేశాడు.

సిద్దిపేట జిల్లా మరికొక్క మండలం నరసన్నపేట గ్రామంలో బిక్షపతి అనే రైతు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది.

18 నెలలుగా నోటిఫికేషన్ వచ్చి రీజనల్ రింగ్ రోడ్ కింద ఉన్న భూమికి డబ్బులు ఇవ్వనందుకు ఆత్మహత్య చేసుకున్నాడు.

అధికారుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిరిగి అలసిపోయిన రైతులు ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తోంది

వేములవాడ రాజన్న ఆలయంలో కోడెలకు అన్నం పెట్టలేని ప్రభుత్వం, ఎర్రగడ్డ మానసిక వైద్యాలయంలో రోగులకు అన్నం పెట్టలేని దుస్థితి.

70 మంది మానసిక రోగులు విషాహారం తిని అనారోగ్యం పాలయ్యారు. అందులో ఒకరు చనిపోయారు.

మానసిక పరిస్థితి బాగాలేక దావఖానాలో చేరిన మానసిక రోగులను సరైన భోజనం పెట్టలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది.

బీఆర్ఎస్ నాయకులను, కేసీఆర్ ని, కేటీఆర్ ని, హరీష్ రావుని అక్రమ కేసుల్లో ఇరికించే ప్రయత్నమే తప్ప ప్రజలకు పనికొచ్చే ఒక్క పని కూడా చేయడం లేదు.

మా ఎమ్మెల్యేలపై, కార్యకర్తలపై కేసులు పెట్టడం తప్ప రేవంత్ రెడ్డి అసలు పని చేయడం లేదు.

రేపటి క్యాబినెట్ మీటింగ్లో పంటలకు రావాల్సిన డబ్బులను చెల్లించాలని మరోసారి డిమాండ్ చేస్తున్నాం.

## 24 గంటల్లో దోపిడీ కేసును చేదించిన వేములవాడ పట్టణ పోలీసులు.

### దోపిడికి పాల్పడిన ఇద్దరు నిందితుల అరెస్టు రిమాండ్ కు తరలింపు.

### 09 గ్రాముల బంగారం, ఒక గ్యారెంటీ చైన్, ఒక కత్తి, ఆటో, రెండు సెల్ ఫోన్స్ స్వాధీనం.

### వివరాలు వెల్లడించిన వేములవాడ పట్టణ సిఐ వీరప్రసాద్.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** నిందితుల వివరాలు ఏ 1 బోదాసు అశోక్ తండ్రి రాములు,(33) వడ్డెర కులం, నివాసం ఎల్లంపేట, అన్నారం, మాచారెడ్డి మండలం కామారెడ్డి జిల్లా, ప్రస్తుత నివాసం బాలానగర్, వేములవాడ టౌన్.ఏ 2 బొమ్మిడి గణేష్ తండ్రి బాలయ్య(25) మేదరి కులం, నివాసం రేకుర్తి, కొత్తపల్లి మండలం కరీంనగర్ జిల్లా ప్రస్తుతం నివాసం జాతర గ్రౌండ్ వేములవాడ టౌన్.

హినాయత్ నగర్ గ్రామం కమ్మర్పల్లి మండలం నిజామాబాద్ జిల్లాకు చెందిన బడావత్ తిమ్మి భర్త మనోహర్ అనే మహిళా తేదీ 01-06-2025 రోజున వేములవాడ దైవదర్శనానికి రాత్రి సుమారు 7:30 గంటలకు రాగా, తిప్పాపూర్ బస్టాండ్ ముందు ఆటో స్టాండ్ వద్ద ఒక వ్యక్తి నిలబడి ఆమెను మీ బంధువులు గుడి వద్ద ఉన్నారని నాకు తెలుసు అని మిమ్మల్ని గుడి వద్దకు తీసుకు వెళ్తానని మాయమాటలతో నమ్మించి ఆమెను తన ఆటోలో ఎక్కించుకొని వేములవాడలోని చెక్కపల్లి రోడ్డులో గల పెద్దమ్మ టెంపుల్ ప్రాంతానికి తీసుకువెళ్లి, అక్కడ ఎవరూ లేని సమయంలో ఆమెను కత్తితో బెదిరించి ఆమె మెడలో నుండి బంగారు ఆభరణాలైన మూడు గ్రాముల పుస్తెలు, నాలుగు గ్రాముల చెవి కమ్మలు, రెండు గ్రాముల మాటీలు మరియు ఒక గ్యారెంటెడ్ చైను మరియు పర్సులో ఉన్న నగదు డబ్బులు సుమారు 3000 రూపాయలు ఆమె నుండి దోపిడీ చేసుకొని పారిపోగా, తేదీ03-06-2025 రోజున బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా ఈరోజు అనగా తేదీ04-06-2025 రోజున సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడైన బోధస్ అశోక్ నివాసం ఎల్లంపేట, కామారెడ్డి అనునతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా దోపిడీ చేసిన బంగారు ఆభరణాలు కొన్నితన వద్ద ఉంచుకొని మిగతావి తన స్నేహితుడైన బొమ్మిడి గణేష్ వద్ద దాచి పెట్టానని తెలుపగా ఇద్దరు వ్యక్తులను ఈరోజు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి మూడు గ్రాముల పుస్తెలు, నాలుగు గ్రాముల చెవి కమ్మలు, రెండు గ్రాముల మాటీలు, ఒక రోల్డ్ గోల్డ్ చైన్, ఒక కత్తి, రెండు సెల్ ఫోన్లు, ఒక ఆటోను స్వాధీనపరచుకొని రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు.

నిందితుడైన బోదాస్ అశోక్ నివాసం ఎల్లంపేట, కామారెడ్డి గతంలో కూడా ఈల సురేందర్ తండ్రి దేవయ్య(45) కులము మాదిగ ఎస్సి నివాసం తోరణాలు, మండలం జిల్లా సిద్దిపేట అను అతనిని కూడా నమ్మించి తిప్పాపూర్ బస్టాండ్ వద్ద నుండి ఏటీఎంకు వెళ్లి వస్తానని అతని బజాజ్ పల్సర్ బండిని కూడా దొంగలించినాడు.

నిందితులను24 గంటలలో పట్టుకున్న వేములవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ లత, కానిస్టేబులు గోపాల్, సమీయుద్దీన్లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారు ?

రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్ కి నోటీసులు జారీ చేశారు

కాళేశ్వరం పంప్ హౌజ్ ల పనులు చేసిన మెఘా కృష్ణా రెడ్డిని కమినషన్ ఎందుకు పిలవడం లేదు ?

బీజేపీ కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కయ్యాయి

కాళేశ్వరానికి చిన్న పగుళ్లు ఏర్పడితేనే రంగంలోకి దిగిన ఎన్డీఎస్ఏ... ఎస్ఎల్బీసీ టన్నల్ కూలిపోతే ఎందుకు స్పందించడం లేదు ?

బనకచర్ల ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ఎందుకు అడ్డుకోవడం లేదు

బనకచర్లను వ్యతిరేకిస్తూ రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయాలి

కాళేశ్వరం ప్రాజెక్టుకు బీజేపీ నేతలు జాతీయ హోదా సాధించాలి

కేసీఆర్ కు కాళేశ్వరం కమిషన్ నోటీసులను నిరసిస్తూ మహా దీక్షలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు

తెలంగాణ జాగృతి మహాధర్నాకు భారీగా ప్రజల హాజరు





హైదరాబాద్: రాజకీయ దురుద్దేశంతోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కి కాళేశ్వరం కమిషన్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు జారీ చేయించిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు జారీ చేశారని ప్రశ్నించారు. కేసీఆర్ కి నోటీసులు ఇచ్చారంటే మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనని స్పష్టం చేశారు. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడం కేసీఆర్ చేసిన తప్పా ? తెలంగాణను అభివృద్ధిలో నెంబర్ వన్ గా నిలబెట్టడం తప్పా ? అని ప్రశ్నించారు. కాళేశ్వరం కమిషన్ కాదు... అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ అని విమర్శించారు. కమిషన్ పై మాకు నమ్మకం ఉన్నది... కానీ కాంగ్రెస్ పార్టీపై ఎటువంటి విశ్వాసము లేదని స్పష్టం చేశారు.

కేసీఆర్ కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బుధవారం నాడు ఇందిరా పార్కు వద్ద మహా ధర్న జరిగింది. ప్రజలు, జాగృతి కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్న మహా ధర్నాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రసంగించారు.

ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... "కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదు. ఆ ప్రాజెక్టులో 21 పంప్ హౌజ్ లు, 15 రిజర్వాయర్లు, 200 కీమీ మేర టన్నెల్ ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టులో 1500 కిలోమీటర్ల మేర కాలువలు ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎత్తిపోసిన మట్టితో దాదాపు 300 పిరమిడ్లు కట్టవచ్చు. కాళేశ్వరంలో వాడిన స్టీల్ తో 100 ఐఫిల్ టవర్లు కట్టవచ్చు. కాళేశ్వరంలో పోసిన కాంక్రీట్ తో 50 బూర్జు ఖలీఫాలు కట్టవచ్చు. అంత పెద్ద ప్రాజెక్టు కాళేశ్వరం... ప్రాజెక్టు పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుంది. 40 టీఎంసీలతో హైదరాబాద్ కు శాశ్వతంగా నీళ్లు ఇచ్చే ప్రాజెక్టు కాళేశ్వరం. మన పరిశ్రమలకు 16 టీఎంసీల నీళు అందించే ప్రాజెక్టు కాళేశ్వరం. 90 మీటర్ల అడుగున ఉండే నీళ్లను 600 మీటర్లపైకి ఎత్తిపోసే ప్రాజెక్టు. కేసీఆర్ ది గట్టి గుండే కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టును నిర్మించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలలో కూడా అంతపెద్ద ప్రాజెక్టును కట్టాలన్న ఆలోచన రాదు. తెలంగాణ సస్యశ్యామలం కావాలని కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరం" అని వ్యాఖ్యానించారు.

దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. కేసీఆర్ ని బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేశారని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేస్తూ 90 శాతం పనులను మెఘా కృష్ణా రెడ్డి కంపెనీకి ఇచ్చారని గుర్తు చేశారు. మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మత్తులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలను ఎండబెడుతోందని ఆరోపించారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్ హౌజ్ పనులు చేసిన మెఘా కృష్ణా రెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్ రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని ధ్వజమెత్తారు. 90 శాతం పంప్ హౌజ్ ల పనులు చేసిన కాంట్రాక్టర్ ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పౌరుషాన్ని చూపించాల్సిన సమయం వచ్చిందని అన్నారు.

ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు వ్యతిరేకించడం లేదని నిలదీశారు. తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు కేంద్రానికి ఫిర్యాదు చేయడం లేదని అడిగారు. గోదావరి – పెన్నా అనుసంధానం పేరిట నీళ్ల తరలింపును తక్షణమే అడ్డుకోవాలని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జలదోపిడి చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదని, 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నా రాష్ట్రానికి కేంద్రం నుంచి ఏమీ తేవడం లేదని మండిపడ్డారు. బీజేపీలో ఉన్న ఒకే ఒక తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా మాట్లడకపోవడం శోచనీయమని అన్నారు. బకనచర్ల ప్రాజెక్టును ఆపే ప్రయత్నం చేసే బాధ్యతను ఈటల రాజేందర్ తీసుకోవాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొచ్చే బాధ్యతను కూడా ఈటల రాజేందర్ తీసుకోవాలని తెలిపారు. గోదావరి నీటిలో వెయ్యి టీఎంసీల హక్కును సాధించే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని పునరుద్ఘాటించారు.

కాగా, "ఎస్సారెస్పీ నిర్మించడానికి కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాల కాలం పట్టింది. నెహ్రూ శంకుస్థాపన చేసిన నాగార్జున సాగర్ కు ఎన్టీఆర్ మరమ్మత్తులు చేయించారు. కాంగ్రెస్ కట్టిన మిడ్ మానేరు ప్రాజెక్టును కొట్టుకుపోతే కెసిఆర్ బాగు చేయించారు. కాంగ్రెస్ నిర్మించిన పులిచింతల గేట్లు కొట్టుకుపోయినయ్. కాంగ్రెస్ చేపట్టిన దేవాదుల ప్రాజెక్టు పైపులు పలిగిపోయాయి. ఎస్ఎల్బీసీ పనులు మొదలుపెడితే ప్రపంచం ముందు పరువు పోయేలా తనెల్ కూలిపోయింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకసారి తన ముఖం ని అద్దంలో చూసుకోవాలి. ఎస్ ఎల్ బి సి టనల్ కూలిపోతే ఎన్డీఎస్ఏ ఏం చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు ? కాంగ్రెస్ బిజెపి పార్టీలు కుమ్మక్కయ్యాయని స్పష్టమైంది" అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం లేకపోతే 35 శాతం తెలంగాణ భూభాగం ఎడారిగా మారే ప్రమాదం ఉందని కాబట్టి తక్షణమే మేడిగడ్డ బ్యారేజీకి మనమత్తులు చేపట్టి పొలాలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇప్పటికే 99% పనులు పూర్తయ్యాయని, మిగతా ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, కాబట్టి జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించాలని బిజెపిని డిమాండ్ చేశారు. బిజెపి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే కాలేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలని డిమాండ్ చేశారు. లక్ష కోట్ల అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని, కానీ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందే దాదాపు 80000 కోట్ల వ్యయంతో అని, మరి లక్ష కోట్ల అవినీతి ఎక్కడ జరిగినట్లు ? అని అడిగారు..

ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షులు దాస్యం విజయభాస్కర్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రావు, యువజన రాష్ట్ర అధ్యక్షులు సంపత్ గౌడ్, మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు మరిపెల్లి మాధవి, విద్యార్థి రాష్ట్ర అధ్యక్షుడు రాము యాదవ్, జాగృతి నాయకులు అప్పాల నరేందర్ యాదవ్, జాగృతి ఇటలి అధ్యక్షుడు తానింకి కిషోర్ యాదవ్, పబ్బోజు విజేందర్, ఈగ సంతోష్, అర్చన సేనాపతి, మాడ హరీశ్ రెడ్డి, లలిత యాదవ్, పరకాల మనోజ్ గౌడ్, మహేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

ఈ కార్యక్రమంలో యూపీఎఫ్ కన్వీనర్ బొల్లా శివశంకర్, కో ఆర్డినేటర్ ఆలకుంట హరి, యూపీఎఫ్ కో కన్వీనర్లు ఆర్ వి మహేందర్, కోల శ్రీనివాస్, నరహరి, విజయేంద్ర సాగర్, ఏల్చల దత్తాత్రేయ, గౌరిగే నరసింహ, టి నరేష్ కుమార్, డి కుమార స్వామి, కే ప్రవీణ్, రాచమల్ల బాలకృష్ణ, మురళి కృష్ణ, సల్వా చారిలు పాల్గొన్నారు

# 5ఏళ్లలో సాధించలేని పెట్టుబడులు 11నెలల్లోనే సాధించాం!

## 11నెలల్లో 9.5లక్షల కోట్ల పెట్టుబడులు, 8.5లక్షల ఉద్యోగాలకు ఒప్పందం

పరిశ్రమలు ప్రారంభమయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలి

ఒకవైపు పెట్టుబడుల ఆకర్షణ... మరోవైపు పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి

ఉపాధి కల్పన మంత్రుల కమిటీ సమావేశంలో మంత్రి నారా లోకేష్



అమరావతి: అయిదేళ్ల వైసిపి ప్రభుత్వంలో సాధించలేని పెట్టుబడులను చంద్రబాబు గారి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం 11నెలల్లో సాధించిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి, ఉపాధి కల్పన మంత్రుల కమిటీ చైర్మన్ నారా లోకేష్ అన్నారు. ఉండవల్లి నివాసంలో లోకేష్ అధ్యక్షతన 20లక్షల ఉద్యోగాలు, ఉపాధి కల్పనపై మంత్రులు, ఉన్నతస్థాయి అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 9.20లక్షల కోట్ల విలువైన 78భారీ పరిశ్రమలు, 13,895 కోట్ల విలువైన 1,19,580 చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని యువతకు 8.5లక్షల ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రంలో భారీపెట్టుబడులు, అత్యధిక ఉద్యోగాల కల్పించేందుకు ముందుకు వచ్చిన ఎన్ టిసిపి, బిపిసిఎల్, రిలయన్స్, టాటా పవర్ వంటి సంస్థలకు పరిశ్రమలవారీగా ఈడిబిలో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ (పిఎంయు)లను ఏర్పాటుచేసి, పరిశ్రమ స్థాపించేవరకు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు సంబంధించి భూమితోపాటు ఇతర మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలని అన్నారు. అతిపెద్ద తీరప్రాంతం కలిగిన మన రాష్ట్రంలో పర్యాటకరంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, బీచ్ టూరిజం అభివృద్ధిపై దృష్టిసారించాలని కోరారు. విశాఖలో ఒబెరాయ్, వరణ్ బీచ్ శాండ్స్ వంటి స్టార్ హోటళ్ల నిర్మాణాలకు అవసరమైన అనుమతులతోపాటు ప్రభుత్వపరంగా పవర్, వాటర్ వంటి సదుపాయాలను సమకూర్చాలని అన్నారు. రాష్ట్రంలో బీచ్ శ్యాండ్, కోల్ గ్యాసిఫికేషన్ మైనింగ్ రంగాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను అన్వేషించాలని అన్నారు. రాష్ట్రానికి కొత్తగా వచ్చే పరిశ్రమలకు అవసరమైన మానవవనరులను సమకూర్చేందుకు యువతకు నైపుణ్యశిక్షణ అందించాలని, స్కిల్ ఎకోసిస్టమ్ కల్పించాలని అన్నారు. బిసిసిఐ సహకారంతో అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో వరల్డ్ క్లాస్ స్టేడియం నిర్మాణానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని, దీనిద్వారా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు త్వరితగతిన అనుమతులు ఇచ్చేందుకు వీలుగా వాట్సాప్ గవర్నెన్స్ తో అనుసంధానం చేయాలని అన్నారు.

చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ)ల ద్వారా ఎక్కువమందికి ఉపాధి లభించే అవకాశమున్నందున ఆ పరిశ్రమలకు పెట్టుబడుల మద్దతు కోసం పిఎంఇజిపి (%ూతీఱఎవ వీఱఅఱర్వతీ%'%ం జుఎజూశ్రీశీఎవత్ +వఅవతీఢ్ఱశీఅ ్రాతీశీస్త్రతీఖఎవ%) తో అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో చంద్రబాబుగారి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ఒకవైపు పెట్టుబడుల ఆకర్షణతోపాటు మరోవైపు ఆయా ప్రాజెక్టుల ప్రారంభానికి వేగవంతంగా చర్యలు చేపటాలని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలను అనుసరిస్తున్నామని, వివిధరంగాల్లో పెట్టుబడులకు ఆసక్తి ఉన్న కంపెనీలతో నేరుగా సంప్రదింపులు జరపాలని మంత్రి లోకేష్ చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేష్, టిజి భరత్, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్, టూరిజం శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సిఇఓ సాయికాంత్ వర్మ, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఎపిఐఐసి ఎండి అభిషిక్త్ కిషోర్, %చీ=జుణజూౌ% విసి అండ్ ఎండి కమలాకర్ బాబు, గనులశాఖ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బెజవాడలో భారంగా అద్దెలు

విజయవాడ, జూన్4, అభివృద్ధి ఉండదు.. ఉద్యోగాలు, ఉపాధి మార్గాలు పెద్దగా ఉండవు...హైదరాబాద్ స్థాయి నగరం కూడా కాకున్నావిజయవాడ నగరంలో అద్దెలు మాత్రం ఆకాశాన్ని అంటుతాయి. గత పదేళ్లలో నగరంలో చెప్పుకోదగ్గ మార్పులేమి జరగక పోయినా అద్దెల భారం మాత్రం ఏటేటా పెరుగుతూనే ఉంది.ఏపీలో మిగిలిన నగరాలతో పోలిస్తే విజయవాడలో అద్దెల భారం అధికంగా ఉంటుంది. దీనికి 2015లో హైదరాబాద్ నుంచి పాలనా వ్యవహారాలను ఏపీకి తరలించాలనే నిర్ణయంతో విజయవాడలో అద్దెల భారం మొదలైంది. అన్ని ప్రభుత్వ శాఖలు, హెచ్ఓడీల నుంచి వేల సంఖ్యలో ఉద్యోగులు విజయవాడకు తరలి వచ్చారు. కుటుంబాలను వదిలి రాలేని వారికి ఇప్పటికీ ప్రభుత్వమే గెస్ట్ హౌస్ సదుపాయాలను కల్పించి మరీ పని చేయించుకుంటోంది.రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రభుత్వమే హెచ్ఆర్ఏ చెల్లిస్తోంది. వారి హోదా, ఉద్యోగాన్ని బట్టి అద్దె చెల్లింపు ఉంటోంది. ఆలిండియా సర్వీస్ అధికారులకు ప్రతి నెల రూ.40వేలకు పైగా అద్దె చెల్లిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు క్యాడర్‌ను బట్టి సగటున రూ.10వేల నుంచి రూ.30వేల వరకు నివాస సదుపాయం కోసం ప్రభుత్వం నుంచి భత్యం లభిస్తుంది.రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ పరిసర ప్రాంతాల్లో రాజధాని ఏర్పాటు అవుతుందనే ప్రచారంతో రియల్ ఎస్టేట్ పెద్ద ఎత్తున నడిచింది. 2014లో విజయవాడకు అవతలి వైపు కృష్ణా తీరంలో అమరావతిని ప్రకటించారు. 2015 జూన్‌లో ఉద్యోగులు అమరావతికి తరలించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2016 జూన్ నుంచి ప్రభుత్వ కార్యాలయాల తరలింపు మొదలైంది.హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు తరలి రావడంతో ఓ దశలో విజయవాడలో నివాస గృహాలకు కొరత కూడా ఏర్పడింది. స్కూళ్లు, కాలేజీలకు అనువైన ప్రాంతాల్లో నివాస ప్రాంతాల్లో అద్దెలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరంతో సమానంతో అలవెన్సులను చెల్లించడానికి సుముఖత వ్యక్తం చేయడంతో ఇంటి అద్దెలు పెరిగిపోయాయి. టూ బెడ్ రూమ్ ఫ్లాట్ అద్దెను కనీసం రూ.18-20వేలుగా నిర్ణయించేశారు. 3 బెడ్ రూమ్ అయితే రూ.30వేలుగా నిర్ణయించారు. ఇంట్లో ఏసీలు, ఫ్యాన్లు, చిమ్నీలు, ఇంటీరియర్ బాగున్న ఫ్లాట్లకు రూ.35-40వేలకు తక్కువగా లభించేవి కాదు. ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వమే హెచ్ఆర్ఏ చెల్లిస్తుండటంతో వారిపై ఈ భారం లేదు. ప్రభుత్వ ఉద్యోగులను దృష్టిలో ఉంచుకుని పెంచిన అద్దెలతో మిగిలిన వారికి శాపంగా మారింది.ఇంటి అద్దెల భారం ప్రధానంగా వేతనాలపై ఆధారపడిన మధ్య తరగతిపైనే పడింది. గత పదేళ్లలో అద్దెల భారం పెరుగుతున్న విషయాన్ని ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోలేదు. విజయవాడలో ఐటీ ఆధారిత పరిశ్రమలు, సర్వీస్ సెక్టార్ ద్వారా లభించే ఉపాధి అవకాశాలు ఉండవు.2019లో రాజధాని నిర్మాణ పనులు నిలిచి పోవడంతో అమరావతి నిర్మాణ పనుల కోసం వచ్చిన ఇంజనీర్లు, కన్సల్టెంట్లు స్వస్థలాలకు వెళ్లిపోయారు. ఓ దశలో అద్దెల్ని తగ్గించుకోవాల్సి వచ్చింది. కోవిడ్ మొదటి దశలో చాలా మంది స్వస్థలాలకు వెళ్లిపోయారు. ఇది కూడా విజయవాడ పరిసర ప్రాంతాల్లో నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపింది.కోవిడ్‌లో చాలా మంది వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం రావడంతో అద్దెలను కొంత మేరకు తగ్గించినా అవి మెల్లగా మునుపటి స్థితికి చేరుకున్నాయి.ప్రస్తుతం మళ్లీ అమరావతి పనులు ప్రారంభం కావడంతో విజయవాడతో పాటు తాడేపల్లిలో కళ్లు చెదిరేలా అద్దెలు వసూలు చేస్తున్నారు. కొత్త ఫ్లాట్లకు కనీసం రూ.25వేలు తగ్గకుండా రెంట్ వసూలు చేస్తున్నారు.ప్రైవేట్ రంగంలో పనిచేసే వారు కనీసం నెలకు రూ. లక్ష రుపాయల వేతనం ఉంటే తప్ప అద్దెల భారాన్ని మోయలేని పరిస్థితి విజయవాడలో ఉంది.ఏపీలో ప్రధానంగా గత ఐదేళ్లలో నిర్మాణ పనులు పూర్తైన భవనాల విషయంలో అంచనాలకు మించి వ్యయాన్ని భరించాల్సి వచ్చినందునే అద్దెలు పెంచాల్సి వచ్చిందని బిల్డర్లు చెబుతున్నారు. 2020-22 మధ్య కాలంలో 30టన్నుల ఇసుక ఖరీదు రూ.50వేల వరకు ఉండేదని, భవన నిర్మాణంలో వినియోగించే స్టీల్, సిమెంట్, శానిటరీ, ఇంటీరియర్ వంటి వాటి ధరల్లో అంచనాలకు వాస్తవానికి మధ్య 35-40శాతం తేడాలు వచ్చాయని చెబుతున్నారు.పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు కూడా వచ్చే పరిస్థితులు లేనందునే చాలా చోట్ల అద్దెలకు ఇస్తున్నట్టు బిల్డర్లు వివరించారు. చిన్న, మధ్య తరహా బిల్డర్లు ధరల భారం వల్ల తీవ్రంగా నష్టపోయారని, అద్దెల పెరుగుదలకు ఇది కూడా కారణమని విజయవాడకు చెందిన బిల్డర్ రాజేంద్ర వివరించారు.విజయవాడ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చిత వాతావరణంతో ఫ్లాట్ల అమ్మకాలు కూడా వేగంగా జరగడం లేదు. ఉద్యోగులు, ఉన్నత ఆదాయ వర్గాల్లో విజయవాడలో రియల్ ఎస్టేట్ మీద పెట్టుబడులు పెట్టడంపై ఇంకా అనుమానాలు ఉన్నాయి. రాజకీయంగా ఎప్పుడు ఏమి జరుగుతుందోననే ఆందోళన పెట్టుబడులపై ప్రభావం చూపిస్తోంది. ఐదేళ్ల తర్వాత ఏమి జరుగుతుందోననే ఆందోళన నేపథ్యంలో అమ్మకాలు, కొనుగోళ్లలో స్పీడ్ తగ్గింది.

# అమరావతి అభివృద్ధి కోసం రెండో దశ

విజయవాడ, జూన్4, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని అమరావతికి సంబంధించి భవిష్యత్ ప్రణాళికల్ని సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో అమరావతి అభివృద్ధి కోసం రెండో దశలో 40 నుంచి 45 వేల వేల ఎకరాల భూమిని సేకరించాలని భావిస్తోంది. ఈ భూమిని భూ సమీకరణ ద్వారా, భూసేకరణ ద్వారా తీసుకోవాలా అనే అంశాలను పరిశీలిస్తోంది. స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ప్రజల అభిప్రాయాలను తీసుకునే పనిలో ఉన్నారు. అమరావతిలో కూడా శంషాబాద్ ఎయిర్‌పోర్టు తరహాలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని గుర్తు చేస్తున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం కోసం 5 వేల ఎకరాలు అవసరం అవుతాయన్నారు మంత్రి నారాయణ. పెట్టుబడిదారులు అమరావతికి రావాలంటే 5 వేల ఎకరాలతో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ఉండాలన్నారు. స్మార్ట్ ఇండస్ట్రీస్ కోసం 2,500 ఎకరాలు, స్పోర్ట్స్ సిటీ కోసం మరో 2,500 ఎకరాలు కేటాయించాల్సి ఉంటుందన్నారు.హైదరాబాద్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్టు విషయంలో చంద్రబాబు అప్పట్లో దూరదృష్టితో ఆలోచించారన్నారు. అప్పట్లోనే శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అన్ని వేల ఎకరాలు ఎందుకు? బేగంపేటలో ఉన్న ఎయిర్‌పోర్టు చాలదా? అని విమర్శించారన్నారు. అప్పుడు కనుక శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మించకపోతే ఇప్పుడు అక్కడికి వస్తున్న విమానాల్లో పది శాతం కూడా బేగంపేటలో దిగలేవని వ్యాఖ్యానించారు. పెట్టుబడులు రావాలంటే అంతర్జాతీయ విమానాలు దిగేలా ఉండాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అందుకే అమరావతిలోనూ 5,000 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాలని ప్లాన్ చేశామన్నారు.అమరావతి పరిధిలో ఉన్న పెదకూరపాడు నియోజకవర్గంలో 26,000 ఎకరాలు, తాడికొండ నియోజకవర్గంలోని మూడు గ్రామాల్లో 12,000 ఎకరాలు భూసమీకరణ ద్వారా సేకరించడానికి రైతులు ముందుకు వచ్చారన్నారు మంత్రి నారాయణ. ఈ రెండో విడతలో రాజధాని కోసం భూములు ఇచ్చే రైతులకు మూడేళల్లో మూడేళ్లలో అభివృద్ధి చేసిన స్థలాలు అప్పగిస్తామన్నారు. రాజధానిలో విద్య, వైద్య సంస్థలకు భూముల రిజిస్ట్రేషన్ ఫీజులో మినహాయింపు ఇవ్వాలని సీఆర్డీఏ నిర్ణయించినట్లు తెలిపారు. వచ్చే మూడేళ్లలో అమరావతి కోర్ క్యాపిటల్ ప్రాంతంలోని అన్ని నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు.

కోర్ క్యాపిటల్ ఏరియాలో రూ.3,673 కోట్ల అంచనా వ్యయంతో ఐదు అడ్మినిస్ట్రేటివ్ టవర్ల నిర్మాణానికి టెండర్లు ఖరారు చేసిన విషయాన్ని తెలిపారు.

అంతర్జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తే ఏడాదికి రెండు మూడు పెద్ద ఈవెంట్లు జరుగుతాయని.. ఇలా దేశ, విదేశాల నుంచి క్రీడాకారులు, ఫ్యాన్స్ వస్తారన్నారు..

అప్పుడు హోటల్స్ కూడా ఏర్పాటవుతాయన్నారు. ఇలా ప్రభుత్వానికి ఊరు పెరుగుతుంది అన్నారు. భూసమీకరణలో తీసుకున్న భూమిలో రైతులకు స్థలాలు కేటాయించగా సీఆర్డీఏకు 25 శాతమే మిగులుతాయన్నారు.

ఎయిర్‌పోర్ట్, స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీలకు 10,000 ఎకరాలు కావాలంటే 40,000 ఎకరాలు సేకరించాల్సిన అవసరం ఉందన్నారు.

# ఇక ఇంటినుంచే కరెంట్ బిల్లులు

నెల్లూరు జూన్4, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.. ఇకపై ప్రజలు కరెంట్ బిల్లుల్ని చాలా సులభంగా కట్టేయొచ్చు. విద్యుత్ బిల్లులు కట్టేందుకు విద్యుత్ శాఖ కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇకపై జస్ట్ క్యూఆర్ కోడ్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చు. ఈ విధానం జూన్ నెల నుంచి వినియోగదారులకు అందుబాటులోకి వచ్చింది. గతంలో ఫోన్ పే, గూగుల్ పే వంటి వాటి ద్వారా కరెంట్ బిల్లులు కట్టే విధానాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ క్రమంలో ప్రజలు బిల్లులు కట్టడానికి మళ్ళీ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చింది. తాజాగా ఈ సమస్యను అధిగమించడానికి క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకొచ్చారు.క్యూఆర్ కోడ్ ద్వారా బిల్లులు చెల్లించే విధానం వల్ల ప్రజలకు చాలా సులువు అంటున్నారు. ఈ నెలలో జారీ చేస్తున్న విద్యుత్ బిల్లుల్లో క్యూఆర్ కోడ్ ఉంటుంది.. ఆ కోడ్‌ను ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా స్కాన్ చేయాలి. వెంటనే బిల్లు మొత్తం కనిపిస్తుంది.. వినియోగదారుడు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం పాస్‌వర్డ్ ఎంటర్ చేసి ఓకే చేస్తే బిల్లు చెల్లింపు పూర్తవుతుంది. ఈ సరికొత్త విధానం ప్రభుత్వ సర్వీసులకు వర్తించదని తెలుస్తోంది. బకాయిలు ఉన్న వినియోగదారులకు కూడా ఈ అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. అలాగే గత నెల బిల్లు చెల్లించకపోతే.. ఈ నెల బిల్లులో క్యూఆర్ కోడ్ కనిపించదంటున్నారు అధికారులు.ఈ క్యూఆర్ కోడ్‌తో ప్రజలకు విద్యుత్ సేవలను మరింత చేరువ చేసేందుకు.. ఈ కొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చామని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ సర్వీసులు మినహా అన్ని ప్రైవేటు సర్వీసులకు ఈ విధానం వర్తిస్తుంది.. బిల్లులు ఎలా చెల్లించాలో బిల్లు రీడర్స్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తారు. క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించడం చాలా సులువుగా ఉందని వినియోగదారులు అంటున్నారు. ఫోన్‌పేలో డబ్బులు ఉంటే ఎప్పుడైనా బిల్లు చెల్లించవచ్చని.. దీని ద్వారా సమయం ఆదా అవుతుందంటున్నారు. బిల్లు చెల్లింపు కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం కూడా ఉండదంటున్నారు.

విద్యుత్ సేవలు వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు క్యూఆర్‌కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చాము అంటున్నారు అధికారులు. కరెంట్ బిల్లులు ఎలా చెల్లించాలో బిల్లు రీడర్స్ వినియోగాదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మొత్తం మీద ఇకపై కరెంట్ బిల్లులు చెల్లించడం చాలా ఈజీ అయ్యింది. సింపుల్‌గా కరెంట్ బిల్లుపై ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే సరిపోతుంది. ఇక ఎక్కడికి వెళ్లాల్సిన పని ఉండదు.. చక్కగా ఇంట్లో కూర్చుని కరెంట్ బిల్లుల్ని ప్రతి నెలా చెల్లించొచ్చు

# జూన్ 10 వరకు బదిలీలకు గ్రీన్ సిగ్నల్

విజయవాడ, జూన్4, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. జూన్ 10 నుండి ఉద్యోగులు బదిలీలపై నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేసింది.ఉద్యోగుల బదిలీల గడువుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని విభాగాల ఉద్యోగుల బదిలీలు గడువును జూన్ 9వ తేదీ వరకు వరకు పొడిగించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పీయూష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసింది.మరోవైపు జూన్ 10 నుండి ఉద్యోగుల బదిలీలపై నిషేధం కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈలోపే అన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ పూర్తి కావాలని పేర్కొంది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ విభాగాల అధిపతులకు, అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు ఇచ్చిందినిజానికి ఏపీ ప్రభుత్వం ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మే 15 నుంచి జూన్ 2వ తేదీ వరకు బదిలీలకు ఆర్థిక శాఖ అనుమతిచ్చిన విషయం తెలిసిందే. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు మరో వారంపాటు పొడిగింపునకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. అప్పటి వరకు బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆర్థిక శాఖ?. ఉత్తర్వులు ఇచ్చింది.ఇక ఈ సాధారణ బదిలీలకు సంబంధించి ఏపీ ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఒకే చోట ఐదేళు పూర్తి అయిన ఉద్యోగులను ఖచ్చితంగా బదిలీ చేయాలని సర్కార్ స్పష్టం చేసింది. ఈ నిబంధన మేరకు చాలా మంది ఉద్యోగులు బదిలీ కానున్నారు. పదోన్నతి పొంది ఒకే ప్రాంతంలో ఐదేళ్లు పూర్తి చేసిన వారిని కూడా ట్రాన్స్ ఫర్ కానున్నారు. ప్రస్తుతం జరిగే బదిలీల్లో?. వచ్చే ఏడాది మే 31వ తేదీలోపు రిటైర్‌మెంట్ అయ్యే ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చింది.గిరిజన ఏరియాలో రెండేళ్ల కంటే ఎక్కువ కాలం పనిచేసిన ఉద్యోగులకు బదిలీల్లో ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించింది. మెడికల్ గ్రౌండ్‌లో భాగంగా ఉద్యోగుల వినతి మేరకు బదిలీ చేయనుంది. స్పౌజ్ ఉద్యోగులకు బదిలీల్లో ఒకే చోట లేదా దగ్గరి ప్రాంతాల్లో బదిలీ చేసేలా ప్రాధాన్యం కల్పించింది. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శాల మేరకు? ప్రస్తుతం బదిలీలు జరుగుతున్నాయి.మరోవైపు కొన్ని శాఖల్లో బదిలీల ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. అర్‌అండ్ బీ డిపార్ట్ మెంట్ లో కొందరు అధికారులు? కీలక పోస్టింగ్‌ల కోసం లాబీయింగ్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తమకు నచ్చిన చోట పోస్టింగ్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఒక్క శాఖలోనే కాదు? వ్యవసాయశాఖలోనూ ఇదే మాదిరి పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో? ఉద్యోగ సంఘాలు గడువు పెంచాలని ప్రభుత్వాన్ని కోరాయి. ఇందుకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో?. జూన్ 9 వరకు గడువు పెంచారు.

# జగన్ అప్పుడే తొందరా...

విజయవాడ, జూన్ 4,వైసీపీ అధినేత వైఎస్ జగన్ తొందరపడుతున్నారా? కూటమి ప్రభుత్వానికి వెసులుబాటు కల్పిస్తున్నారా? అంటే అవుననే అనిపిస్తుంది. జగన్ ఎన్నికలు పూర్తయి ఏడాది గడవక ముందే ఉద్యమాలు, పోరాటాలు అంటూ దిగడం, ఆందోళన కార్యక్రమాలకు పిలుపు నివ్వడం పట్ల కొంత పార్టీలోనే వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఇంత త్వరగా ఆందోళనలు చేపట్టి రోడ్డు మీదకు వెళితే జనం నుంచి రెస్పాన్స్ వచ్చినా కూటమి ప్రభుత్వాన్ని అలెర్ట్ చేసినట్లే అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇంత తొందరెందుకు? కనీసం రెండేళ్ల పాటు అయినా ప్రభుత్వానికి కనీసం కొంత వెసులుబాటు ఇచ్చి ఉంటే అది అడ్వాంటేజీగా వైసీపీకి మారేదని అంటున్నారు ఫ్యాన్ పార్టీ లీడర్లు. జగన్ నేరుగా రోడ్డు మీదకు రాకపోయినప్పటికీ ఎన్నికల ఫలితాలు వచ్చిన ఆరు నెలలు మాత్రం మౌనంగా ఉన్నారు. తర్వాత అనేక పథకాలను అమలు చేయడం లేదంటూ ఆందోళనకు దిగారు. ఫీజు రీఎంబర్స్ మెంట్ తో పాటు రైతులకు పెట్టుబడి సాయం, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వంటి అనేక అంశాలపై ఆయన పిలుపు నిచ్చారు. పార్టీ నేతలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కలెక్టర్లకు వినతి పత్రాలను అందించారు. అయితే దాని వల్ల ఉపయోగం ఏం కనిపించ లేదని వైసీపీ నేతలే అభిప్రాయపడుతున్నారు. స్థానిక సంస్థల నుంచి ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్ని కార్యక్రమాలను నిర్వహించినా వెళ్లిపోవడం ఆగడం లేదు. అనేక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు వైసీపీ కోల్పోవాల్సి వచ్చింది.పొరుగున ఉన్న తెలంగాణలో చూసుకుంటే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బయటకు రావడం లేదు. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఇంకా పోరాటాలు, ఉద్యమాలంటూ హంగామా చేయడం లేదు. ప్రజలకు ఎవరేంటో తెలుసుకునే కొంత సమయం ఇవ్వాలని కేసీఆర్ తన సన్నిహితులతో అన్నారు. ఏప్రిల్ నెలలో జరిగిన బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మినహాయించి ఆయన పెద్దగా ప్రభుత్వం పై విమర్శలు చేయడం లేదు. ప్రజల్లో అధికార పార్టీ పట్ల వ్యతిరేకత బాగా పెరిగిన తర్వాత బయటకు రావాలని కేసీఆర్ భావిస్తున్నారు. అప్పుడే పార్టీకి రాజకీయంగా లాభం చేకూరుతుందని కేసీఆర్ నమ్ముతున్నారు. అందుకే ఆయన ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. కానీ తెలంగాణలో కేసీఆర్ అనుసరించిన వ్యూహాన్ని మాత్రం ఆంధ్రపదేశ్ లో జగన్ అమలు చేయలేకపోతున్నారు. ఎన్నికలు త్వరగా వస్తాయని తొందరపడుతున్నట్లు కనిపిస్తుంది. ఇక ఈ నెల 4వ తేదీన వెన్నుపోటు దినంగా పాటించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, అందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమం చేపట్టాలని జగన్ కార్యాచరణ సిద్ధం చేశారు. వెన్నుపోటు దినం సరే.... నీకు వెన్నుపోటు పొడిచి వెళ్లేవారి సంగతిని గురించి పట్టించుకోకుండా, అందుకు గల కారణాలు తెలిసినా మార్పులు చేయకుండా ఉంటే ఏ కార్యక్రమం చేపట్టి ఏం లాభమని పలువురు ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద జగన్ తొందరపడుతూ నేతలను కూడా కంగారు పెడుతున్నట్లే కనిపిస్తుంది. రిజల్ట్ మాత్రం నిల్ అని చెప్పక తప్పదు.

# కోల్డ్ స్టోరేజీల్లోకి... కొన్ని హామీలు

విశాఖపట్టణం, జూన్ 4,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాది అయినా సంపద సృష్టిపైన దృష్టి సారించలేకపోతున్నారు. ఒక వైపు ఇచ్చిన హామీలను అమలుచేయాల్సిన పరిస్థితి. మరొక వైపు ఖజానా డొల్లగా మారిన పరిస్థితి. ఎన్నాళ్లు గత ప్రభుత్వంపై నిందలు మోపుతారన్న అసంతృప్తి ఇప్పటికే ప్రజల్లో మొదలయింది. ఇక సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నా, ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నప్పటికీ అది సాధ్యమయ్యే పనికాదు. లక్షల కోట్ల నిధులు అవసరమవుతాయి.

కొన్ని హామీలు అస్సలు ఐదేళ్ల పరిపాలనలో కూడా అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక శాఖ అధికారులు కూడా చెప్పలేక చేతులు పిసుక్కుంటున్నారు. నెల నెలా పింఛను మొత్తం చెల్లించాలి. ప్రతి నెల ఒకటో తేదీన 2,500 కోట్ల రూపాయలు అవసరం. ఇక ఈ నెలలో రెండు ప్రతిష్టాత్మకమైన పథకాలు అమలు చేయనున్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను అమలు చేయడానికి సిద్ధమయ్యారు. అందుకే చంద్రబాబు విడతల వారీగా వాటిని జమ చేస్తామని చెబుతూ కొంత ఆర్థిక శాఖపై భారం తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. తల్లికి వందనం మూడు విడతలుగా చేస్తారట. అన్నదాత సుఖీభవం పథకం కూడా అంతే. తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి పదిహేను వేల రూపాయలు, అన్నదాత సుఖీభవం పథకం కింద ఏడాదికి ఇరవై వేల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఈ రెండు పథకాలతో పాటు ఆగస్టు నెల నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం కూడా అమలు చేయనున్నారు.కేంద్ర ప్రభుత్వం నుంచి అమరావతి, పోలవరం ప్రాజెక్టు కోసం ఇస్తున్న నిధులతో పాటు ఇతర వాటికి ఇచ్చే నిధులను తాను సంక్షేమ పథకాలకు ఖర్చు చేయలేమని చంద్రబాబు చెప్పేశారు. ప్రజలు తనను అర్థం చేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం చేసిన విధ్వంసం నుంచి బయటపడటానికి తాము ప్రయత్నిస్తున్నామని పదే పదే చెబుతున్నారు. తాజాగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ఖర్చులకే రాష్ట్రానికి వచ్చే ఆదాయం సరిపోతుందని, అందుకే ఎన్నిఅప్పులు చేసినా గత ప్రభుత్వం పది లక్షల కోట్ల రుణాలను తీర్చడానికి నిధులు వెచ్చించాల్సి వస్తుందని వాపోయారు. అందుకే ఆలస్యంగా హామీలను అమలు చేస్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు. ఈ మూడు పథకాలు మాత్రం కొనసాగే అవకాశముంది. అంతే తప్ప చంద్రబాబు గత ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేల రూపాయల భృతి పథకం మాత్రం ఇచ్చే ఛాన్స్ లేదు. ఎందుకంటే కోట్లాది రూపాయల నిధులు అవసరమవుతాయి. ఈ హామీని కోల్డ్ స్టోరేజీలోకి నెట్టేసినట్లే. ఇక నలభై ఏళ్లునిండిన మహిళలకు నెలకు రెండు వేల ఐదు వందల రూపాయలు కూడా ఇప్పట్లో ఇచ్చే అవకాశం లేదు.

మరొక వైపు ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీని కూడా నిధుల లేమితో బీమా కంపెనీలకు అప్పగించేందుకు సిద్ధమయ్యారు. దీంతో గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయడానికి ఎట్టిపరిస్థితుల్లో అవకాశం లేదని టీడీపీ నేతలే అంగీకరిస్తున్నారు. మరి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఏ రకంగా నచ్చ చెబుతారన్నది వేచి చూడాల్సింది.

## ఉరి వేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె ఉరి వేసుకుని ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ సంఘటన మదనపల్లెలో బుధవారం ఉదయం వెలుగు చూసింది. మండలంలోని కొండా మర్రిపల్లె పంచాయతీ, సత్య సాయి కాలనీలో ఉంటున్న చింతాకుల రెడ్డప్ప కొడుకు శ్రీనివాసులు(27), ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తుంటాడు. కుటుంబ సమస్యల కారణంగా ఉరి వేసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. బాధితున్ని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్సలు అందించినా పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పడంతో రుయాకు తరలించా

## జగన్ రాక్షస పాలనపై సమర శంఖంలా యువగళం

## యువగళం పుస్తకంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రశంస



అమరావతి: రాష్ట్ర రాజకీయాలను మలుపుతిప్పిన యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని యువనేత నారా లోకేష్... డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు అందజేశారు. క్యాబినెట్ సమావేశం సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో పుస్తక ప్రతిని పవన్ తో పాటు, ఇతర మంత్రులకు లోకేష్ అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... నాటి రాక్షస పాలనపై ప్రజలను చైతన్యవంతం చేయడంలో యువగళం పాదయాత్ర సఫలీకృత మైందన్నారు. ఆనాటి అనుభవాలను కళ్ళకి కట్టినట్లుగా పుస్తక రూపంలో తేవడంపై లోకేష్ ను ప్రశంసించారు. ఈ రోజుకి అరాచక పాలన అంతమై ఏడాది పూర్తయిందని, గత ప్రభుత్వ పాలన పీడకలను ఇప్పటికి జనం మర్చిపోలేదన్నారు. యువగళం పాదయాత్ర నాటి అనుభవాలను ఈ సందర్భంగా యువనేత లోకేష్... పవన్ కళ్యాణ్ తో పంచుకున్నారు.

# అప్రమత్తతే శ్రీ రామరక్ష

దేశవ్యాప్తంగా మళ్లీ కరోనా కేసులు కనిపిస్తున్నాయి. దేశంలో 2910 యాక్టివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖాధికారులు వెల్లడించారు.దేశంలో అత్యధిక యాక్టివ్ కేసులు కేరళ (1,147), ఆ తరువాత స్థానాల్లో మహారాష్ట్ర, ఢిల్లీ ఉన్నట్లు తెలిపారు.మహారాష్ట్ర ప్రజారోగ్య శాఖ ప్రకారం, రాష్ట్రంలో ప్రస్తుతం 425 యాక్టివ్ కరోనా కేసులు ఉండగా, మే 19 నుంచి కరోనా కారణంగా 9 మంది చనిపోయారు.కరోనాతో గతంలో లక్షల సంఖ్యలో ప్రజలు మరణించారు. కరోనా ముప్పు నుంచి తప్పించుకోవడానికి దేశవ్యాప్తంగా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.పెద్ద సంఖ్యలో ప్రజలు టీకా తీసుకున్నారు.గతంలో అంటే, 2022 వరకు మనం తీసుకున్న టీకాలు ఇప్పుడు వ్యాపిస్తున్న కరోనా కొత్త వేరియంట్‌పై ప్రభావవంతంగా పనిచేస్తాయా?కొత్త వేరియంట్ కారణంగా కరోనా మళ్లీ విజృంభించే అవకాశం ఉందాప్రస్తుతం సింగపూర్, హాంకాంగ్‌లలో కూడా కరోనా కేసులు పెరుగుతున్నాయి. వీటిలో చాలా వరకు కరోనా జేఎన్.1 వేరియంట్ కేసులని పరీక్షల్లో తేలినట్లు ఎకనామిక్ టైమ్స్ పేర్కొంది.జేఎన్.1 వేరియంట్ కొత్తది కాదు. ఇది గతంలో వ్యాపించిన ఒమిక్రాన్‌కు సబ్ వేరియంట్.జేఎన్.1 వేరియంట్ గురించి తెలుసుకోవడానికి ప్రొఫెసర్ సంజయ్ రాయ్‌ని చందన్ జజ్వాడే కలిసి మాట్లాడారు. సంజయ్‌రాయ్ కోవాగ్జిన్ వ్యాక్సిన్ తయారీ మూడు దశల్లో పాల్గొన్న ప్రధాన పరిశోధకుడు. ఆయన ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు.”జేఎన్.1 వేరియంట్‌ను గుర్తించి ఏడాది గడిచింది. ఇది కొత్త వైరస్ కాదు. ఇది తీవ్రమవుతుందా? లేదా? అనే విషయంపై మా దగ్గర పూర్తి సమాచారం ఉంది. జేఎన్.1 వేరియంట్ గురించి భయపడాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు చూసిన దాని ప్రకారం ఇది మామూలు జలుబు తరహాలో తేలికపాటిది. అంతకంటే కంటే కూడా బలహీనమైనదిగా చెప్పొచ్చు” అనిసంజయ్ రాయ్ వివరించారు.ఈ కొత్త వేరియంట్ పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై మేం నిపుణులను సంప్రదించాం.”ఒమిక్రాన్ కంటే జేఎన్.1 తేలికపాటిది. అయితే, ఈ వేరియంట్ త్వరగా వ్యాపిస్తుంది. ఒక వ్యక్తికి ఈ ఇన్‌ఫెక్షన్ సోకితే అతని నుంచి చాలా త్వరగా ఇతరులకు వ్యాపిస్తుంది. కానీ, భయపడాల్సిన అవసరం లేదు. చిన్నపిల్లలు, వృద్ధులు, ఇప్పటికే ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కచ్చితంగా జాగ్రత్తగా ఉండాలి. కరోనా లక్షణాలు కనిపించిన వారు ఇతరులకు దూరంగా ఉండాలి” అని బీబీసీతో నాగ్‌పూర్ ప్రభుత్వ వైద్య కళాశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అవినాష్ గవాండే చెప్పారు. కరోనా సమయంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్‌లో అవినాష్ సభ్యుడు.రెండేళ్ల క్రితం కరోనా ప్రపంచవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఆ సమయంలో కరోనా నుంచి రక్షణ కోసం ప్రజలకు కోవాగ్జిన్, కోవిషీల్డ్ అనే రెండు రకాల టీకాలు విస్తృతంగా ఇచ్చారు. కొంతమంది స్పుత్నిక్ టీకాను కూడా తీసుకున్నారు.మరి రెండేళ్ల కిందట తీసుకున్న టీకా, ప్రస్తుత వేరియంట్‌కూ పనిచేస్తుందా?రెండు డోసుల వ్యాక్సిన్‌తో పాటు బూస్టర్ డోస్ తీసుకున్న వారికి కచ్చితంగా కొంత ప్రయోజనం ఉంటుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహారాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ అవినాష్ భోండ్వే అన్నారు.”టీకా వేయించుకున్నంత మాత్రానా కరోనా రాదు అని చెప్పలేం. కానీ, కరోనా సోకితే లక్షణాలు తేలికపాటివిగా ఉంటాయి. టీకా రెండు డోసులతో పాటు బూస్టర్ డోస్ తీసుకున్న వ్యక్తుల్లో రోగనిరోధక శక్తి చాలా కాలం పాటు ఉంటుంది. కేవలం ఒకే డోసు, లేదా రెండు డోసుల టీకా తీసుకున్న వారిలో రోగనిరోధక శక్తి తగ్గవచ్చు. కరోనా టీకాలతో కచ్చితంగా ప్రయోజనం ఉంటుంది” అని ఆయన వివరించారు.గతంలో ఇచ్చిన టీకాలు, ప్రస్తుత వేరియంట్‌పై పనిచేయవని డాక్టర్ అవినాష్ గవాండే భావిస్తున్నారు.’ఏటా కరోనా టీకాలు వేయించుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందుకోసం ప్రతి ఏడాది కొత్త టీకాలను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే, ఇవే టీకాలు కొత్త వేరియంట్లపై పనిచేయవు.ఏడాది క్రితం ఇచ్చిన ఇన్‌ఫ్లూయెంజా టీకా, మరుసటి ఏడాదిఎలాగైతే పనికి రాదో కరోనా టీకాలు కూడా అంతే. కానీ, కొంతమందికి గతంలో తీసుకున్న టీకా ద్వారా కొంత రోగనిరోధక శక్తి ఉంటే అది ఈ వేరియంట్‌కు వ్యతిరేకంగా పోరాడటానికి సహాయపడుతుంది” అని ఆయన వివరించారు.అయితే, పరిశోధనా ఖర్చు ఎక్కువగా ఉండటం కారణంగా కొత్త వ్యాక్సిన్‌ను రూపొందించడం సాధ్యం కాదని అవినాష్ భోండ్వే అంటున్నారు.”ఇన్‌ఫ్లూయెంజా వైరస్ పూర్తిగా పరివర్తన చెందుతుంది. కాబట్టి దానికి ఏటా కొత్త టీకా విడుదల చేస్తారు. కరోనాలో కొత్త వేరియంట్లు పుట్టుకొస్తున్నాయి. ఇన్‌ఫ్లూయెంజాలో ఇలా జరుగదు. అందుకే, కరోనాకు గతంలో ఇచ్చిన టీకాలు కొంత ప్రయోజనం చేకూరుస్తాయి” అని ఆయన అంటున్నారు.అయితే, మరింత శక్తిమంతమైన కరోనా వేరియంట్ పుట్టుకొస్తే ఈ రోగనిరోధక శక్తి కొనసాగుతుందా లేదా అనే సందేహాలను ఆయన లేవనెత్తారు.ఈ కొత్త వేరియంట్ వేగంగా వ్యాపిస్తోందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి కరోనా కొత్త వేవ్ వస్తుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది.ఈసారి కొత్త వేవ్ వచ్చే అవకాశం తక్కువగా ఉందని డాక్టర్ అవినాష్ గవాండే అభిప్రాయపడ్డారు. దీని వెనుక మూడు కారణాలు ఉన్నాయని ఆయన అన్నారు.”మొదటిది, మన దేశంలో పెద్ద సంఖ్యలో ప్రజలు టీకాలు తీసుకున్నారు. అందువల్ల, కనీసం కొంతమందికైనా కొత్త వేరియంట్‌తో పోరాడేందుకు కొంత రోగనిరోధక శక్తి ఉంటుంది.రెండోది, ఈ వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందుతున్నప్పటికీ, దీని తీవ్రత తక్కువగా ఉంటుంది.

కాబట్టి ఇది ఎక్కువ మందికి సోకినా త్వరగానే నయం అవుతుంది.మూడోది, ఒక వ్యక్తి ఈ వేరియంట్ బారిన పడినప్పటికీ, తీవ్రత తక్కువగా ఉన్నందున వారికి కరోనా వచ్చినట్లు కూడా తెలియకపోవచ్చు” అని ఆయన వివరించారు.

# బీసీసీఐకి కొత్త అధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా

ముంబై జూన్ 4, త్వరలో బీసీసీఐకి కొత్త అధ్యక్షుడు రానున్నారు. ఆయన ఎవరో కాదు.. బీసీసీఐ ఉపాధ్యక్షుడిగా ఉన్న రాజీవ్ శుక్లా. ప్రస్తుత చీఫ్ రోజర్ బిన్నీ 2025 జూలైలో 70 ఏళ్లు నిండిన తర్వాత పదవి నుంచి వైదొలగుతారు.భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) నాయకత్వ మార్పుకు సిద్ధమవుతోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యుడు రాజీవ్ శుక్లా పేరు తెరపైకి వచ్చింది. అనుభవజ్ఞుడైన రాజకీయ వ్యూహకర్త, క్రికెట్ అడ్మినిస్ట్రేటర్ అయిన శుక్లా బోర్డు తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు రాజీవ్ శుక్లా ప్రస్తుతం బీసీసీఐ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ప్రస్తుత చీఫ్ రోజర్ బిన్నీ 2025 జూలైలో 70 ఏళ్లు నిండిన తర్వాత పదవి నుంచి వైదొలగుతారు. భారత క్రికెట్ బోర్డు నిబంధనల ప్రకారం 70 ఏళ్లు దాటిన తర్వాత బీసీసీఐలో ఏ వ్యక్తి కూడా ఏ పదవిలో ఉండకూడదు..బీసీసీఐ ప్రస్తుత ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జన్మించారు. ఆయన ప్రారంభ జీవితం విద్యారంగం, జర్నలిజంపై ఉండేది. జర్నలిస్ట్ గా కెరీర్ ప్రారంభించిన ఆయన జనసత్తా, రవివర్ వంటి ప్రముఖ పబ్లికేషన్స్ లో పనిచేశారు. పదునైన రాజకీయ విశ్లేషణ, కమ్యూనికేషన్ స్కిల్స్ ఆయనను రాజకీయాల్లో కెరీర్‌కు సహజంగానే వెళ్లేలా చేశాయి.2000లో రాజీవ్ శుక్లా అధికారికంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. మొదట్లో అఖిల భారతీయ లోక్ తాంత్రిక్ కాంగ్రెస్‌తో, ఆ తరువాత భారత జాతీయ కాంగ్రెస్‌లోకి వచ్చారు. అనతికాలంలోనే జాతీయ అధికార ప్రతినిధిగా, ఆ తర్వాత రాజ్యసభలో ఎంపీ వరకు ఎదిగారు.రాజీవ్ శుక్లా ఉత్తరప్రదేశ్ క్రికెట్ సంఘంలో కీలక వ్యక్తి. ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్‌లో సెక్రటరీగా పని చేశారు. ఆ తర్వాత బీసీసీఐ వైపు వచ్చారు. రాజీవ్ శుక్లా 2011లో ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) ఛైర్మన్‌గా నియమితులయ్యారు. వివాదాల మధ్య 2013లో ఆయన తాత్కాలికంగా పదవి నుంచి వైదొలిగారు. చివరకు 2015లో మళ్లీ ఆ పదవిలోకి వచ్చారు. 2020లో బీసీసీఐ ఉపాధ్యక్షుడయ్యారు.బిన్నీ స్థానంలో శుక్లా అధ్యక్షుడిగా నియమితులైతే జనరల్ బాడీ, అపెక్స్ కౌన్సిల్ సమావేశాలన్నింటికీ ఆయన అధ్యక్షత వహించాల్సి ఉంటుంది. బీసీసీఐ ఆడిట్ చేసిన వార్షిక ఖాతాలు, ఇతర ఆర్థిక ప్రకటనలపై సంతకం చేయాల్సిన ముగ్గురు వ్యక్తులలో ఆయన ఒకరు అవుతారు.

# అమెరికా వర్సెస్ చైనా

## మిక్కీ, మౌస్ లలో నేతల వ్యవహారం

న్యూఢిల్లీ, జూన్ 4, (న్యూస్ పల్స్)చైనా ఆర్థిక, సాంకేతిక వ్యూహాలు అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేయడానికి ఉద్దేశించినవి. దక్షిణ చైనా సముద్రం, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ వంటి చర్యలు ఈ లక్ష్యంలో భాగం. అయితే, అమెరికా ఆంక్షలు, ఇండో?పసిఫిక్ ఒప్పందాలు చైనాకు సవాళ్లుగా నిలిచాయి. చైనా ఆఫ్రికాలో వాణిజ్య ఆధిపత్యం సాధించినప్పటికీ, పూర్తి విజయం సాధించలేకపోయింది, త్రిశంకు స్వర్గంలా మధ్యలో నిలిచిపోయింది.

బ్రిక్స్ దేశాలు డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించేందుకు కొత్త కరెన్సీ లేదా చెల్లింపు విధానం కోసం చర్చించాయి. 2024లో రష్యా ‘ది యూనిట్‘ అనే బంగారం ఆధారిత కరెన్సీని ప్రదర్శించినప్పటికీ, ఇది అమలులోకి రాలేదు. చైనా?ఇండియా విభేదాలు, ఏకీకృత బ్యాంకు లేకపోవడం వంటి సమస్యలు ఈ ప్రయత్నాన్ని అసాధ్యం చేశాయి. డాలర్ ఇప్పటికీ 58% గ్లోబల్ రిజర్వ్‌లలో ఆధిపత్యం చెలాయిస్తోంది.చైనా దక్షిణ చైనా సముద్రంలో 2016లో ఖఅం తీర్పును తిరస్కరించడం ద్వారా అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించిందని విమర్శలు ఎదుర్కొంది. ఈ తీర్పు చైనా చర్యలను నియంత్రించలేకపోయింది, ఇది చైనా యొక్క ‘సినోసెంట్రిక్‘ లక్ష్యాలను కొనసాగించేలా చేసింది. ఈ వైఫల్యం చైనా అంతర్జాతీయ చట్టపరమైన సవాళ్లను సూచిస్తుంది.చైనా యొక్క భౌగోళిక రాజకీయ లక్ష్యాలు అమెరికాతో పోటీ, బ్రిక్స్ కరెన్సీ, చట్టపరమైన సవాళ్లు పాక్షిక విజయాలు, పాక్షిక వైఫల్యాలతో త్రిశంకు స్వర్గంలా నిలిచిపోయాయి.

ఇండో?పసిఫిక్‌లో చైనా దూకుడు..

తైవాన్‌ను చైనా తన భూభాగంలో భాగంగా పరిగణిస్తుంది. అయితే తైవాన్ తనను స్వతంత్ర దేశంగా చూస్తోంది. ఈ అంశం దశాబ్దాలుగా చైనా?తైవాన్ మధ్య, అలాగే చైనా?అమెరికా మధ్య ఉద్రిక్తతలకు కారణమైంది. పీట్ హెగ్సెత్ తన ప్రసంగంలో చైనా తైవాన్ చుట్టూ సముద్ర జలాల్లో యుద్ధ విమాన వాహక నౌకలను మోహరిస్తూ బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇటీవలి సంవత్సరాల్లో, చైనా తైవాన్ సమీపంలో సైనిక విన్యాసాలు, యుద్ధ విమానాల రాకపోకలను పెంచింది. ఇది ఈ ప్రాంతంలో భద్రతా ఆందోళనలను పెంచింది. ఉదాహరణకు, 2024లో చైనా తైవాన్ సమీపంలో రికార్డు స్థాయిలో సైనిక విన్యాసాలు నిర్వహించినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్, తైవాన్ అంశం చైనా అంతర్గత వ్యవహారమని, ఇందులో విదేశీ దేశాల జోక్యం అనవసరమని స్పష్టం చేశారు.

ఈ స్పందన చైనా “ఒకే చైనా” విధానాన్ని గట్టిగా నొక్కి చెబుతుంది, ఇది తైవాన్‌ను తమ భూభాగంగా చూసే వైఖరిని ప్రతిబింబిస్తుంది.ఇండో?పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడు కేవలం తైవాన్‌కే పరిమితం కాదు. దక్షిణ చైనా సముద్రంలో చైనా ఏకపక్ష చర్యలు, ద్వీపాల నిర్మాణం, సైనికీకరణ వంటివి ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేషియా వంటి దేశాలతో వివాదాలకు దారితీశాయి. హెగ్సెత్ తన ప్రసంగంలో ఈ భౌగోళిక వివాదాలను ప్రస్తావిస్తూ, చైనా ఈ ప్రాంతంలో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తోందని విమర్శించారు. చైనా యొక్క “బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్” (ఃఖీఎ) ద్వారా ఆర్థిక, వాణిజ్య ఒత్తిళ్లను కూడా ఈ ప్రాంతంలోని దేశాలపై చైనా చేస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదనంగా, హెగ్సెత్ పనామా కాలువపై చైనా ఆధిపత్య ప్రయత్నాలను ప్రస్తావించారు. చైనా లాటిన్ అమెరికాలో తన ప్రభావాన్ని పెంచుకోవడానికి పనామా కాలువను ఒక వ్యూహాత్మక సాధనంగా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చైనా యొక్క ఆర్థిక, సైనిక విస్తరణ వైఖరిని ఎదుర్కోవడానికి అమెరికా తీసుకుంటున్న చర్యలను సూచిస్తాయి.చైనా దూకుడును అడ్డుకోవడానికి అమెరికా ఇండో?పసిఫిక్ ప్రాంతంలో తన సైనిక, ఆర్థిక సామర్థ్యాలను బలోపేతం చేస్తోంది. హెగ్సెత్ తన ప్రసంగంలో ఈ ప్రాంతంలోని మిత్ర దేశాలైన జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, భారతదేశం వంటి దేశాలతో సహకారాన్ని పెంచడం, రక్షణ వ్యయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంలో, ఆసియా?పసిఫిక్ ప్రాంతంలో అమెరికా నాయకత్వంలో ఏర్పడిన సహకారం మరింత బలపడుతోంది. ఈ కూటమి చైనా యొక్క ఆధిపత్య ధోరణులను అడ్డుకోవడానికి కీలక పాత్ర పోషిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా తైవాన్‌కు ఆయుధాల సరఫరా, సైనిక శిక్షణను కొనసాగిస్తోంది, ఇది చైనాకు కోపం తెప్పిస్తోంది.చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్, అమెరికా తైవాన్‌కు ఆయుధాల సరఫరా, సైనిక సంబంధాలను నిలిపివేయాలని హెచ్చరించారు. “నిప్పుతో ఆడుకోవద్దు” అనే వ్యాఖ్య చైనా యొక్క గట్టి వైఖరిని, ఈ అంశంలో ఎట్టి రాజీ లేని స్థితిని సూచిస్తుంది. ఈ ఉద్రిక్తతలు భవిష్యత్తులో సైనిక ఘర్షణలకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇండో?పసిఫిక్ ప్రాంతంలో అమెరికా?చైనా మధ్య ఈ ఉద్రిక్తతలు కేవలం రాజకీయ, సైనిక సమస్యలకే పరిమితం కాక, ఆర్థిక, వాణిజ్య రంగాలపై కూడా ప్రభావం చూపవచ్చు. చైనా ఆర్థిక ఒత్తిళ్లు, వాణిజ్య ఆంక్షలు ఈ ప్రాంతంలోని దేశాల ఆర్థిక స్థిరత్వాన్ని ప్రభావితం చేయవచ్చు. అదే సమయంలో, అమెరికా యొక్క సైనిక బలోపేతం, మిత్ర దేశాలతో సహకారం ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు కీలకం.

# తెలుగు రాష్ట్రాల్లో జామాతేలు..

హైదరాబాద్, జూన్ 4, అటు ఆంధ్ర, ఇటు తెలంగాణలో ఒకటే పేరు అది అనిల్... జామాత దశమ గ్రహం..అంటారు..యాదృచ్ఛికమే గాని...రెండు చోట్ల అదే పేరు తెరపైకి వచ్చింది. వైఎస్ షర్మిల భర్తపేరు బ్రదర్ అనిల్. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భర్తపేరు అనిల్‌కుమార్. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా ప్రముఖమైన ఈ ఇద్దరు మహిళల భర్తల పేర్లు ‘అనిల్’ కావడం ఒక ఆసక్తికరమైన యాదృచ్ఛికం. ఈ పేరు వారి జీవితంలోని ఇబ్బందులకు కారణమా అనే ప్రశ్న సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది.అనిల్’ అనే పేరు సంస్కృతం నుండి ఉద్భవించింది, ఇది “వాయు దేవుడు” లేదా “గాలి” అని అర్థం. హిందూ సంప్రదాయంలో, పేరు ఎంపిక జన్మ నక్షత్రం, రాశి, జాతకంతో సంబంధం కలిగి ఉంటుంది. జ్యోతిషశాస్త్రంలో, ‘అనిల్’ స్వేచ్ఛ, చైతన్యం, శక్తిని సూచించే శుభప్రదమైన పేరుగా పరిగణించబడుతుంది. ఈ పేరు మొదటి అక్షరం ‘అ’ కొన్ని నక్షత్రాలకు (ఉదాహరణకు, అశ్విని, కృత్తిక) అనుకూలంగా ఉంటుంది. కానీ దీని శు భాశుభ ప్రభావం వ్యక్తి జాతకంపై ఆధారపడి ఉంటుంది. జ్యోతిష్యంలో, ఒక పేరు వల్ల జీవితంలో సవాళ్లు రావడం అనేది గ్రహ స్థితులు, దశలు, కర్మ ఆధారంగా ఉంటుంది, కానీ ‘అనిల్’ పేరు సాధారణంగా ప్రతికూల సూచనలతో ముడిపడి ఉండదు. అందువల్ల షర్మిల, కవిత ఇబ్బందులకు ఈ పేరు కారణమని ఊహించడం జ్యోతిషశాస్త్ర ఆధారంగా సమర్థనీయం కాదు.వైఎస్ షర్మిల, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి కుమార్తె, రాజకీయంగా అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో తన అన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో విభేదాల తర్వాత, వైఎస్సార్ తెలంగాణ పార్టీ పెట్టారు. ఆదరణ రాకపోవడంతో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరి సొంత రాజకీయ గుర్తింపు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. 2024 ఎన్నికలలో ఆమె కడప నియోజకవర్గం నుండి పోటీ చేసినప్పటికీ, విజయం సాధించలేకపోయారు.షర్మిల భర్త అనిల్ కుమార్, ఒక క్రై స్తవ ప్రచారకుడు, ఆమె రాజకీయ నిర్ణయాలపై ప్రభావం చూపినట్లు కొన్ని సోషల్ మీడియా పోస్టులు సూచించాయి. ఉదాహరణకు, బయ్యారం గనుల వివాదంలో అతని పేరు వివాదాస్పదంగా మారింది, కానీ ఇవి ఎక్కువగా ఆరోపణలు మాత్రమే. షర్మిల సవాళ్లు రాజకీయ పోటీ, కుటుంబ విభేదాలు, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆమె స్థానం కోసం పోరాటం నుండి ఉద్భవించాయి. ఈ సమస్యలకు ‘అనిల్’ పేరుతో సంబంధం లేదని స్పష్టమవుతుందికల్వకుంట్ల కవిత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కుమార్తె, భారత రాష్ట్ర సమితి నాయకురాలిగా గుర్తింపు పొందారు. 2024లో ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆమె అరెస్టు రాజకీయంగా వివాదాస్పదమైంది. ఈ కేసు కేంద్ర ఏజెన్సీలైన ఈడీ మరియు సీబీఐ దర్యాప్తులతో ముడిపడి ఉంది, ఇది బీఆర్ఎస్ పార్టీ రాజకీయ స్థితిని బలహీనపరిచింది. అదనంగా, ఆమె తన సోదరుడు కేటీఆర్‌తో కొన్ని రాజకీయ విభేదాలను ఎదుర్కొన్నట్లు గీలోని కొన్ని చర్చలు సూచిస్తున్నాయి. కవిత భర్త అనిల్ దేవ్ ఈ వివాదాలలో ప్రత్యక్షంగా ప్రమేయం లేనప్పటికీ, ఆమె సవాళ్లు రాష్ట్ర రాజకీయ ఒడిదొడుకులు, చట్టపరమైన ఒత్తిడులు పార్టీలో ఆమె పాత్రకు సంబంధించినవి. ‘అనిల్’ పేరు ఈ సమస్యలతో ఎటువంటి సంబంధం లేదని స్పష్టమవుతుంది.షర్మిల, కవిత భర్తల పేరు ‘అనిల్’ కావడాన్ని ఒక యాదృచ్ఛికంగా గుర్తించి, ఈ పేరు వారి ఇబ్బందులకు కారణమా అని ప్రశ్నించాయి. ఈ చర్చలు ఎక్కువగా హాస్యాస్పదంగా లేదా ఊహాగానాలుగా ఉన్నాయి, కానీ ఇవి వాస్తవ ఆధారాలపై ఆధారపడవు. “అనిల్ అనే పేరు షర్మిల, కవితలకు శాపంగా మారిందా?” అని సరదాగా ప్రశ్నించగా, మరొక పోస్ట్ ఈ ఇద్దరు మహిళల రాజకీయ సవాళ్లను వారి భర్తల ప్రభావంతో ముడిపెట్టింది. అయితే, ఈ ఆలోచనలు వాస్తవికత కంటే ఊహాజనితమైనవి.తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా చురుకైన మహిళలు ఎదుర్కొనే సవాళ్లు తరచూ కుటుంబ నేపథ్యం, సామాజిక అంచనాలు, రాజకీయ పోటీతో ముడిపడి ఉంటాయి. షర్మిల, కవిత ఇద్దరూ బలమైన రాజకీయ కుటుంబాల నుండి వచ్చినవారు, కానీ వారి సొంత గుర్తింపు సాధించడం కోసం పోరాటం చేయాల్సి వచ్చింది. ఈ సందర్భంలో, వారి భర్తల పేరు ‘అనిల్’ కావడం కేవలం యాదచ్ఛికం మాత్రమే, మరియు ఈ పేరు వారి సవాళ్లకు కారణమని భావించడం ఆధార రహితం.జ్యోతిషశాస్త్రంలో, ఒక వ్యక్తి జీవితంలో సవాళ్లు గ్రహ స్థితులు, దశలు, వ్యక్తిగత కర్మపై ఆధారపడతాయి, కానీ పేరు ఒక్కటే ఈ సవాళ్లకు కారణం కాదు. అదే సమయంలో, సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి చర్చలు తరచూ రాజకీయ ఉద్దేశాలతో లేదా హాస్యం కోసం జరుగుతాయి. షర్మిల, కవిత విషయంలో, వారి సవాళ్లు రాజకీయ ఒత్తిడులు, చట్టపరమైన సమస్యలు, మరియు కుటుంబ డైనమిక్స్ నుండి ఉద్భవించాయి, ‘అనిల్’ అనే పేరు నుండి కాదు

# ఏనుగు దాడిలో రైతు మృతి

చిత్తూరు ఏనుగు దాడిలో రైతు మృతి చెందాడు. ఐరాల మండలం నాగవాండ్లపల్లి లో ఘటన జరిగింది. పొలం దగ్గర నిద్రిస్తున్న రైతు నాగరాజు పై గజరాజు అర్ధరాత్రి దాడి చేసింది. ఏనుగు దాడిలో ఘటనా స్థలం వద్దే రైతు నాగరాజు మృతి చెందాడు. నాగరాజు కుటుంబాన్ని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఏనుగుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలంటూ గ్రామస్తులకు ఎమ్మెల్యే సూచించారు. దారి తప్పి జనావాసాల్లోకి వస్తున్న ఏనుగులను తిరిగి అడవిలో పంపడంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని అటవీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

# పాము కాటుకు ఒకరు మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం



శ్రీకాకుళం జిల్లా : ఇచ్ఛాపురం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పట్టణ పరిధి అమీన్ సాహెబ్ పేటలో ఘోర సంఘటన చోటు చేసుకుంది. పాము కాటుకు గురై ఒకరు మృతి చెందగా ఇద్దరు పరిస్థితి విషమంగా వుంది. వేసవి కావడంతో తలుపులు తెరిచి నిద్రిస్తున్న వ్యక్తులకు పాము కాటేయడం తో తనగాన పూజ (27)మృతి చెందింది. వంజరన జయరాం(10), గీత కృష్ణవేణి (17) పరిస్థితి విషమంగా మారింది. . పాము కాటేయడంతో ఒక్కసారిగా వారంతా అపస్మారక స్థితికి వెళ్లిపోవడంతో బంధువులు ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బరంపురం పెద్ద ఆసుపత్రికి తీసుకుపోయారు. మార్గమధ్యంలో తలగాన పూజ అంబులెన్స్ లోనే మృతి చెందింది.

# కరీంనగర్ లో డివిజన్ల నోటిఫికేషన్

కరీంనగర్, జూన్4, మున్సిపల్ ఎన్నికలకు త్వరలోనే నగరా మోగనున్న నేపథ్యంలో పట్టణాలు, నగరాల్లో విలీన గ్రామాలకు సంబంధించి డివిజన్లు, వార్డుల పునర్విభజనకు రాష్ట్ర సర్కారు సోమవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ మేరకు ఈ నెల 3న డివిజన్ల విభజనకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉంటుంది 5 నుంచి 11 వరకు అభ్యంతరాలు, నివేదికలు స్వీకరించాలి. 12 నుంచి 16 వరకు అభ్యంతరాలను పరిశీలించాల్సి ఉంటుంది. 17, 18 తేదీల్లో డివిజన్ల విభజన పత్రాలకు కలెక్టర్ అనుమతి తీసుకోవాలి. 19న ముసాయిదా జాబితాను సీడీఎంఎకు పంపించాలి. 20న సీడీఎంఏ నుంచి ప్రభుత్వానికి నివేదికను పంపించి, 21న ఫైనల్ డివిజన్ల జాబితాను విడుదల చేస్తారు.కరీం‘నగరం’ సమీపంలో కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు మల్కాపూర్, చింతకుంట, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్ గ్రామాలను కలుపుతూ ప్రస్తుతం ఉన్న 60 డివిజన్లను 66కు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు నగరపాలక అధికారులు 66 డివిజన్లకు సంబంధించి గతంలోని ఓటరు జాబితాను అనుసరించి డివిజన్ల విభజనను పూర్తి చేసి సీడీఎంఏకు పంపినట్లు సమాచారం. అందుకు సంబంధించిన ఒక జాబితా కూడా గతంలోనే సోషల్ మీడియాల్లో చక్కర్లు కొట్టింది. అప్పటి నుంచే కార్పొరేషన్‌లోని వివిధ పార్టీల నాయకుల్లో డివిజన్ల విభజనపై ప్రత్యేక ఆసక్తి నెలకొన్నది.ఎవరికివారే తమ డివిజన్ల విభజన ఎలా జరిగింది? ఏయే కాలనీల ఓట్లు ఏయే ప్రాంతాల్లో కలిపారన్న చర్చలు సాగాయి. ప్రతి డివిజన్‌కు 4500 నుంచి 5500 ఓటర్లు ఉండేలా అధికారులు డివిజన్లను విభజించినట్లు తెలుస్తుండగా, అయితే పలు డివిజన్లల్లో దూర ప్రాంతాలకు చెందిన ఇండ్లను చేర్చినట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాలకు సంబంధించి ఫిర్యాదులు, తమ అభ్యంతరాలు తెలిపేందుకు ఇప్పటికే పలు పార్టీలకు చెందిన నాయకులు సిద్ధమయ్యారు

# చంద్రగిరి కోట ప్రాంగణంలో పెద్ద ఎత్తున యోగ కార్యక్రమం నిర్వహణ...

**యోగా మన దైనందిన జీవితంలో ఒక భాగం కావాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్**

**యోగాంధ్ర లో అందరూ భాగస్వాములు కావాలి**

**ఎమ్మెల్యే పులివర్తి నాని**

**యోగాతో సంపూర్ణ ఆరోగ్యం...**

**తుడా ఛైర్మెన్ డాలర్స్ దివాకర్ రెడ్డి**



తిరుపతి యోగా మన దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎంఎల్ఏ పులివర్తి నాని, తుడా ఛైర్మెన్ డాలర్స్ దివాకర్ రెడ్డి సంయుక్తంగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా చరిత్ర కలిగిన చంద్రగిరి కోట నందు యోగ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ యోగాంధ్ర-2025 శిక్షణా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ ఇతర నాయకులు అధికారులు పాల్గొని యోగాసనాలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నెల రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖపట్నం లో నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరవుతారని అన్నారు. నెలరోజులు పాటు యోగాపై ప్రజలకు అవగాహన, ప్రయోజనాలు వివరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొంచామని అన్నారు. మ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ యోగ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని తెలిపారు అలాగే ప్రతి ఒక్కరు ఇంకో నలుగురికి యోగ చేయడం వల్ల ప్రయోజనాలను వివరించి వారి చేత కూడా యోగాను చేయించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని తెలిపారు.

తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో ప్రతి మనిషి ఉద్యోగరీత్యా వ్యాపార రీత్యా అధిక ఒత్తిడికి గురవుతున్నారని ఒత్తిడి వలన అనేక వ్యాధులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగ చక్కని మార్గమనితెలియజేసారు. యోగాని ప్రతి మనిషి జీవితంలో భాగం చేసుకోవాలని ప్రతిరోజు 30 నిమిషాల పాటు యోగా చేయడం వలన అనేక జబ్బులకు దూరంగా ఉండవచ్చునని తెలియజేశారు. సర్వరోగ నివారిణిగా యోగ పనిచేస్తుందని సైంటిఫిక్ గా నిరూపితమైందన్నారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు మహిళలు యువకులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువవికాస్ పథకం మరింత ఆలస్యం

హైదరాబాద్, జూన్4, రాజీవ్ యువ వికాసం స్కీమ్ అమలుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇవాళ అందజేయాల్సిన శాంక్షన్ లెటర్ల ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసింది. మరింత పూర్తి స్థాయి పరిశీలన తర్వాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు.తెలంగాణ రాజీవ్ యువ వికాసం స్కీమ్ మంజూరు పత్రాల అందజేత ప్రక్రియ వాయిదా పడింది. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన వివరాల ప్రకారం? నేటి నుంచి జూన్ 9వ తేదీ వరకు లబ్ధిదారులకు శాంక్షన్ లెటర్లను అందజేయాల్సి ఉంది. రూ. లక్షలోపు యూనిట్లకు ముందుగా ఇవ్వనున్నట్లు కూడా ప్రకటించింది. అయితే అనూహ్యంగా చివరి నిమిషంలో శాంక్షన్ లెటర్ల అందజేత ప్రక్రియపై సర్కార్ వెనక్కి తగ్గింది.రాజీవ్ యువ వికాసం స్కీమ్ కు భారీ దరఖాస్తులు వచ్చాయి. అన్ని జిల్లాల నుంచి కలిపి 16.22 లక్షల మంది అప్లికేషన్ చేసుకున్నారు. అనూహ్యమైన రీతిలో దరఖాస్తులు రావటంతో? దరఖాస్తుల పరిశీలన విషయంలో ప్రభుత్వం పలు జాగ్రత్తలను చేపట్టింది. అన్ని కోణాల్లో దరఖాస్తుదారుడి వివరాలను సేకరించే ప్రయత్నం చేసింది. విడతలవారీగా శాంక్షన్ లెటర్లను అందజేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ముందుగా రూ. లక్ష లోపు యూనిట్లను ఇచ్చేందుకు సిద్ధమైంది.భారీగా దరఖాస్తులు రావటంతో పరిశీలన ప్రక్రియ కాస్త ఇబ్బందిగానే కొనసాగింది. అయితే లబ్ధిదారుల ఎంపిక పక్కాగా ఉండాలని? అనర్హులకు దక్కవద్దనే అభిప్రాయాలు భారీగా వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయాన్ని ప్రభుత్వంలోని మంత్రులు?. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. పూర్తి స్థాయి పరిశీలన తర్వాతే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. ఒక్క అనర్హుడికి కూడా స్కీమ్ అందవద్దని స్పష్టం చేశారు. ఈ అంశంపై మంత్రివర్గ భేటీలో చర్చించి? నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. దీంతో ఇవాళ చేపట్టాల్సిన మంజూరు పత్రాల జారీ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడాల్సి వచ్చింది.జూన్ 5వ తేదీన తెలంగాణ కేబినెట్ భేటీ కానుంది. ఇందులో యువ వికాసం స్కీమ్ తో పాటు మరికొన్ని స్కీమ్ లపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు చివరి నిమిషంలో శాంక్షన్ లెటర్ల ప్రక్రియ వాయిదా పడటంతో? పలువురు దరఖాస్తుదారులు నిరాశకు లోనయ్యారు.ఈ స్కీమ్ కింద ఈ ఏడాదికి 5 లక్షల మంది అర్హులను(లబ్ధిదారులను) ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీని కోసం రూ.6,250 కోట్ల నిధులను కేటాయించింది. కేబినెట్ భేటీ తర్వాత? లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముందుకుసాగటంతో పాటు శాంక్షన్ లెటర్లను అందజేసే అవకాశం ఉంది.

# లేఅవుట్లలో ప్లాట్ల వేలం..

## ఈ ప్రాంతాల్లోనే, గజం ధర ఎంతంటే..?

హైదరాబాద్, జూన్4, హైదరాబాద్ మహానగరం చుట్టూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ప్లాట్ల విక్రయానికి రంగం సిద్ధమైంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఈ ప్లాట్ల విక్రయ ప్రక్రియను ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు కు ఇరువైపులా ఉన్న ఇమ్ముల్‌నర్వ, ప్రతాప్‌సింగారం, తొర్రూరు, లేమూరు ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా రైతుల నుంచి భూములను సేకరించి హెచ్ఎండీఏ లేఅవుట్‌లను అభివృద్ధి చేసింది. ఈ ప్రాంతాల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పించింది. హెచ్ఎండీఏ 60-40 నిష్పత్తిలో భూములను అభివృద్ధి చేసి 60 శాతం ప్లాట్లను భూములు ఇచ్చిన రైతులకు కేటాయించింది. మిగిలిన 40 శాతం ప్లాట్లు హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్నాయి. వీటిని ప్రస్తుతం అమ్మకానికి పెట్టేందుకు సిద్ధమయ్యారు. లేమూరులో 83 ఎకరాల్లో అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో మొత్తం 497 ప్లాట్లు ఉండగా.. 333 ప్లాట్లు రైతులకు కేటాయించారు. మిగిలిన 164 ప్లాట్లను హెచ్ఎండీఏ విక్రయించనుందిప్రతాప్‌సింగారంలో 165 ఎకరాల్లో విస్తరించి ఉన్న లేఅవుట్‌లో మొత్తం 1093 ప్లాట్లు అభివృద్ధి చేశారు. రైతులకు కేటాయించినవి పోగా.. 793 ప్లాట్లు హెచ్ఎండీఏ ఆధీనంలో విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. తొర్రూరులో 117 ఎకరాల్లో అతిపెద్ద లేఅవుట్‌గా అభివృద్ధి చేయగా.. ఇందులో 985 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. కొన్ని అమ్ముడుపోగా.. ప్రస్తుతం 493 ప్లాట్లు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ ప్లాట్లకు గజానికి కనీస ధర రూ.20-30 వేలపైనే ఉండవచ్చని అంచనా. అత్యధిక ధర కోట్ చేసిన వారికి ప్లాట్లను వేలం ద్వారా విక్రయించనున్నారుప్రస్తుతం స్థిరాస్తి రంగంలో కొంత స్తబ్దత నెలకొన్నప్పటికీ.. హైదరాబాద్ మార్కెట్‌కు పెద్దగా ఇబ్బంది ఉండదని రియల్ ఎస్టేట్ నిపుణులు, అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో మాదిరిగానే ఈ ప్లాట్లకు మంచి స్పందన లభిస్తుందని ఆశిస్తున్నారు. ప్లాట్ల విక్రయం ద్వారా వచ్చే నిధులను నగర అభివృద్ధి పనులకు మళ్లించాలని హెచ్ఎండీఏ యోచిస్తోంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే వేలం ప్రక్రియ ప్రారంభమవుతుంది.

### ఉప ముఖ్యమంత్రి పవన్ ను కలిసిన మంత్రి లోకేష్

తాడేపల్లి రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తక ప్రతిని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ నాటి రాక్షస పాలనపై ప్రజలను చైతన్యవంతం చేయడంలో యువగళం పాదయాత్ర సఫలీకృతమైందన్నారు.

# గ్రేటర్ రేషన్ కార్డుల దందా

హైదరాబాద్, జూన్4, రేషన్ కార్డుల కోసం ఇప్పుడు ప్రజలు మీ సేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఇదే అదునుగా భావించిన పౌరసరఫరాల అధికారులు డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో 30 శాతం కమీషన్లు ఇస్తేనే పనులు చేస్తున్నారంటూ పలువురు రాష్ట్ర మంత్రులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మేమేం తక్కువ తిన్నామా అంటూ కొందరు అధికారులు సైతం వారిని ఆదర్శంగా తీసుకొని అవినీతి దందాకు తెరలేపారు.

ప్రతి రోజూ అందినకాడికి దండుకుంటున్నారు. రెండు మూడు రోజుల్లోనే కొత్త రేషన్ కార్డులు ఇప్పిస్తామని కొందరు సివిల్ సప్లై ఉద్యోగులతో పాటు పలువురు దళారులు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే అరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా కావాల్సింది ప్రధానంగా రేషన్ కార్డు. ప్రతి పేద, నిరు పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ప్రతిష్టాత్మకంగా రేషన్ కార్డు అనేది అవసరం. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వాలనే ఉద్దేశంతో మీసేవ సెంటర్ల ఆన్‌లైన్ చేసుకొని పౌరసరఫరాల కార్యాలయాల్లో వాటిని వెరిఫికేషన్ చేసి వెంటనే కార్డు మంజూరు చేయాలని ప్రభుత్వం చెబుతుంటే దీనికి భిన్నంగా పౌరసరఫరాల అధికారులు వ్యవహరిస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం గత ఏడాది నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. వాటి విచారణను మాత్రం పౌరసరఫరాల అధికారులు జీహెచ్ఎంసీకి అప్పగించించారు. కొత్తగా కార్డు కావాలనుకునే వారు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునే అవసరం లేదంటూ అప్పట్లో అధికారులు ప్రకటించారు. అయితే రెండు శాఖల అధికారుల సమన్వయ లోపంతో తీరా ప్రజా పాలన దరఖాస్తులను పక్కన పెట్టి జీహెచ్ఎంసీ అధికారులు చేతులెత్తేశారు. దీంతో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు కూడా తాజాగా మరో సారి మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. దీంతో గతంలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న కుటుంబాలతో పాటు కొత్తగా రేషన్ కార్డు కావాలనుకునే వారు, కార్డులో మార్పులు చేర్పులు చేసుకునే వారు మీ సేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు. అయితే వీరిది అవసరం..ఇదే మనకు అవకాశంగా భావించిన కొంత మంది పౌరసరఫరాల అధికారులు కొందరు దళారుల అండతో అక్రమంగా డబ్బుల వసూళ్లకు పాల్పడుతూ భారీ అవినీతికి తెరలేపారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.కొత్త రేషన్ కార్డుల మంజూరులో ఏరియా సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్లు కీలకంగా మారారు. దీంతో అంబర్ పేట సర్కిల్ పరిధిలోని అంబర్ పేట డివిజన్ పరిధిలోకి వచ్చే 2 ?3 ఇంటి నంబర్లకు సంబంధించిన విచారణ అధికారిగా విధులు నిర్వహిస్తోన్న ఓ సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్ అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారి కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల ఇంటి వెళ్లి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి అసలైన అర్హులను గుర్తించి వారికి కొత్త రేషకార్డులను మంజూరు చేయాల్సి ఉంటుంది?కానీ అతను అంబర్ పేట పటేల్ నగర్ హనుమాండ్ల గుడి వద్ద ఓ వారం రోజుల పాటు క్యాంపు ఏర్పాటు చేసుకొని తూతూ మంత్రంగా విచారణ చేపట్టి వదిలేశాడని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి విచారణ పేరుతో వెళ్లి ఏదో కారణం చూపిస్తూ మీకు కార్డు రాదంటూ బయపెడుతున్నారని దీంతో చేసేది ఏమీ లేక రూ.వెయ్యి లంచం ఇచ్చుకోక తప్పడం లేదని పలువురు పేరు తెలపడానికి ఇష్ట పడని అర్హులైన పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంచం ఇచ్చే వారి పట్ల ప్రేమగా ఉంటూ .. నెలలు గడిచినా ఇంకా కొత్త కార్డు రాలేదని అర్హులైన దరఖాస్తు చేసుకున్న సామాన్య ప్రజలు సర్కిల్ కార్యాలయం వద్దకు వెళితే బెదిరింపులకు పాల్పడుతూ సరైన సమాధానం చెప్పకుండా వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

ఇదిలా ఉంటే కాంగ్రెస్ పాలనలో ఇది కామనే ?అంటూ ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ అక్రమ దందాలో పలు పార్టీల నాయకులతో పాటు తాడు, బొంగరం, ఊరు పేరు లేని పొట్ట చీల్చితే అక్షరం రాని కొందరు విలేకరులు కూడా దళారులుగా మారి అందిన కాడికి దండుకుంటున్నారు. కొత్త రేషన్ కార్డు వెంటనే ఇప్పిస్తామంటూ సదరు దళారులు మీ సేవా కేంద్రాల్లో నమోదు చేసిన దరఖాస్తులను లబ్ధిదారుల వద్ద తీసుకుని వారి వద్ద రూ.2వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరు అంబర్ పేట డివిజన్ సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్ తో కుమ్మక్కై ఓ ఒప్పందం కుదర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. లబ్ధిదారుల వద్ద తీసుకున్న డబ్బుల్లో రూ.వెయ్యి ఇన్ స్పెక్టర్ కు లంచంగా ఇవ్వడంతో అదే రోజు అనర్హులైనా ఎలాంటి విచారణ చేయకుండా వాటిని క్లియరెన్స్ చేస్తున్నట్లు ఆరోపణలు సైతం ఉన్నాయి. దీంతో వారికి కేవలం రెండు రోజుల్లోనే కొత్త కార్డులు మంజూరు అవుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే కొంతమంది నెలలు గడిచినా రేషన్ కార్డు మంజూరు కాకపోవడంతో తమకు కార్డు వస్తుందో ..రాదో అంటూ ఆందోళన చెందుతున్నారు. డబ్బులు తీసుకొని రేషన్ కార్డులు మంజూరు చేసే అధికారుల పైన ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రేషన్ కార్డు లబ్ధిదారులు కోరుతున్నారు

# ఆరోగ్య కేంద్రాల్లో సగం మందే ఉద్యోగులు

హైదరాబాద్, జూన్4, హైదరాబాద్‌లో ఆరోగ్యకేంద్రాలు అనారోగ్యానికి గురయ్యాయి. సిబ్బంది కొరత కారణంగా నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో వెనుకడుగు వేస్తున్నాయి. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(యూపీహెచ్‌సీ) అత్యంత కీలకమైన మెడికల్ అధికారి పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నాడి పట్టే వైద్యులు లేక పేదలకు నానా అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నవారే అదనపు సెంటర్లలో వైద్యసేవలందిస్తున్నారు. మరికొన్ని కేంద్రాల్లో ఏఎన్ఎంలే చికిత్సనందిస్తుండటం గమనార్హం. పేదవాడికి జబ్బుచేస్తే వెంటనే గుర్తుకొచ్చేది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే. కేసీఆర్ పాలనలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలతో పాటు బస్తీ దవాఖానలు సైతం ఏర్పాటు చేసి పేదవాడి ఇంటి ముందే ఉచిత వైద్యం చేరవేశారు. జిల్లాలోని బస్తీవాసులు, పేద ప్రజలు, మధ్యతరగతి ప్రజలకు బస్తీ దవాఖానలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు నిరంతరం నాణ్యమైన వైద్యసేవలందించాయి. కానీ నేడు అవన్నీ సిబ్బంది కొరతతో స్వాగతం పలుకుతున్నాయి. హైదరాబాద్ జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో మొత్తం 85 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో కేవలం 45 మంది మెడికల్ అధికారులే ఉండటం గమనార్హం. ఎనిమిది నెలల కిందట జరిగిన బదిలీల్లో హైదరాబాద్ జిల్లాలోని 40 మంది మెడికల్ అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఇక్కడి నుంచి బదిలీ చేసిన రాష్ట్ర సర్కార్ బదిలీ కారణంగా ఏర్పడ్డ ఖాళీలను నింపడంలో నిర్లక్ష్యపు ధోరణితో వ్యవహరిస్తున్నది. ఈ కారణంగా ప్రస్తుతం ఒక్కో మెడికల్ అధికారి వారంలో మూడురోజులు విధులు నిర్వహిస్తున్న కేంద్రంలో, మరో మూడు రోజులు మెడికల్ అధికారి లేని సెంటర్‌కు వెళ్లి విధులు నిర్వహిస్తున్నారు. దీని కారణంగా మెడికల్ అధికారులు అధిక పని ఒత్తిడికి గురవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి యూపీహెచ్‌సీలో కనీసం ఒక మెడికల్ అధికారి, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎంలు విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ జిల్లాలో కీలకమైన మెడికల్ అధికారి పోస్టులే ఖాళీగా ఉన్నాయి. రోగి ఆరోగ్య పర్యవేక్షణలో మెడికల్ అధికారి పాత్ర కీలకం. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడం, సాధారణ జ్వరం నుంచి వ్యాధి నిర్ధారణ వరకు పలు సమస్యలకు మందులు సూచించడం, మాతా శిశు ఆరోగ్య కార్యక్రమం వంటి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయడం, చిన్న చిన్న గాయాలకు చికిత్సలందించడం, పోషకాహారం, వ్యాధి నివారణపై సలహాలు అందించడంతో పాటు ఇతర సిబ్బందిని ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. సంబంధిత సెంటర్‌లో మెడికల్ అధికారి పోస్టు ఖాళీగా ఉండటం వల్ల ఆ సెంటర్‌లో సరైన పర్యవేక్షణ కూడా కరవైపోతున్నది. రోగాలబారిన పడి వైద్య పరీక్షల కోసమని యూపీహెచ్‌సీలకు వచ్చే రోగులు మెడికల్ అధికారి లేకపోవడంతో సరైన వైద్య పరీక్షలు చేయించుకోలేకపోతున్నారు. ఏఎన్ఎంలు ఇచ్చే మాత్రలు తీసుకొని నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఖాళీలను భర్తీ చేయాల్సిన రాష్ట్ర సర్కార్ నేటికి చర్యలు చేపట్టని కారణంగా పేదవాడు ప్రభుత్వ వైద్యమంటే వెనకడుగు వేస్తున్న వైనం నెలకొంది. తమ ప్రాంతంలో ఉన్న యూపీహెచ్‌సీలో ఖాళీలను భర్తీ చేయాలంటూ జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

# జలమండలి విస్తరణకు సన్నాహాలు

హైదరాబాద్, జూన్4, హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సేవలు అందిస్తున్న జలమండలి తన పరిధిని విస్తరించడానికి సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న జలమండలి.. ఇకపై ౹ఖీఖీ వెలుపల ఉన్న ప్రాంతాలకూ నీటిని అందించేలా కార్యాచరణ రూపొందిస్తోంది. దీనిపై అధికారులు ఇప్పటికే ప్రాథమిక ప్రణాళికను సిద్ధం చేశారు. హైదరాబాద్ రీజినల్ రింగ్‌రోడ్డు లోపల అభివృద్ధికి మార్గం సుగమం అవుతున్న నేపథ్యంలో జలమండలి పరిధిని విస్తరించడం ద్వారా భవిష్యత్ తాగునీటి అవసరాలను తీర్చవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న శంషాబాద్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, నార్సింగి, తుక్కుగూడ, పెద్దఅంబర్‌పేట, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తెల్లాపూర్, తూంకుంట, అమీన్‌పూర్ మున్సిపాలిటీలు ఔఆర్ఆర్‌కు అటూఇటూ విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలోని కొన్ని గ్రామాలు ఔటర్ రింగు రోడ్డు వెలుపలా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో భారీగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జరుగుతుండటంతో.. తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ మేరకు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఇటీవల విస్తరణ ప్రణాళికపై అధికారులతో సమీక్షించారు.గోదావరి 2,3 దశల ప్రాజెక్టుకు త్వరలో శంకుస్థాపన చేయనున్నారు. రూ. 7360 కోట్లతో 20 టీఎంసీల గోదావరి జలాలు హైదరాబాద్ నగరానికి సరఫరా కానున్నాయి. ఇందులో 15 టీఎంసీలను నేరుగా తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. రెండేళ్లలో ఈ జలాలు అందుబాటులోకి రానుండటంతో.. దీనికి అనుగుణంగా కొత్త ప్రాంతాలకు నీటిని అందించేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం జల మండలి 13.72 లక్షల కనెక్షన్లు కలిగి ఉంది. 1.30 కోట్ల జనాభాకు 550 ఎంజీడీల ( మిలియన్ గ్యాలన్స్ పర్ డే) నీటిని ప్రతి రోజూ సరఫరా చేస్తుంది. జలమండలి విస్తరణతో హైదరాబాద్ దాని పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన తాగునీటి సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల ప్రజలు బోర్లు, ప్రైవేటు వాహనాల ద్వారా నీటికి కొనుక్కొని తాగుతున్నారు. జల మండలి విస్తరణతో ఎలాంటి తాగునీటి ఇబ్బందులు ఉండవని అధికారులు అంటున్నారు.

### బొత్స సత్యనారాయణకు తీవ్ర అస్వస్థత..

విజయనగరం మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చీపురుపల్లిలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. వేదికపై మాట్లాడుతూ బోత్స ఒక్కసారిగా వడదెబ్బతో కుప్పకూలిపోయారు. వెంటనే అక్కడున్నవైకాపా నేతలు అయనను ఆసుపత్రికి తరలించారు,.

# బాచుపల్లి... పూర్తయ్యేది ఎప్పుడూ..

హైదరాబాద్, జూన్ 4,మియాపూర్ నుండి బొల్లారం వరకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను తగ్గించడానికిహైదరాబాద్‌లోని బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతూ ఉంది. ఈ ఫ్లైఓవర్ నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఉన్నాయి. పరిపాలనాపరమైన అడ్డంకులు, యుటిలిటీ బదిలీ, నిధుల కొరత కారణంగా నిర్మాణం ఆలస్యమవుతూ వస్తోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న బాచుపల్లి ప్రాంతంలో కనెక్టివిటీని పెంచడానికి ప్రారంభించబడిన ఈ ప్రాజెక్ట్ పూర్తవ్వడానికి చాలా సమయమే తీసుకునేలా ఉంది.ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతోందని, ఆఫీసులకు వెళ్లాలన్నా, రావాలన్నా చాలా సమయం తీసుకుంటూ ఉందని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ భరించలేని విధంగా మారిపోయిందని, ఫ్లైఓవర్ పూర్తవ్వడం కోసం సంవత్సరాలుగా వేచి ఉన్నామని నిజాంపేట నివాసితులు చెబుతున్నారు. ఫ్లై ఓవర్ పని నిర్మాణం చాలా నెమ్మదిగా సాగుతూ ఉందని, ఎప్పటికీ అంతం కానిదిగా అనిపిస్తుందని స్థానిక మెకానిక్ శివ అన్నారు. ఎన్నికల కారణంగా కూడా నిర్మాణం ఆలస్యమైందని, ఇకనైనా వేగంగా పనులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఐటీ ఉద్యోగి విష్ణు చెప్పారు. బాచుపల్లి, మల్లంపేట, నిజాంపేట ప్రాంతాల ప్రయాణికులు రద్దీ సమయాల్లో ప్రయాణ సమయం చాలా ఎక్కువగా ఉందని అంటున్నారు. ఇరుకైన మళ్లింపులు, కొన్ని సార్లు వాహనాలు బ్రేక్‌డౌన్ అవ్వడం సమస్యను మరింత తీవ్రం చేస్తుంటాయి. నిర్మాణ స్థలంలోని చాలా చోట్ల సరైన బారికేడ్లు, సూచికలు లేవని తెలుస్తోంది. ఇక జాప్యానికి ప్రధాన కారణం భూసేకరణ అని కూడా స్థానికులు చెప్పారు. అందుకోసమే రెండు సంవత్సరాలకు పైగా సమయం పట్టిందని, అలైన్‌మెంట్‌లోని అనేక ఆస్తులకు క్లియరెన్స్ అవసరం ఉండడంతో సుదీర్ఘమైన చట్టపరమైన ఫార్మాలిటీలు నిర్మాణ సమయాన్ని పొడిగించాయి. నీటి పైపులైన్ల పనులకు కూడా మరో మూడు నెలలు సమయం ఎక్కువైందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కారణంగా విద్యుత్ స్తంభాల తరలింపు మరింత వాయిదా పడింది. ఈ దశలో విద్యుత్తు అంతరాయం ఎన్నికల కార్యకలాపాలకు అంతరాయం కలిగించే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. ఎన్నికల సీజన్ లో విద్యుత్ మౌలిక సదుపాయాలను పట్టించుకోకపోవడంతో పనులు మరింత ఆలస్యమయ్యాయి. ఇలా ఎన్నో కారణాల వలన బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తవ్వడం ఆలస్యమవుతూనే వస్తోంది.

# లిక్కర్ క్వీన్ అంటూ యాష్కీ టార్గెట్

నిజామాబాద్, జూన్ 4, ఆమె యాక్షన్‌కి? ఈయన రియాక్షన్. అప్పుడైనా?ఇప్పుడైనా? ఆమెకి కౌంటర్ వేసేది ఆయనేనా..? పార్టీ ఇక ఫుల్ పవర్స్ ఇచ్చేసిందా? అట్నుంచి ఎప్పుడు పొలిటికల్ మిసైల్ వదిలినా?. మన పార్టీకి ఎస్ 400లా అడ్డుకోవాల్సింది నువ్వేనని అధిష్టానం చెప్పేసిందా? ఇంతకీ ఎవరా ఇద్దరు నేతలు? వాళ్ళ మధ్యనే పొలిటికల్ యుద్ధం ఎందుకు ఎక్కువగా జరుగుతోంది? తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్ అంటే?. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఇష్యూ నే. బీజేపీ?కాంగ్రెస్ అంటూ మాటల తూటాలు ఎక్కు పెడుతున్నారామె. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టార్గెట్ గా? ఆరోపణలు గుప్పిస్తున్నారు. తెలంగాణ సంస్కృతిని ధ్వంసం చేసే కుట్ర జరుగుతోందని ఫైరై పోతున్నారు కవిత. ఆమె పరంగా వ్యవహారం అలా ఉంటే? ఇటు కాంగ్రెస్‌వైపు నుంచి మాత్రం పెద్దగా ఎవరూ రియాక్ట్ అవ్వొద్దన్న అనధికార ఆదేశాలున్నాయట. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ని టార్గెట్ చేస్తున్నా?. ఆమె విషయంలో అట్నుంచి ఇంతవరకు రియాక్షన్ రానప్పుడు మనం మాత్రం స్పందించడం ఎందుకని అనుకుంటున్నారట కాంగ్రెస్ లీడర్స్. అయితే? తాజాగా మాజీ ఎంపీ మధు యాష్కీ రియాక్ట్ అవడంతో ఆసక్తిగా గమనిస్తున్నాయి రాజకీయ వర్గాలు. గతంలో కూడా కవితపై మాట్లాడాలంటే? ముందుండే వారు కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ. ఇద్దరు నేతలు గతంలో నిజామాబాద్ ఎంపీలుగా పనిచేసిన వారే. ఇద్దరి మధ్య రాజకీయ వైరం అక్కడి నుంచే ఉందని అంటున్నారు పరిశీలకులు. కవిత, యాష్కీ మధ్య నిజామాబాద్‌లో మొదలైన యుద్ధం ఇప్పుడు హైదరాబాద్ చేరినట్టు చెప్పుకుంటున్నారు. మొదట్నుంచి కూడా కవిత చేసే విమర్శలపై మధుయాష్కీనే ఎక్కువగా స్పందిస్తున్నారు.ఈ క్రమంలో వరుసగా? వారం రోజులుగా సాగుతున్న వ్యవహారం పై.. సీరియస్ గానే స్పందించారు మధు యాష్కి. లిక్కర్ క్వీన్ కవిత బీజేపీ వదిలిన బాణమేనంటూ?ఘాటుగా స్పందించారాయన. లిక్కర్ కేసునుండి బయట పడటానికి బీజేపీ సహకారం కవితకే కావాలని, ఆమె మీద నిజామాబాద్ లో ఐబబి స్కామ్ కూడా ఉందని ఆరోపించారు యాష్కీ. తన అవినీతిని కప్పి పుచ్చుకోవడానికే ఆమె పొలిటికల్ డ్రామాలు మొదలుపెట్టారంటూ అటాక్ చేశారు కాంగ్రెస్ మాజీ ఎంపీ. ఆమె సొంత సంస్థ జాగృతిలో? 800 కోట్ల రూపాయల అవినీతి జరిగిందంటూ బాంబు పేల్చారాయన. జాగృతి మీద విచారణ జరిపించాలని, ఆ దిశగా సీఎం రేవంత్ ఆదేశించాలని కూడా కోరారు మధు యాష్కి. అసలామెను కాంగ్రెస్‌లో చేర్చుకొనేంత అంత ఖర్మ మాకు పట్టలేదంటూ స్ట్రాంగ్‌గా రియాక్ట్ అయ్యారాయన. మొత్తం మీద కవిత విషయంలో ఇన్నాళ్లు సమయమనం పాటించిన కాంగ్రెస్ పార్టీ తమ తరపున కౌంటర్ వేయడానికి మధు యాష్కీకి ఫుల్ పవర్స్ ఇచ్చినట్టు చెప్పుకుంటున్నారు.

నిజామాబాద్ ఎంపీ సీట్లో ఇద్దరికీ డైరెక్ట్ ఫైట్ ఉన్నందున ఆయనే కరెక్ట్ అని భావిస్తున్నారట కాంగ్రెస్ పెద్దలు. మరీ స్పందించకుండా ఉన్నా.. ఇబ్బందే కాబట్టి? అవసరమైనట్టు, సందర్భానికి తగ్గట్టుగా కవిత చేసే ఆరోపణలకు కౌంటర్స్ వేసే బాధ్యతను మధుకు అప్పగించారట కాంగ్రెస్ పెద్దలు.

# బీఆర్ ఎస్.. సెంటిమెంట్ ...

మెదక్,, జూన్ 4, తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సెంటిమెంటు చాలా ఎక్కువ. ఆయన హేతువాది అని ఎక్కడా చెప్పుకోలేదు. అయితే.. గియితే.. కమ్యూనిస్టు భావజాలం కొంత మేరకు ఉన్నా.. అవి ఆయన సెంటిమెంటుకు అడ్డం కూడా కాలేదు. నుదిటిన బొట్టు పెట్టినా.. ఎన్నికల సమయంలో యాగాలు చేసినా.. ఆయన సెంటిమెంటు స్పష్టంగా కనిపిస్తుంది. ఒక్క ఎన్నికల సమయం అనేకాదు.. అసలు ఆది నుంచి కూడా సెంటిమెంటుకు పెద్ద పీట వేశారు.ఏ కార్యక్రమం ప్రారంభించాలన్నా.. ఒకటికి రెండు సార్లు పండితులను మార్చి మార్చి ముహూర్తాలు ఫిక్స్ చేయించారన్న చర్చ కూడా గతంలో ఉంది. కాళేశ్వరం భూమి పూజకు కాకినాడ పండితులతోనే కాకుండా .. ఇతర రాష్ట్రాలకు చెందిన పండితులతోనూ ముహూర్తం పెట్టించారు. ఇక, ఏదైనా పథకం ప్రారంభించాలన్నా.. ఆయన ముహూర్త బలానికి పెద్దపీట వేస్తారు. ఇలా.. సెంటిమెంటుకు ప్రాధాన్యం ఇచ్చే కేసీఆర్ కు.. "బీ" అనే పదం కలిసి రావడం లేదా? అనే చర్చ సాగుతోంది.తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని భారత రాష్ట్రసమితిగా మార్చిన దరిమిలా.. టీఆర్ఎస్ కాస్తా.. బీఆర్ఎస్ అయింది. మరక మంచిదే అన్న యాడ్ ప్రకారం.. మార్పు మంచిదే అనుకుందాం. కానీ.. ఆ తర్వాత.. రాజకీయంగా జరిగిన.. జరుగుతున్న పరిణామాలను గమనిస్తే.. టీ కాస్తా "బీ"గా మారిన తర్వాత.. కేసీఆర్ గ్రాఫ్ పడిపోతూ వచ్చింది. ఇది వాస్తవం. 2001లో టీఆర్ఎస్ ఏర్పాటు చేశాక.. కేసీఆర్ గ్రాఫ్ అమాంతం పెరిగింది. ఆయనను అనతి కాలంలోనే ముఖ్యమంత్రి అయ్యేలా చేసింది.

ఇక,2022, అక్టోబరులో(రెండోసారి అధికారంలోకి వచ్చాక) టీఆర్ఎస్‌ను కాస్తా బీఆర్ఎస్ చేశాక.. అనతి కాలంలో జారు బండపై కుస్తీలు పట్టే పరిస్తితి ఏర్పడింది. మొత్తం వివరణ కన్నా.. కొన్ని కీలక పాయింట్లు చూస్తే.. కేసీఆర్ ఎంత వేగంగా గ్రాఫ్‌ను పోగొట్టుకున్నారో.. తెలుస్తుంది. అయితే.. ఇది బీఆర్ఎస్‌గా మార్పు జరిగిన తర్వాతే జరిగిన పరిణామం కాబట్టి.. కేసీఆర్‌కు 'బీ' అక్షరం కలిసి రాలేదన్న వాదన ఆయన వర్గంలో వినిపిస్తోంది.

బీఆర్ఎస్‌గా మారాక.. ఇలా.. ధమాల్!

1) బీఆర్ఎస్ ఏర్పడిన ఏడాది కాలంలోనే అధికారం కోల్పోయారు.

2) బీఆర్ఎస్‌తో జాతీయ రాజకీయాలు చేయాలని అనుకుని.. ప్రాంతీయ స్థాయికి పరిమితం అయ్యారు.

3) బీఆర్ఎస్ ఏర్పడ్డాకే.. రాజకీయ చిక్కులు మరిన్ని ఎక్కువై.. కుమార్తె కేసులో చిక్కుకుని.. జైలు బాటపట్టారు.

4) బీఆర్ఎస్ గా మార్పు చేశాక.. ఎన్నికలకు ముందు ఫోన్ ట్యాపింగ్ కేసు ఉచ్చులా మారింది.

5) బీఆర్ఎస్‌గా ఏర్పాటు చేసుకున్నాక.. తెలంగాణ సమాజంలో కేసీఆర్ 'దిగ్గజం' అనే టాక్ తగ్గుముఖం పట్టింది.

6) సొంత ఇంట్లోనే రాజకీయ కుంపటి ప్రారంభమైంది.

7) చిత్రం ఏంటంటే.. ఏడాది తిరిగే సరికి.. కేసీఆర్ కు ఆపరేషన్ చేయించాల్సి వచ్చింది.

8) పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ ఎస్‌ను ప్రజలు స్వాగతించలేక పోయారు.

9) కన్న కూతురే కంట్లో నలుసుగా మారారు.

కొసమెరుపు? ఇవన్నీ యాదృచ్ఛికాలో.. లేక కోరి చేసుకున్నవో.. ఏదైనా కూడా.. బీఆర్ఎస్ అనే పేరు మార్పు తర్వాత జరిగిన పరిణామాలు కావడంతో కేసీఆర్ అనుచరులు.. సెంటిమెంటుకు ముడిపెడుతున్నారు.

# డివైడర్ పై దూసుకువచ్చిన లారీ

## వ్యక్తి దుర్మరణం



ఏలూరు డివైడర్ పై నిద్రిస్తున్న వ్యక్తి పైకి పార్సెల్ సర్వీస్ లారీ దూసుకుపోయింది దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ఉదయం ఏలూరు జాతీయ రహదారిలో రత్నస్ డాబా సమీపంలో చోటుచేసుకుంది. మృతుడు ఏలూరు మంచినీళు తోటకు చెందిన రోళ్ళ చంద్రరావు( 44) గా గుర్తించారు. అయితే ఈయన గత కొంతకాలం క్రితం ఇంటి నుండి వచ్చేసి ఇలా డివైడర్ పై నిద్రిస్తూ ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

# నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## -ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటేందుకు ప్రయత్నిద్దాం..భావితరాలను కాపాడుదాం




ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 5 తేదిన జరుపుతారు. పర్యావరణానికి అనుకూలమైన చర్యలు తీసుకోవడానికి అవసరమైన ప్రపంచ అవగాహనను పెంచడానికి ఈ రోజున కొన్ని చర్యలు చేపడతారు. ఇది యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా నడపబడుతుంది. ఈ రోజున మానవ పర్యావరణం పై ఐక్యరాజ్యసమితి సమావేశం ప్రారంభించింది. 1972 జూన్ 5 వ తేది నుంచి 16 వ తేది వరకు మానవ పర్యావరణంపై ఐక్యరాజ్యసమితి సమావేశం అయింది. ఈ సందర్భంగా 1972 లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ద్వారా ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఏర్పాటు చేయబడింది. 1973 లో మొదటిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రపంచ పర్యావరణ దినోత్సవమును జూన్ 5 తేదిన వేర్వేరు నగరాలలో విభిన్న రీతులలో అంతర్జాతీయ వైభవంగా జరుపుకుంటున్నారు. 2022 జూన్ 5తో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంబరాలకు 50 ఏళ్లు పూర్తయ్యాయి. తొలిసారిగా స్వీడన్ లో 1972వ సంవత్సరం ఐక్యరాజ్యసమితి నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ సదస్సు లో వాతావరణ మార్పులను గమనిస్తూ తగు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని గుర్తించారు. 1973 నుంచి జూన్ 5న ప్రతియేటా ప్రపంచ పర్యావరణ దినం విశ్వవ్యాప్తంగా జరుపుకుంటున్నాం. ఐరాస ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (యూఎన్ఈపీ) ఏటా ఏదో ఒక అంశంతో పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నాలు చేస్తూవస్తోంది. ఈసారి 'ఓన్లీ వన్ ఎర్త్' థీమ్‌తో పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలన్నీ కలసికట్టుగా ప్రయత్నించాలని పిలుపునిచ్చింది. గ్రీన్ లైఫ్ స్టైల్‌ను అలవర్చుకోవడంతో పాటు పచ్చదనం, పరిశుభ్రతల కోసం చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ కార్యక్రమాన్ని స్వీడన్ నిర్వహిస్తోంది. ఇంకా ఆలస్యం కాకముందే 'సేవ్ ఎర్త్' చేద్దాం

చాలా దేశాలు 2024లో ఇప్పటి వరకు అత్యంత వేడి వేసవిని చవిచూస్తున్నాయి. భారతదేశం కూడా గణనీయమైన ఉష్ణోగ్రత పెరుగుదలను చూస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న బలమైన ఎల్నినో ఘటన కారణంగా ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా పెరగడం పాక్షికంగా ఉందని శాస్త్రవేత్తలు వివరించారు . ఇది ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదలకు గణనీయమైన సహకారాన్ని అందించగలదని అంచనా వేయబడింది, ఇది పారిశ్రామిక పూర్వ స్థాయిల కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ యొక్క క్లిష్టమైన థ్రెషోల్డ్ను అధిగమించగలదు.

దీనికి సంబంధించిన దృష్టాంతంలో, పర్యావరణాన్ని పరిరక్షించడం అనేది కేవలం వ్యక్తులు లేదా ప్రభుత్వం యొక్క కర్తవ్యం కాదనే అవగాహనను గుర్తించడం మరియు అమలు చేయడం చాలా ముఖ్యమైనది. ఈ బాధ్యత సమిష్టిగా ఉంటుంది.మరియు అన్ని వాటాదారులందరూ కలిసి పర్యావరణాన్ని సంరక్షించడం మరియు రక్షించడం బాధ్యత వహిస్తారు. తద్వారా స్థిరమైన మరియు సానుకూల మార్పులు ఈ రోజు మాత్రమే కాకుండా మన రేపటికి కూడా ప్రయోజనం చేకూరుస్తాయి. 2024ఈ సంవత్సరం, ప్రపంచ పర్యావరణ దినోత్సవం భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ మరియు కరువును తట్టుకునే శక్తిని ప్రోత్సహించడం ద్వారా "మా భూమి, మా భవిష్యత్తు" జరుపుకోవడానికి రిమైండర్గా వస్తుంది ఇది గ్రహం యొక్క సంరక్షకులుగా ఉండటానికి మాకు శక్తినిస్తుంది.

వ్యక్తులు. వ్యాపారాలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రభుత్వాలు సమిష్టిగా మన పచ్చదనాన్ని మరియు సహజ వనరులను దోపిడీకి గురిచేసే ముందు మన భూములను కాపాడుకోవడానికి చర్యలు తీసుకోవాలి.

## తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి

### -నేడు ఆయన జయంతి

రావి నారాయణరెడ్డి ప్రముఖ స్వాతంత్ర్యోద్యమ నాయకుడు, నిజాం పాలన వ్యతిరేక విమోచనోద్యమకారుడు మరియు రాజకీయ నాయకుడు. జూన్ 5, 1908న భూస్వామ్య కుటుంబంలో నల్గొండ జిల్లా భువనగిరి మండలం బొల్లేపల్లిలో జన్మించారు. ప్రాథమిక విద్య బొల్లేపల్లి, భువనగిరిలలో చదివారు. ఆ తర్వాత హైదరాబాదులోని రెడ్డి హాస్టల్ లో ఉండి హైస్కూలు పూర్తిచేశారు. చాదర్ ఘాట్ హైస్కూలులో ఎస్సెస్సెల్సీ, నిజాం కళాశాలలో ఇంటర్మీడియట్ అభ్యసించారు.

విద్యార్థి దశలోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. కాకినాడ వెళ్ళి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. గాంధీ సిద్ధాంతాలకు ఆకర్శితుడై స్వగ్రామం బొల్లేపల్లిలో ఖాదీ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పారు. 1933లో హైదరాబాదులో ఏర్పాటైన హరిజన్ సేవా సంఘానికి కార్యదర్శిగా పనిచేశారు. తొలినాళ్ళలో ఆర్యసమాజ్ ప్రభావానికి లోనైననూ చివరకు సోవియట్ రష్యా పురోభివృద్ధికి ఆకర్షితుడై కమ్యూనిష్టుగా మారినారు. 1934లో పోచంపల్లిలో సీతాదేవితో వివాహం జరిగింది. తెలంగాణ సాయుధ పోరాటంలో ఈమె కూడా పాల్గొన్నది.

1941లో చిలకూరులో జరిగిన ఆంధ్రమహాసభకు, 1944లో భువనగిరి ఆంధ్రమహాసభకు, 1945లో ఖమ్మంలో జరిగిన సమావేశానికి రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. 1944లో రావి అధ్యక్షత వహించిన భువనగిరి ఆంధ్రమహాసభలో అతివాద, మితవాద వర్గాల అభిప్రాయ భేదాల కారణంగా రెండుగా చీలిపోయింది.

కమ్యూనిష్టు అధీనంలోకి వచ్చిన దానికి రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. 1946-51 కాలంలో తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారు. నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటంలో 4 వేల గ్రామాలకు చెందిన లక్షలాది ప్రజలు పాల్గొన్నారు. ఈ పోరాటం ఫలితంగా 10లక్షల ఎకలారల భూమి పేదరైతులకు దక్కింది.

1952లో తొలి సార్వత్రిక ఎన్నికలలో రావి నారాయణరెడ్డి భువనగిరి నుంచి లోకసభకు పోటీచేసి దేశంలోనే అధికంగా (నెహ్రూ కంటె) మెజారిటీ సాధించారు. 1957, 1962లలో భువనగిరి నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 1957లో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు. రావి నారాయణ రెడ్డి 1967లో స్వచ్ఛందంగా రాజకీయాల నుంచి విరమణ పొందారు. ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. వందకుపైగా పాఠశాలలు, వసతి గృహాలు నిర్మించారు. భూమి లేని నిరుపేదలకు తన 200 ఎకరాల సొంత భూమిని దానం చేశారు.

పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు బీబీనగర్ - నడికుడి మార్గం కోసం పోరాడారు. బొల్లేపల్లి పరిధిలోని నాగిరెడ్డిపల్లి రైల్వేస్టేషన్ కు ఉచితంగా స్థలాన్ని ఇచ్చారు. ఈ స్టేషన్ కు రావినారాయణరెడ్డి రైల్వేస్టేషన్ గా నామకరణం చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా అమలులోకి రాలేదు. 1978లో ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి కళాప్రపూర్ణ బిరుదును అప్పటి గవర్నర్ శారదా ముఖర్జీ చేతుల మీదుగా అందుకున్నారు. 1991 సెప్టెంబరు 7న మరణించారు. మరణానంతరం 1992లో భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదు ప్రకటించారు.

## ఎలాంటి సమస్యలు లేకుండా నడుస్తున్న కూటమి ప్రభుత్వం

విజయవాడ ఇస్కాన్ టెంపుల్ గ్రౌండ్ లో జనసేన ఆధ్వర్యంలో "సుపరిపాలన మొదలై ఏడాది" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హాజరయ్యారు.×రాష్ట్రం లో వైసిపి పాలన "పీడ విరగడై ఏడాది" ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సుపరిపాలన మొదలై సంవత్సరం పూర్తయిన సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కేక్ కట్ చేసారు.ఎంపి శివనాథ్ మాట్లాడుతూ "సుపరిపాలన మొదలై ఏడాది" సందర్భంగా మొట్టమొదటిగా జనసేన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఎన్డీఏ కూటమి లో ఎలాంటి సమస్యలు లేకుండా నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు చేదోడుగా ఉన్న మంత్రి నారా లోకేష్ మంత్రి నాదెండ్ల మనోహర్ కు ఎంపీ కేశినేని శివనాథ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సుపరిపాలనతో రాష్ట్రం అన్ని రంగాలలో అగ్రగామిగా ఉంటుంది.. మరో 30 ఏళ్ళు రాష్ట్రాన్ని పాలించే విధంగా ఎన్డీఏ కూటమి ఐక్యమత్యంగా ఉంటుందని అయన అన్నారు.

## ఎర్రగడ్డ ఆసుపత్రిలో రోగులకు అస్వస్థత

### హరీష్ రావు మండిపాటు

మెదక్ వేములవాడలో కోడెల మృతి, ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి హరీష్ రావు తీవ్ర విమర్శలు చేసారు.

హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేత కావడం లేదు. ఎర్రగడ్డలో మానసిక రోగులకు అన్నం పెట్టడానికి చేత కావడం లేదు. 70 మంది అస్వస్థతకు గురైతే సీఎం ఇప్పటివరకు స్పందించలేదు. వేములవాడలో కోడెల మృత్యువాత పడుతుంటే మీకు సోయి లేదా అని నిలదీసారు. ఇప్పటివరకు గడ్డి లేక 27 కోడెలు చనిపోతే ప్రభుత్వం ఎం చేస్తున్నట్టు. మీకు చేత కాకపోతే మాకు బాధ్యత అప్పగిస్తే కోడెలను మేము కాపాడుతాం. ఎంత సేపు మాపై కక్ష కట్టి ఏ కేసుల్లో ఇరికించాలి, ఏ కమిషన్ వెయ్యాలి అన్న ఆలోచనలే కానీ అసలు సమస్యలు పట్టించుకోరా. రేపటి క్యాబినెట్ మీటింగ్ లో రైతు బంధు డబ్బులను విడుదల చేయాలని అన్నారు.

## సర్దార్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మాధవరం

## కార్పోరేటర్ ను అరెస్టు చేయకపోతే ధర్నా

హైదరాబాద్ కార్పోరేటర్ పెడుతున్న ఇబ్బందులకు తాళలేక ఆత్మహత్య చేసుకున్న సర్దార్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ,మైనారిటీ సెల్ అధ్యక్షుడు గౌసుద్దీన్ బుధవారం పరామర్శించారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరాలని లేకపోతే కట్టుకున్న ఇల్లును కూల్చివేస్తానని బోరబండ కాంగ్రెస్ కార్పోరేటర్ శపథం చేసాడు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని జిహెచ్ఎంసి అధికారులతో టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఇండ్లను సీజ్ చేయిస్తున్నారని అన్నారు.

నిరుపేదలు ఇండ్లు కట్టుకుంటే బోరబండ కార్పొరేటర్ లక్షలకొద్ది వసూళ్లు చేస్తున్నాడు. బిఆర్ఎస్ పార్టీలో ఉన్న నాయకులు ఇండ్లను కూల్చివేయడం సీజ్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్. అయ్యప్ప సొసైటీలో జీరో పర్మిషన్ బిల్డింగ్ కట్టుకుంటే కూల్చివేతలు చేపట్టారు.70 గజాలలో నిరుపేదలు ఇండ్లు కట్టుకుంటే కూల్చివేస్తారా...? సర్దార్ ఆత్మహత్యకు కారణమైన కార్పొరేటర్ ను ఇప్పటివరకు పోలీసులు అరెస్ట్ చేయలేదు. సర్దార్ ఆత్మహత్యకు కారణమైన కార్పొరేటర్ ను అరెస్టు చేయకపోతే బోరబండలో ధర్నా చేపడతామని అన్నారు.

బిఆర్ఎస్ పార్టీ సర్దార్ కుటుంబానికి అన్యాయం చేసిన వాళ్లకు వదిలిపెట్టాం. టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా టిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. పార్టీలకు అతీతంగా అధికారులు పనిచేయాలి అతి ఉత్సాహం ప్రదర్శిస్తున్నారని అన్నారు. రాబోయేది టిఆర్ఎస్ ప్రభుత్వమే అప్పుడు ఉత్సాహం ప్రదర్శించిన అధికారులకు తగిన మూల్యం తప్పదని అన్నారు.

# సైదాపూర్ ఘటనపై పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చర్యలు

కరీంనగర్ గత నెల 8వ తేదీన సైదాపూర్ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన నివేదిక ఆధారంగా సంబంధిత పోలీస్ సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.గత నెల 8న సైదాపూర్ పోలీస్ స్టేషన్ ప్రొబెషనరీ ఎస్సై అగస్త్య భార్గవ్ మరియు కానిస్టేబుళ్లు ఆకాష్, అజయ్ రోజువారి విధుల్లో భాగంగా సైదాపూర్ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో హుస్నాబాద్ కు చెందిన బత్తుల మహేందర్ ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, మహేందర్ పోలీసులతో వాదనకు దిగి, దుర్భాషలాడుతూ విధులకు ఆటంకం కలిగించాడని కానిస్టేబుల్ అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది.అదేవిధంగా, వాహనదారుడు బత్తుల మహేందర్ ఈ ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏసీపీ హుజురాబాద్ ను పూర్తి స్థాయిలో పారదర్శకంగా, నిస్పక్షపాతంగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు.

ఏసీపీ హుజురాబాద్ సమర్పించిన నివేదిక ఆధారంగా, వాహన తనిఖీలు జరుగుతున్నప్పుడు వాహనదారుడు బత్తుల మహేందర్ తన వాహనాన్ని ఎందుకు ఆపారని ప్రశ్నిస్తూ, పోలీసులను దూషిస్తూ, విధులకు ఆటంకం కలిగించారని, ఈ క్రమంలో పోలీసులు మరియు వాహనదారుడికి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుందని, పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు అవసరానికి మించి బలప్రయోగం చేసారని తేలిందన్నారు.అయితే, బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు బాధితుడికి న్యాయం చేసేందుకు గాను, ఆ రోజు విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు ఆకాష్ మరియు అజయ్ లపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా వారికి ఛార్జ్ మెమో జారీ చేసి పోలీస్ స్టేషన్ విధులనుండి తప్పిస్తూ హెడ్ క్వార్టర్స్కు అటాచ్ చేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ఇక ట్రైనీ ఎస్సై అగస్త్య భార్గవ్పై క్రమశిక్షణా చర్యల నిమిత్తం మల్టీ జోన్ ఐజీపీ నివేదిక కూడా పంపినట్లు తెలిపారు.ఈ ఘటనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని వార్తల్లో వస్తున్న కథనం పూర్తి అవాస్తవం అని కమిషనర్ స్పష్టం చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, తప్పు చేసిన వారికీ శిక్ష తప్పదని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పునరుద్ఘాటించారు.

## బిర్యానీ ఇవ్వలేదని దాబాలో కాంగ్రెస్ కార్యకర్త హాల్ చల్..

-దాబాలో ఉన్న మహిళలపై చేయి చేసుకున్న మూర్ఖుడు..

-అ×× గౌడ్ అంటే ఎవరో తెలవదా..? అంటూ అసభ్య పదజాలంతో దూషణ..

-దాబాలో మహిళలను చంపుతా అంటూ బెదిరింపులు..

-స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన దాబా నిర్వాహకులు.

సూర్యాపేట చివ్వెంల మండలం, అక్కలదేవిగూడెం గ్రామం పరిధిలోని నేషనల్ హైవే వెంట ఉన్న రామన్న ఫ్యామిలీ దాబాలో పనిచేసే మహిళపై స్థానిక కాంగ్రెస్ నాయకుడు దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అబ్బులు గౌడ్. మే 30 తేదీన సాయంత్రం 6 గంటల సమయంలో.. తన అనుచరుణ్ణి దాబా దగ్గరకు వెళ్ళి 4 బిర్యానీ పార్సిల్ లు పట్టుకురమ్మని చెప్పి పంపించాడు. పార్సిల్ తీసుకున్న ఆ వ్యక్తి డబ్బులు ఇవ్వకుండా నేను అబ్బులు గౌడ్ మనిషిని అని చెప్పి వెళ్ళిపోతుండగా.. దాబాలో ఉన్న మహిళ నిర్వాకురాలు ఆ వ్యక్తిని డబ్బులు ఇయ్యాలని అడిగింది. దీంతో.. కాంగ్రెస్ పార్టీ నాయకుడు అని చెప్పుకుంటూ తిరుగుతున్న అబ్బుల్ గౌడ్ కి ఫోన్ చేసి విషయం చెప్పడంతో.. ఆయన ఆగ్రహంతో ఊగిపోతూ బైకును సైతం కింద పడేసి ధాబాలోకి వచ్చి హల్చల్ చేశాడు. దాబాలో ఉన్న మహిళలపై చేయి చేసుకున్నాడు. అంతటితో ఆగకుండా.. అందులో ఉన్న మహిళలను అసభ్య పదజాలంతో.. అనరాని మాటలతో సంబోధిస్తూ తిట్టాడు. అంతటితో ఆగకుండా.. దాబాలో పనిచేస్తున్న మరి కొంతమంది వర్కర్ల మీదికి వెళ్లే వారిని భయభ్రాంతులకు గురిచేశారు. కౌంటర్ వద్ద కేబుల్ ను పదేపదే కొడుతూ..హోటల్ ఇక్కడ లేకుండా చేస్తానని.. అబ్బుల్ గౌడ్ అంటే ఎవరో నీకు తెలియదానే లం...?.. నీ మొగుణ్ణి అడుగు.. వాడు చెప్తాడు.. అంటూ, ఒక్కొక్కరిని చంపి పడేస్తా..,ఇక్కడ హోటల్ లేకుండా చేస్తా అంటూ సినిమా స్టైల్ లో పెద్ద పెద్ద డైలాగులు చెప్తూ కొద్ది సేపు హల్చల్ చేశాడు. అతని వెంట మరి కొంతమంది వ్యక్తులు కూడా హోటల్ వద్దకు వచ్చి నిర్వాహపులతో గొడవ పడినట్లు తెలుస్తుంది. ఈ సంఘటన జరిగిన మరుసటి రోజు బాధిత ధాబా నిర్వాహకులు స్థానిక పోలీస్ స్టేషన్ లో అబ్బులు గౌడ్ పై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. పిర్యాదు చేసి ఐదు రోజులు అవుతున్నప్పటికీ ఇచ్చిన పిర్యాదు పై పోలీస్ లు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలుస్తుంది. ఇదంతా అక్కడ ఉన్న సీసీ కెమెరాలో దృశ్యాలన్నీ రికార్డ్ అయ్యాయి. పోలీసులు అధికార పార్టీ నేత అని వదిలేస్తారా..? కేసు పెట్టి బొక్కలో వేస్తారా..? అన్నది చూడాల్సిందే..

# ప్రజాస్వామ్యం పవర్ కూటమి గెలుపునకు ఏడాది!



అమరావతి, భారత ప్రజాస్వామ్య పవర్ ఎలాంటిదో ప్రతి ఐదేళ్లకు ఓ సారి నిరూపితమవుతూనే ఉంటుంది. ఎన్నికలు జరిగిన ప్రతి సారి ప్రజలు గెలుస్తూనే ఉంటారు రాజకీయ పార్టీల గెలుపోటముల్ని నిర్దేశించేది ప్రజలే ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా ప్రజలే శాసిస్తారు. అందుకే మా గెలుపు ప్రజల విజయం అని పార్టీలు అంటాయి. మా ఓటమి కూడా ప్రజలే వినమ్రంగా స్వీకరిస్తాం అని ఓడిపోయిన పార్టీలు అంటాయి. కానీ కొన్ని తీర్పులు చరిత్రలో నిలిచిపోతాయి అలాంటి తీర్పు ఖచ్చితంగా ఏడాది కిందట 2024 జూన్ 4న వచ్చింది.

తుడిచి పెట్టుకుపోయిన అధికార పార్టీ

2024, జూన్ 3 వ తేదీ వరకూ రెచ్చిపోయారు. ప్రజలంతా బానిసలు మేము అకౌంట్లలో పదివేలు వేశాం మాకు తప్ప ఎవరికి ఓటేస్తారని రెచ్చిపోయారు. దాడులు చేశారు దౌర్జన్యాలు చేశారు తప్పుడు సర్వేలతో హోరెత్తించారు. చివరికి మస్తాన్ అనే హాఫ్ నాలెడ్జ్ సర్వేయర్ కు డబ్బులిచ్చి తప్పుడు సర్వేలు ప్రకటించారు. పార్టీ క్యాడర్ ను బెట్టింగ్‌ల వైపు మళ్లించి వాళ్లను నిండా ముంచారు. ఎంతగా అంటే ఏ కోణంలో చూసినా కనీసం ప్రతిపక్ష నేత హోదా రానంతగా ఓడించారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయారు. జిల్లాలకు జిల్లాలు తుడిచి పెట్టుకుపోయారు అధికార పార్టీకి మెజార్టీలు ఎక్కడా ఒక్కో నియోజకవర్గంలో యాభై వేలకు తగ్గనంత ఫలితం. ప్రజాగ్రహంతో అధికార పార్టీని తగల బెట్టేశారని కౌంటింగ్ ప్రారంభించిన గంటసేపటికే తేలిపోయింది.

ప్రజల్ని తక్కువ అంచనా వేసేవారికి ఇదే శిక్ష

ప్రజాస్వామ్యంలో మేమే తోపులం అని ఎవరైనా అనుకుంటే అంత కంటే అతిశయోక్తి ఉండదు. ఇతర ఆటల్లో గ్రౌండ్ లో కృషి చేస్తే పతకాలు గెలుస్తారేమో కానీ ప్రజాస్వామ్యంలో మాత్రం ఎవరి గెలుపును. ఎవరి ఓటమిని ఆయన ప్రజలే డిసైడర్ చేస్తారు. అందుకే ఎప్పుడూ విజేతలు ప్రజలే దాన్ని పట్టించుకోకుండా ప్రజాస్వామ్యాన్ని తక్కువ అంచనా వేస్తే పాతాళానికి పడిపోతారు. ప్రజల్ని బేస్ చేసుకుని రాజకీయాలు చేసే వారికి ప్రాధాన్యం ఉంటుంది కూటమి పార్టీలు అదే చేశాయి కూటమికి పథకాల కోసం ప్రజలు ఓట్లు వేయలేదు. ఆ అరాచక పాలన నుంచి కాపాడమని వేశారు. ఆ విషయం అందరికీ తెలుసు తెలియనట్లుగా నటించే వారికీ తెలుసు.

రాజకీయ పార్టీలకు గుణపాఠం:

ఏపీ ప్రజలు ఇచ్చిన తీర్పు రాజకీయ పార్టీలన్నింటికీ ఓ గుణపాఠం అధికారం వచ్చింది కదా అని రెచ్చిపోకూడదు. దాడులు, దౌర్జన్యాలు, బూతులు అనేవి ఉండకూడదు. ప్రజల్ని గౌరవించాలి. నమ్మి అధికారం ఇచ్చిన ప్రజల్ని వంచించకూడదు ప్రజలు ఇచ్చిన తీర్పుతో మరోసారి ఏపీ కింగ్ మేకర్ అయింది ఏపీ ప్రయోజనాలు ఇప్పుడు నెరవేరుతున్నాయి. అదే జగన్ రెడ్డి ఐదు సంవత్సరాల పాటు తన అక్రమాస్తులు, కేసులు, తన దోపిడీ నేతల రక్షణకే ప్రజాపవర్ ను వాడుకున్నారు. మొత్తంగా ప్రజాస్వామ్యంలో ప్రజల్ని తక్కువ అంచనా వేస్తే ఏం జరుగుతుందో వారు ఇచ్చే ట్రీట్ మెంట్ ఎలా ఉంటుందో మరోసారి చూపించి ఏడాది అయింది.

## పెద్ద ధన్వాడలో ఉద్రిక్తత జోగులాంబ గద్వాల్

– ఇంథ నాల్ ఫ్యాక్టరీ వద్దంటూ రైతులు ఫ్యాక్టరీ దగ్గర ఏర్పాటుచేసిన కంటైనరును తగలబెట్టారు.. సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా లో చోటుచేసుకుంది.. గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామ శివారులో ఏర్పాటుచేసిన ఇంథ నాల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయవద్దంటూ గత కొన్ని నెలలుగా రైతులు ఆందోళనలు చేపట్టారు.. కలెక్టర్ కు మంత్రులకు సైతం వినతి పత్రాలు అందించారు.. కొన్ని రోజులు అధికారులు సైలెంట్ గా ఉన్న మరోసారి ఫ్యాక్టరీ కి సంబంధించిన పనులను చేపడుతున్నారని సమాచారంతో పరిసర ప్రాంత రైతులు ఒక్కసారిగా ఫ్యాక్టరీ పైకి దండిత్తారు.. ఫ్యాక్టరీలో ఉన్న కంటైనర్ను తగలబెట్టారు.. దీంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి గ్రామస్తులను చెదరగొట్టేందుకు ప్రయత్నాలు చేశారు.. రైతులు ఆగ్రహంతో పోలీసులతో వాగ్వివాదం చోటుచేసుకుంది.. చివరకు పోలీసులు రైతులను గ్రామస్తులను శాంతింపజేశారు.. అనంతరం ఫ్యాక్టరీ వద్ద పోలీసు పికెట్ ను ఏర్పాటు చేశారు..

## రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు వెను వెంటనే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్‌జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి వెనువెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. బుధవారం హుజురాబాద్ మండలం కనుకులగిద్దె గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం గ్రామ రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని అన్నారు. భూ సమస్యలు ఉన్న ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రెవిన్యూ అధికారులు పక్కాగా రికార్డు నమోదు చేయాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించాలని అన్నారు. జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని,భూ సమస్యలున్న ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులకు హాజరై దరఖాస్తు సమర్పించాలని సూచించారు.కనుకుల గిద్దె గ్రామానికి చెందిన అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, అధికారులకు కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. సమస్యల వారీగా అర్జీలను విభజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి రమేష్ బాబు, తహసిల్దార్ కనకయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## కుమారుడిని చంపి తల్లి ఆత్మహత్య

కాకినాడ రేచర్లపేట లో కుటుంబ కలహాల నేపథ్యంలో నాలుగేళ్ల కుమారుడు హత్య చేసి తల్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.సమాచారం అందుకున్న త్రీటౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్సై తులసీరామ్, స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఉపాధిహామీ కూలీలపై పిచ్చికుక్క దాడి.. ఐదుగురికి గాయాలు

సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం అల్లిపురంలో పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు అయ్యాయి. హుజూర్ నగర్ మండలం అమరవరంలో ఉపాధిహామీ కూలీలపై పిచ్చి కుక్క దాడి చేసింది. బాధితులు హుజూర్ నగర్ ఏరియా ఆస్పత్రిలో వ్యాక్సిన్ తీసుకున్నారు.

## పర్యావరణ పరిరక్షణ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




సిద్దిపేట పర్యావరణ పరిరక్షణ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలనిజిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి అన్నారు బుధవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు.ఇలా అయితేనే మనం అందరం భావితరాలకు మంచి గాలి నీరు నేల అందించే వారమవుతామని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ ఆర్ సి పురం సహాయ పర్యావరణ శాస్త్రవేత్త టి. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డేవిడ్ జోయల్ కి ధన్యవాదాలు తెలిపిన హెూంగార్డ్స్ అధ్యక్షులు కొత్వల్ దయానంద్

హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డేవిడ్ జోయల్ ని మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వకంగా అభినందనలు ధన్యవాదాలు తెలియజేశారు. హైదరాబాద్ సిటీలో హెూంగార్డ్స్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ మొదలవుతున్న విషయంలో వివరించి"

ట్రాఫిక్ లో మిధులు నిర్వహిస్తు,హెూంగార్డ్స్ వెల్ఫేర్ విషయంలో ముందుగా సేవ కార్యక్రమాలు అందిస్తానని తెలిపారు.

ప్రస్తుతం ఉన్న పోలీస్ స్టేషన్ పోస్టింగ్ కాకుండా గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కానీ,గాంధీనగర్ కానీ, లేదా చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అయినా పర్వాలేదని పోస్టింగ్ విషయంలో విజ్ఞప్తి చేస్తూ, ప్రస్తుతం హైదరాబాద్ సిటీ హెూంగార్డ్స్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ప్రారంభ దశలో పోలీస్ ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఉన్నది కాబట్టి దయచేసి నాకు ప్రస్తుత ట్రాఫిక్ సెల్లో పోస్టింగ్ కేటాయించిన ఉద్యోగ విధులు నిర్వహిస్తూ.

ఆఫ్ సమయంలో సేవా కార్యక్రమాలు చేస్తానని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డేవిడ్ జోయల్ కి విజ్ఞప్తి చేశారు.

నా సహాయ సహకారాల దీవెనలు ఎప్పుడు మీ వెంట ఉంటయి అని పదిమందికి మేళ్లు జరిగే కార్యక్రమం కాబట్టి సానుకూలంగా స్పందించారు అని అన్నారు

## మ్యూజిక్ రంగంలో అపార అవకాశాలు

మనసుకు ఉల్లాసాన్ని నింపే మ్యూజిక్ రంగంలో అవకాశాలు కూడా అపారంగా ఉంటాయని నటుడు నవదీప్ అన్నారు. పంజాగుట్టలో ఔత్సాహిక మ్యూజిక్ ట్రైనర్స్ దీపక్, విశ్వజిత్, త్రిలోక్ చందర్ లు ఏర్పాటు చేసిన బీట్ కోర్ట్ మ్యూజిక్ అకాడమిని నటుడు వంశీ చాగంటితో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన వారు కూడా మంచి సంగీతాన్ని వింటే మనసు ఉల్లాసంతో నిండిపోతుందని అన్నారు. సంగీతానికి సాంకేతికతను జోడించి విద్యార్థులకు బోధించడమే లక్ష్యంగా ఈ అక్కడ మీరు ప్రారంభించినప్పుడు చెప్పారు. స్వల్పకాలిక కోర్సులతోపాటు ఏడాది పాటు కొనసాగి డిప్లమా కోర్సును ఇక్కడ అందిస్తున్నట్లు చెప్పారు. సినీ రంగం తో పాటు ఉన్నత స్థాయిలో జరిగే మ్యూజిక్ కార్యక్రమాల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సంప్రదాయ సంగీతం తో పాటు వెస్ట్రన్ సంగీతం మెలకువలు ఇక్కడ నేర్పుతామని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు తమను సంప్రదిస్తే వారి అభిరుచిని బట్టి ఆ రంగంలో తర్ఫీదు ఇస్తామని చెప్పారు.

# ఎమ్మిగనూరులో 'వెన్నుపోటు దినం'

### బుట్టా రేణుక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
### కూటమి ప్రభుత్వ మోసాలకు వ్యతిరేకంగా ప్రజల గళం
### డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



ఎమ్మిగనూరు, జూన్ 4టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'వెన్నుపోటు దినం' సందర్భంగా ఎమ్మిగనూరులో ఘనంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక గారి నేతృత్వంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ ర్యాలీలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ విభాగ అధ్యక్షులు వై.రుద్ర గౌడ్ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి ,పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ గారు వీరితోపాటు వేలాదిమంది పార్టీ శ్రేణులు పాల్గొని నినాదాలతో కూటమి ప్రభుత్వ తీరును ఖండించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఇందులో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్, 143 హామీల అమలుపై విఫలమై ప్రజలను మోసం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బుట్టా రేణుక గారు,

"కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రతి వర్గాన్ని నిరాశపరిచింది. రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయం 'రైతు భరోసా', విద్యార్థుల కోసం 'విద్యా దీవెన', 'వసతి దీవెన', మహిళల కోసం 'ఆడబిడ్డ నిధి', 'అమ్మ ఒడి', నిరుద్యోగులకు భృతి వంటి పథకాలన్నీ ఊహలకే పరిమితమయ్యాయి. సంవత్సరంలోనే ప్రతి ఒక్కరికి లక్షల్లో బకాయిలు ఏర్పడ్డాయి. పెన్షన్లు తగ్గించబడ్డాయి. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. సంక్షేమం గాలికొదిలారు" అని తీవ్రంగా విమర్శించారు.

అలాగే, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై, నేతలపై, సామాజిక ఉద్యమకారులపై, జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి, అరెస్టులు చేయడం కూటమి ప్రభుత్వ తీరును చూపిస్తోందని ఆమె అన్నారు. అధికారులను కూడా వేధించడమే కాకుండా, పలువురు ఐపీఎస్ అధికారులను టార్గెట్ చేయడం కక్షసాధింపు చర్యలకే నిదర్శనమన్నారు.

"ప్రజల జీవితాల్లో మార్పు తేవాలని చెప్పిన ప్రభుత్వం, నాశనం చేసిన పాలనను నెరవేరుస్తోంది. ఈ మోసపూరిత ప్రభుత్వ తీరుపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరికి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా మా గళాన్ని వినిపించుకుంటున్నాం" అని బుట్టా రేణుక స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు

# రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు వెనువెంటనే పరిష్కరించాలి
### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జూన్ 4** జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి వెనువెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. బుధవారం హుజురాబాద్ మండలం కనుకులగిద్దె గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం గ్రామ రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని అన్నారు. భూ సమస్యలు ఉన్న ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రెవిన్యూ అధికారులు పక్కాగా రికార్డు నమోదు చేయాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించాలని అన్నారు. జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు



నిర్వహించనున్నామని, భూ సమస్యలున్న ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులకు హాజరై దరఖాస్తు సమర్పించాలని సూచించారు.కనుకుల గిద్దె గ్రామానికి చెందిన అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, అధికారులకు కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు ఇవ్వాలని ఆదేశించారు.రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. సమస్యల వారీగా అర్జీలను విభజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి రమేష్ బాబు, తహసిల్దార్ కనకయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# మానవతా దృక్పథంతో రోగులకు సేవలందించాలి

### ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి
### టీఫా స్కాన్ మిషన్ కొనుగోలు అంశాన్ని పరిశీలించాలి
### హుజురాబాద్ ఆసుపత్రిలో ఆరోగ్య మహిళ వెంటనే ప్రారంభించాలి
### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
### హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సందర్శన



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జూన్ 4** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మానవతా దృక్పథంతో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బుధవారం సందర్శించారు. డయాలసిస్ కేంద్రం, ఐసీయూ, వార్డులు, ఓపి విభాగం సందర్శించారు. నవజాత శిశువుల వార్డు సందర్శించి పిల్లలకి వచ్చిన సమస్యల గురించి తెలుసుకున్నారు. లేబర్ రూమ్, వార్డులు పరిశీలించి గర్భిణీ బాలింతలతో మాట్లాడారు. ఆస్పత్రి సిబ్బంది వారికి అందిస్తున్న సేవలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను, సాధారణ ప్రసవం ప్రాధాన్యతను అక్కడి మహిళలకు వివరించారు. ఇతర వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు.

అనంతరం ఆస్పత్రిలోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్యాధికారులు, మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్ని రకాల సేవలందించేందుకు అవసరమైన సిబ్బంది ఖాళీల వివరాలు సమర్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు ముందస్తు జాగ్రత్తలు సూచించాలని, వైద్య సహాయం అవసరం అనుకుంటే గర్భిణీలను ప్రసవ గడువు కంటే ముందే ఆస్పత్రిలో చేర్చుకోవాలని అన్నారు. ఆప్తమాలజిస్ట్, రేడియాలజిస్ట్, డెంటిస్ట్ వంటి విభాగాల వారీగా ఓపి సంఖ్యను పరిశీలించారు. నెలవారి నివేదికలను సమీక్షించారు. రోగుల పట్ల మానవీయకోణంలో వ్యవహరించి వారికి సేవలు అందించాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రైవేట్ దుకాణాల్లో వేల రూపాయలు ఖర్చుతో కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ సంబంధిత మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నప్పటికీ ప్రైవేటులో కొనుగోలు చేయడం దురదృష్టకరమని అన్నారు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఉచితంగా మందులు తీసుకునేలా చూడాలని సూచించారు. నవజాత శిశువులు, పిల్లల సేవల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య మహిళ క్యాంపును వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. మెప్మా, ఐకెపి సిబ్బంది ద్వారా ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షల పట్ల మహిళలకు అవగాహన కల్పించి క్యాంపును సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. ఈ క్యాంప్ ద్వారా సుమారు 50 వేల రూపాయల ఖరీదు చేసే 47 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్న విషయం మహిళల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి బీపీ షుగర్ థైరాయిడ్ వంటి మందులను అందించాలని అన్నారు. 108 సేవలకు ఎటువంటి అంతరాయం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. అవసరమైన సౌకర్యాలు సమకూర్చుకోవాలని ఆదేశించారు.

అంతకుముందు ఆసుపత్రి ఆవరణలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మొక్కలు నాటారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డి సి హెచ్ చంద్రశేఖర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి, ఆర్ఎంవో రమేష్, జమ్మికుంట హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్వో చందు, ఆర్డీవో రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.

# వైసీపీ ది గొడ్డలి పోటు దినం: టీడీపి



గోనెగండ్ల: జూన్ 04బుధవారం రాష్ట్రవ్యాప్తంగా వైసిపి తుడిచిపెట్టుకుపోయినా వైసిపి నేతలకు చలనం లేదని వైసిపి పై గొడ్డలి పోటు దినం నిరసన కార్యక్రమం టిడిపి యూత్ - టీ ఎన్ ఏస్ ఫ్ అధ్వర్యంలో చేయటం జరిగిందనీ ఈ కార్యక్రమానికి టిడిపి సీనియర్ నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసం ద్రోహం పార్టీ ఫిరాయింపులతో ప్రభుత్వాన్ని పడదోసి అధికార పీఠాన్నించుకుంటే అది కచ్చితంగా వెన్నుపోటు అవుతుందని కానీ ప్రజాభిప్రాయాన్ని వెన్నుపోటుగా పేర్కొనడం వైసిపి పార్టీకే చెల్లిందని అన్నారు.సరిగ్గా ఏడాది క్రితం 2024 జూన్ 4 వ తేదీన జగన్ పాలన అంతమైన రోజు ఐదేళ్ల నిర్బంధానికి స్థిరపడిన రోజునీ స్వేచ్ఛకు పడిన సంకెళ్లు తెగిన రోజనీ అన్నారు.కానీ వైసీపీ పార్టీ ప్రజా తీర్పుకు విరుద్ధంగా వెన్నుపోటు దినమంటూ నిరసన తెలపడం సిగ్గు తేటని అన్నారు.జగన్ తన ఐదేళ్లపాటు మద్యం మాఫియా ఇసుక మాఫియా గంజాయి ఎర్రచందనం స్మగ్లింగ్ వైసిపి జగన్ అనుంగ అనుచరులు అటవీశాఖ భూములు అలాగే నిరుపేదల భూములకు సైతం ఆక్రమణలు చేసిన గొప్ప ఘన పాటీలు వైసిపి పెద్దలు అని అన్నారు.మద్యపాన నిషేధం చేస్తానన్న జగన్ ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు.తన ఐదేళ్ల పాలనలో యువతను భారీ ఎత్తున మోసం చేసి కేవలం వాలంటరీ వ్యవస్థ పెట్టి నిరుద్యోగులను మభ్యపెట్టిన ఘనత జగన్దని అన్నారు ఎన్నికల ముందు పెద్దపెద్ద హామీలు ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అంటూ యువతను మోసం చేశారని అన్నారు.జగన్ తన ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ వేసిన పాపాన పోలేదని అన్నారు. అందుకనే నేడు వెన్నుపోటు దినం అనే బదులుగా వైసిపి గొడ్డలిపోటు దినం అంటే సరిపోతుందని అన్నారు. జగన్ తన ఐదేళ్ల చీకటి పాలనను చంద్రహాసం లాంటి మన చంద్రుడు మన చంద్రన్న వెలుగులు నింపడం జరిగిందని అన్నారు.ఈ ఐదేళ్లలో ఎక్కడ ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేసిన దాఖాలాలు లేవని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్ అండ్ బి రోడ్లు గ్రామాల్లో పట్టణాల్లో సీసీ రోడ్లు డ్రైనేజీలు మొదలగు ప్రజా అవతరణకు భయపడే తూర్పు మాట్లాడుతూ ముందుకు సాగుతుంటే దీన్ని ఓర్వలేని జగన్ కూటమి ప్రభుత్వం పై విషం చిమ్ముతున్నారని అయినా ప్రజలు మీ కుతంత్రాలు నమ్మే పరిస్థితులు లేరన్నారు.ప్రజా తీర్పుని గౌరవించలేని వైసిపి పార్టీ రాజకీయ సమాధి కావడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యూత్ టీఎన్ఎస్ఎఫ్ సోషల్ మీడియా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి జూన్ 4** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం వీణవంక మండలం లక్ష్మక్కపల్లి గ్రామంలో అతిథి డెవలపర్స్ అధినేత కొమ్మిడి రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి ఇళ్ల పట్టాల పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలో మొదటగా నిరుపేదలైన 9 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని,విడతల వారీగా అందరికీ అవకాశం వస్తుందని, ఎవరు అధైర్య పడద్దని రాకేష్ రెడ్డి తెలిపారు.ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరిగిందని ఎలాంటి పైరవీలకు తావులేకుండా లబ్ధిదారులను ఎంపిక చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు దాసారపు ప్రభుదాస్, మాజీ సర్పంచ్ సుజాత లక్ష్మణ్ యువ నాయకులు మద్దుల ప్రశాంత్ పటేల్, రవి,పరశురాం రెడ్డి, ఇసాక్,ఏసు రాజు, సమ్మిరెడ్డి, రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గోవుల అక్రమ రవాణా అరికట్టడానికి జిల్లాల వద్ద చెక్ పోస్ట్

### బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ల వద్ద పకడ్బందీగా విధులు నిర్వహించాలి.
### జిల్లెళ్ల చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్.



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై -4 (ప్రజాబలం ప్రతినిధి)**బుధవారం రోజున బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల అక్రమ రవాణా అరికట్టడానికి జిల్లెళ్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ని ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది నిర్వహించే వాహనాల ఎంట్రీ రికార్డ్ లను పరిశీలించి,చెక్ పోస్ట్ లో గల సిబ్బందికి తగు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ . అనంతరం ఆయన మాట్లాడుతూ... బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందిగా చర్యలు తీసుకోవడం జరిగిందని, గోవుల అక్రమ రవాణా గోవధ నివారించేందుకు జిల్లా సరిహద్దుల (జిల్లెళ్ల, పెద్దమ్మ, మానాల క్రాస్ రాడ్) వద్ద చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.చెక్ పోస్ట్ ల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,తనిఖీల్లో సరైన పత్రాలు ఉన్న రైతులకు సంబంధించిన లేదా వ్యవసాయనికి సంబంధించిన పశువుల రవాణాకు ఆటంకం కలిగించకుండా సిబ్బంది విధులు నిర్వహిచాలని తెలియజేశారు.చెక్పోస్ట్ వద్ద ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఇతర డిపార్ట్మెంట్ సిబ్బంది మరియు జిల్లా పోలీస్ యంత్రాంగామంతా సమన్వయముతో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఎస్పీ వెంట ఎస్.ఐ శంకర్ నాయక్ , పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

## భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి నూతన రెవెన్యూ చట్టం

## రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్ రెడ్డి.



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 04 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా:సదాశివపేట/తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన భూ భారతి రెవెన్యూ చట్టం -2025, రెవెన్యూ గ్రామసభలు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈరోజు జూన్ 3 వ తేదీ నుండి జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు ఉన్న రైతుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించడం కోసం ఈ సదస్సులను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్ డి ఓ గ్రామస్తులకు వివరించారు,సదాశివపేట మండల పరిధిలోని అంకేనపల్లిలో భూ భారతి రెవెన్యు సదస్సులలో దరఖాస్తులను పరిశీలించారు,సదస్సులలో ప్రత్యేక హెల్ప్ డేస్కులను ఏర్పాటు చేయడం జరిగిందని వాటి ద్వారా దరఖాస్తు దారులకు తగు సూచనలు చేస్తూ దరఖాస్తులను పూరించుటకు సహకరించాలన్నారు,మండల వ్యాప్తంగా ప్రతీ రోజు వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను పరిశీలించి ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు,ఈ సదస్సులో భూమికి సంబంధించిన సమస్యలను ఏమైన ఉంటే పరిష్కరించుకోవాలని,అధికారులు మీ గ్రామాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని, గ్రామ ప్రజలు వెంటనే అక్కడికక్కడే తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చనని , అధికారులు గ్రామాల్లో ఉదయం 9.00 నుండి సాయంత్రం 4.00 గంటల వరకు మీ గ్రామాల్లోనే ఉంటారు గనుక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు,ఈ సదస్సులో సదాశివపేట ఉప తహసీల్దార్ బాలరాజు, అంతయ్య, యాదగిరి, పంచాయితి సెక్రటరి జ్యోతి, ఆపరేటర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు విత్తన వినియోగంపై అవగాహన కల్పించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 04 :** రానున్న వానాకాలం పంటల సాగులో రైతులకు విత్తన వినియోగంపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పనతో కలిసి మండల వ్యవసాయ అధికారులు, ఎరువులు,విత్తనాలు, క్రిమిసంహారక మందుల డిస్ట్రిబ్యూటర్లు,డీలర్లు, రిటైలర్లు,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో వానాకాలం పంటల సాగులో విత్తనాలు, ఎరువులు,క్రిమిసంహారక మందుల కొనుగోలు, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.సీజన్లో పంట సాగుకు అవసరమైన వరి, పత్తి విత్తనాల లభ్యతను పరిశీలించుకొని ఏదైనా కొరత ఉన్నట్లయితే ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వర్షాలు,విత్తనాలు నాటడం,ఎరువుల వినియోగం అంశాలపై రైతులకు అవసరమైన మెళకువలను అందించాలని,నకిలీ/నిషేధిత విత్తనాలు, ఎరువుల వినియోగం కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. విత్తనాలు,ఎరువుల దుకాణాలలో రైతులు కొనుగోలు చేసిన సమయంలో సంబంధిత అంశాలతో కూడిన రశీదు జారీ చేయాలని,ప్రతి షాపులో ఉన్న నిల్వలు, విక్రయ వివరాలు,రిజిస్టర్లో నమోదు చేయాలని, రైతులకు తెలిసే విధంగా ధరల పట్టిక,పూర్తి వివరాలు నోటీస్ బోర్డు ద్వారా ప్రదర్శించాలని తెలిపారు. ఈ-పాస్ యంత్రంలో నమోదు చేసి ప్రకారం నిల్వలు ఉండాలని, ఎలాంటి తేడాలు ఉండకూడదని తెలిపారు. జిల్లాలో అవసరమైన మేరకు యూరియా అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఒక్కసారిగా విక్రయించకుండా అవసరం తెలుసుకొని తదనుగుణంగా విక్రయాలు జరుపాలని తెలిపారు. ఎరువులు,క్రిమిసంహారక మందుల విక్రయ సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని,అర్హత గల రైతులకు మాత్రమే విక్రయించాలని తెలిపారు. ఇప్పటి వరకు దాదాపుగా పత్తి విత్తనాలు అందించడం జరిగిందని,సరిపడా నిల్వలు ఉన్నాయని, అవసరమైన రైతులు తీసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వంచే గుర్తించబడిన విత్తనాలు,ఎరువులు, క్రిమిసంహారక మందులు మాత్రమే విక్రయించాలని, నకిలీ/నిషేధిత అంశాలను విక్రయించినట్లయితే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రుద్రవరంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం.





**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ), తేదీ 04-06-2025** బుధవారం రోజున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. రజిత టీబీ ముక్త్ భారత్ అభియాన్ -2వ రోజు కార్యక్రమంలో భాగంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమమును ఆకస్మికంగా తనిఖీ చేసినారు. హనుమాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గల రుద్రవరం ఆరోగ్య ఉపకేంద్రమును, అనుపురం ఆరోగ్య ఉపకేంద్రమును టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో 60 సంవత్సరాలు పైబడిన వారందరూ దయాబెటిక్, అనారోగ్య సమస్యలతో ఉన్నవారు టీబి, తెమడ పరీక్షలు చేయించుకోవాల్సిందిగా అవగాహన కల్పిస్తూ సకాలంలో లక్ష్యాలు సాధించి టీబి రహిత ఆరోగ్య కేంద్రంగా సాధించాల్సిందిగా సూచిస్తూ, ఐదు సంవత్సరాల పిల్లలందరికీ సకాలంలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు టీకాలు ఇప్పించవలసిన ఆవశ్యకతను తెలియజేస్తూ, కేంద్ర ఆరోగ్య పథకాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఐఓ సంపత్ కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యల పరిష్కారం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 04 :** భూసమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలపై అందిన దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండలం బుద్దారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను మండల తహశిల్దార్ మల్లిఖార్జున్తో కలిసి సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్. చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ దరఖాస్తులను రికార్డులతో సరి చూసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం తొలుతగా రాష్ట్రంలోని 4 జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేయడంలో భాగంగా జిల్లాలోని భీమారం మండలాన్ని ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యల సంబంధిత దరఖాస్తులు స్వీకరించి దాదాపు పరిష్కరించడం జరిగిందని తెలిపారు.ఈ నెల 20వ తేదీ వరకు జిల్లాలోని భీమారం మినహా అన్ని మండలాలలో కార్యచరణ ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. నూతన చట్టంలో రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని, రిజిస్ట్రేషన్,మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి,మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని,పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని,వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు తో పాటు రిజిస్టర్డ్ దస్తావేజులు,రెవెన్యూ రికార్డులు జతపరిచినట్లయితే త్వరగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.అనంతరం పాఠశాలలో జరుగుతున్న వంటశాల నిర్మాణ పనులు పరిశీలించి వేగవంతం చేసి విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న అమృత్ 2.0 పనులను మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు.మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ల ద్వారా ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీటిని అందించడం జరుగుతుందని,అమృత్ 2.0 ద్వారా త్రాగునీటిని అందించేందుకు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి సమస్యలను పరిష్కరించాలి

## మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా

## అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూన్ 4:**రైతుల సమస్యలను పరిష్కారంలో ఎలాంటి అలస్యం చేయకుండా వెను వెంటనే పరిష్కరించి రైతులకు ప్రభుత్వం పై భరోసా కల్పించాలని, భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి అన్నారు.

జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో భాగంగా బుధవారం మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సును అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే ఆన్‌లైన్ లో నమోదు చేయాలని, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆయన సూచించారు. ఈ సదస్సుల ద్వారా రెవెన్యూ రికార్డ్ లను సక్రమంగా నిర్వహించుటకు అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులు ఏవిధంగా ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారని రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆర్జీలను నిర్ధేశిత కోడ్‌లలో నమోదు చేయాలని, రైతులకు సంబందిత డాక్యుమెంట్లను జతచేయాలని తెలియజేయాలన్నారు.ఆర్జీదారులతో సౌమ్యంగా వ్యవహరించాలని, చొరవతీసుకొని వారికి అవసరమైన సలహాలు, సూచనలను అందించాలన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి అయినట్లు దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకోని,ప్రభుత్వ భూముల పరిరక్షణకై పాటుపడాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. ఆర్జీలు సమర్పించిన ప్రతి దరఖాస్తుదానికి రశీదులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోరెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో ఎరువుల దుకాణాలను టాస్క్ ఫోర్స్ టీం తనిఖీలు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బుధవారం రోజున వేములవాడ పట్టణంలోని విత్తనాలు, ఎరువులు మరియు పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా టాస్క్ ఫోర్స్ టీం తనిఖీ నిర్వహించడం జరిగింది.

ఇందులో భాగంగా అందరూ డీలర్స్ నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని, కల్తీ విత్తనాల అమ్మ వద్దని హెచ్చరించడం జరిగింది. దుకాణం యజమానులు తప్పనిసరిగా రికార్డ్స్ రాయాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, ఏవో ముస్తాబాద్ దుర్గా రాజు, ఏమో వేములవాడ సాయి కిరణ్, ఏవో కొనరావుపేట సందీప్, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, శ్రీనివాస్, గంగరాజు పాల్గొన్నారు.

## మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎంఈఓ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బుధవారం రోజున మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం 1503 వ రోజు కార్యక్రమంలో భాగంగా రిటైర్డ్ ఎంఈఓ, సాంఘిక సేవా కార్యకర్త చెన్నా మాధవుని రామరాజు జన్మదినం సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి, అనంతరం కేక్ కట్ చేయించి అన్నార్థులకు, అభాగ్యులకు కేక్ తో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలియజేశారు.

సన్మాన గ్రహీత రామరాజు మాట్లాడుతూ మనం ఒక్కరోజు ఒక కార్యక్రమం చేయాలి అంటేనే ఎంతో ముందుగా ప్లాన్ చేసుకుంటాము అలాంటిది కరోనా కష్టకాలంలో అన్నం దొరకని పేదలకు ఆహారం అందించడం అంతేకాకుండా ఆ రోజు నుండి ఈరోజు వరకు 1503 రోజులుగా ఎండ వచ్చిన, వానొచ్చిన, ఆగకుండా మధ్యాహ్నం 12:30 నిమిషాలకు అన్నదానం చేయడం అభినందనీయమని, అన్నదానానికి సహకారం అందిస్తున్న దాతలకు మరియు సేవా కార్యక్రమంలో పాల్గొని సేవలందిస్తున్న మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అంతేకాకుండా నేను కూడా అమ్మాయి వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నందు సభ్యుడిగా ఉండడం నా అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, డాక్టర్ బెజ్జంకి రవీందర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పాత సంతోష్, పొలాస రాజేందర్, తోటరాజు, సగ్గు రాహుల్, మరియు చెన్నా మాధవుని రామరాజు సతీమణి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## గంజి వాగుపై బ్రిడ్జి పూర్తి నిర్మాణానికి మోక్షం ఎప్పుడు కలుగుతుంది.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి,( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నుండి బోయిన పల్లి వెళ్లే ప్రధాన మార్గంలో స్తంభం పల్లి గ్రామ సమీపన గంజి వాగు పై బ్రిడ్జి నిర్మాణ పనులు ఏడాదికాలంగా మధ్యలోనే నిర్మాణ పనులు నిలిపివేయడం వల్ల బోయినపల్లి మండలం నుండి ప్రసిద్ధ దేవాలయం శ్రీ రాజరాజేశ్వర స్వామి కొలువైన వేములవాడ పట్టణానికి వెళ్లడానికి బోయినపల్లి మండల ప్రజలు, మరియు వేములవాడ పట్టణ ప్రజలు బోయినపల్లి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న కూడా ఏమాత్రం అధికార యంత్రాంగం, స్థానిక రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడంపై దృష్టి పెట్టకపోవడం వల్ల సామాన్య ప్రజలు, ద్విచక్ర వాహనదారులు, భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. గతవారం కురిసిన భారీ వర్షానికి రెండు రోజుల వరకు వేములవాడ నుండి బోయినపల్లి వెళ్లే గంజి వాగు ఉధృతంగా ప్రవహించడంతో ప్రయాణికులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్త శుద్ధితో వ్యవహరించి బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయాలని బోయినపల్లి మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్ పత్రిక ముఖంగా ప్రజల పక్షాన డిమాండ్ చేయడం జరిగింది.

## జిల్లా ఎస్పీ పుల్కల్ పోలీస్ స్టేషను ఆకస్మిక తనిఖీ



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జూన్ 04 ప్రజాబలం )**సంగారెడ్డి జిల్లా, ఆందోల్ నియోజకవర్గం పుల్కల్ మండల పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్, మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు, ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు, అనంతరం స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు, లాంగ్ పెండింగ్ కేసుల చేదనకు, ప్రత్యేక ప్లాన్ అప్ యాక్షన్ ఉండాలని, నాణ్యమైన ఇన్వెస్టిగేషను త్వరతగతిన పూర్తి చేయాలని అన్నారు, సిబ్బంది,అధికారులు, స్టేషన్కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలని, 24 లి 7,అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు, హిస్టరీ షీటర్స్, సస్పెక్ట్స్ మరియు పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, నైట్ బీట్, పెట్రోలింగ్ అధికారులు, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు, సివిల్ భూ సంబంధిత కేసులలో, తల దూర్చకూడదని, అధికారులకు సిబ్బందికి, సూచనలు చేశారు, మన చుట్టూ జరుగుతున్న ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్స్ ,బెట్టింగ్ యాప్స్, రోడ్డు ప్రమాదాల గురించి, కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రామ్స్ ద్వారా జిల్లా ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను, బ్లాక్ స్పాట్లను



గుర్తించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయించాలని అన్నారు, అనంతరం సింగూర్ ప్రాజెక్టును సందర్శించి, రానున్న వర్షాకాలం దృష్ట్యా, ప్రాజెక్టుకు రోజు వచ్చే ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో, ప్రస్తుతం నీటిమట్టం వివరాలను, అడిగి తెలుసుకున్నారు, అదేవిధంగా ప్రాజెక్టుకు వచ్చే సందర్శకులకు, ఎలాంటి భద్రతాపరమైన సమస్యలు కలగకుండా, తగిన భద్రత ఏర్పాట్లను చూడాలని, (ఎస్ హెచ్ ఓ) కు సూచనలు చేశారు, ఈ సందర్శనలో జిల్లా ఎస్పీ వెంబడి, జోగిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, పుల్కల్ ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్ ఉన్నారు......

## భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారత్ డిప్యూటీ తహసిల్దార్ మధుకర్ రెడ్డి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జూన్ 04 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతని ఏర్పాటు చేసిందని అందోల్ డిప్యూటీ తాసిల్దార్ తెలిపారు, అందోల్ మండలం దానం పల్లి, గ్రామంలో డిప్యూటీ తహసిల్దార్ ఆధ్వర్యంలో భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభను ఏర్పాటు చేశారు, ప్రజా పాలనలో భాగంగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, ఇందిరమ్మ ఇండ్ల విషయమై లబ్ధిదారులకు ఆయన అవగాహన కల్పించారు, ఇండ్లు లేని నిరుపేదలకు, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో భూమి సర్వే అంశంలో, పారదర్శకత పాటించి, ప్రతి ఒక్కదానిపై అవగాహన నిర్వహించి, తక్షణమే పరిష్కరిస్తానని, ప్రభుత్వం భూభారతనే కొత్త చట్టం( ఆర్ఆర్ ఓ )ప్రకారం 1997 ప్రకారం, ప్రతి భూమి రైతుకు, భూమి సమస్య పరిష్కరిస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ విశాల్, పెంటయ్య, రమేష్, త్రినాధ్ , గ్రామ అధికారి దశరథ్, మరియు రైతులు, అధికారులు, పాల్గొన్నారు....

## దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 04 :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్.చట్టంలో భాగంగా పైలెట్ మండలంగా ఎంపికైన భీమారం మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండల తహశిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ప్రత్యేక తహశిల్దార్ జ్యోతి, రాంచందర్లతో కలిసి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం తొలుతగా రాష్ట్రంలోని 4 జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేయడంలో భాగంగా జిల్లాలోని భీమారం మండలాన్ని ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యల సంబంధిత దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, తిరస్కరించబడిన దరఖాస్తులకు సంబంధించి వివరాలు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. నూతన చట్టంలో రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని, వారసత్వంగా వచ్చిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేయడం, సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక ప్రజలకు అందుబాటులో వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని, పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 04 :** జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా పంచాయతీ రాజ్,పంచాయతీ, గ్రామీణాభివృద్ధి,జిల్లా పరిషత్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద మంజూరై కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. జిల్లాలోని స్వంత భవనాలు లేని గ్రామపంచాయతీ కార్యాలయాలు, పురోగతిలో ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయాల భవనాల నిర్మాణ పనులు,అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపుల వివరాలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. నిర్మాణ దశలు పూర్తి అయిన మేరకు బిల్లులు సమర్పించాలని తెలిపారు. భవన నిర్మాణానికి భూమి గుర్తించని ప్రాంతాలలో త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని, షెడ్యూల్ తెగల జనాభా అధికంగా ఉన్న అటవీ ప్రాంతాలలో భూమి అందుబాటులో లేనట్లయితే అటవీ భూమి అవసరమైన మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీల వారిగా కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ రామ్మోహన్రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్,జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, ఎ.ఈ.ఈ.లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాజీపేటలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ.

### పేదల కలను సహకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్న నేతలు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బుధవారం రోజున వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో భాగంగా గృహ నిర్మాణం సాధ్యమవుతుంది అని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గూని లావణ్య, ఈరి రాజేశ్వరి, సూర జ్యోతి చేతుల మీదుగా భూమి పూజ జరిపారు. దీనికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు హనుమాజీపేట గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సంఘ స్వామి యాదవ్, సోషల్ మీడియా చిలుక ప్రభాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ స్రవంతి - హరి నందన్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెన్నాడి జగన్ రెడ్డి, తడగొప్పుల రమేష్, కాటం శారద, గ్రామ కార్యదర్శి వెంకటేష్, కారోబార్ సూర్య నాగరాజు పాల్గొన్నారు.

## ఎస్.ఎస్.సి. ఫలితాలలో జిల్లా విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 04 :** 2024-25 ఎస్.ఎస్.సి. ఫలితాలలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ విభాగంలో జిల్లాలోని జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఎస్.సి. ఫలితాలలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని అన్నారు. జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన రాథోడ్ యోగేశ్వర్ (582), ఏల్పుల నరేందర్ (570), కొత్త అనిల్ (560)లు మంచి మార్కులు సాధించారని, జాతీయ స్థాయిలో ఎన్.ఎంఎం.ఎస్. ఫలితాలలో జిల్లాలో మొదటి స్థానం, జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, ఉపాధ్యాయ బృందం కృషి ఎంతో ఉందని అన్నారు. మేధ చారిటబుల్ ట్రస్ట్-హైదరాబాద్ అందిస్తున్న మేధా సంపూర్ణ శిక్షలో భాగంగా 5 సంవత్సరాలకు గాను ఇంటర్మీడియట్ కార్పొరేట్ విద్య, ఎం.బి.బి.ఎస్./ ఐ.ఐ.టి. తదితర డిగ్రీ కోర్సులలో ఉచిత విద్యకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం, సి.ఓ.ఈ.గౌలిదొడ్డికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణ మూర్తి, చౌదరి, శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయ సిబ్బంది దాముక కమలాకర్, గోవర్ధన్, రాజన్న బుచ్చి లింగయ్య, ప్రకాష్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 28 వేల 642 మంది రైతుల ఖాతాలలో 325 కోట్ల రూపాయల జమ

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జూన్ 04 :** జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 321 కేంద్రాలు ద్వారా 28 వేల 642 మంది రైతుల వద్ద నుండి 1 లక్ష 95 వేల 554 టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి సంబంధిత రైతుల ఖాతాలలో 325 కోట్ల 13 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల వద్ద నుండి పూర్తి స్థాయిలో నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 325 కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరిధాన్యంను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కనీస మద్దతు ధర పొందాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు 1 వేయి 500 మంది సిబ్బంది, హమాలీలు యజ్ఞంలా పని చేస్తున్నారని, నిత్యం 2 వేల నుండి 4 వేల టన్నుల ధాన్యం కాంటా చేసి 90 లారీల ద్వారా 2 వేల నుండి 3 వేల టన్నుల ధాన్యం పెద్దపల్లిలోని 110 మిల్లులకు, జిల్లాలోని 22 మిల్లులకు తరలించడం జరుగుతుందని, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు 10 నుండి 20 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని, రైతు పండించిన ధాన్యం నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## ప్రజల దృష్టిని మళ్లించడానికే వైకాపా ధర్నాలు

కాకినాడ కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే జగన్ ముఠా ధర్నాల డ్రామా ఆడుతోందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ఆరోపించారు..కాకినాడలో ని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ సతీష్ మాట్లాడుతూ తొలి ఏడాదిలో 10 శాతం హామీలను కూడా అమలు చేయని జగన్ ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని దీనికి విరుద్ధంగా, కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 70% హామీలను అమలు చేసిందని, ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని స్పష్టం చేశారు..ఈమీడియా సమావేశంలో ఎమ్మెల్సీ పెరబత్తుల రాజశేఖర్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్యే సత్య ప్రభ, మాజీ ఎమ్మెల్యేలు ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ, పిల్లి సత్తిబాబు, బీజేపీ నాయకులు మలకొండయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు...

## జిల్లాలో బడిబాట కార్యక్రమం విజయవంతానికి సమిష్టిగా కృషి చేద్దాం

### జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జూన్ 04 :** జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుండి తలపెట్టిన ప్రొ? జయశంకర్ బడిబాట కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎ.టి.డి.ఓ.పురుషోత్తంతో కలిసి వసతిగృహాల సంక్షేమాధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి మాట్లాడుతూ...జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుండి నిర్వహించనున్న బడిబాట కార్యక్రమ విజయవంతానికి అందరం కలిసి సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. ఈ నెల 6వ తేదీన అన్ని గ్రామాలలో, మున్సిపాలిటీలలో బడిబాట కార్యక్రమం ద్వారా చేపట్టబోయే కార్యక్రమాలపై గ్రామసభలు నిర్వహించి బడి బయట ఉన్న పిల్లలు, 5 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరిని పాఠశాలలో చేర్పించే విధంగా కార్యచరణ చేపట్టాలని, స్వయం సహాయక సంఘాలు, ఎ.ఎ.పి.సి.సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వసతిగృహాల సంక్షేమ అధికారులు, పాత విద్యార్థుల భాగస్వామ్యంతో మారుమూల ప్రాంతాలలో అవగాహన కల్పించాలని, ప్రతిజ్ఞ, బడిబాట ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. 7వ తేదీన ఇంటింటిని సందర్శించి బడి వయస్సు పిల్లలను నమోదు చేయాలని, జాబితా తయారు చేయాలని తెలిపారు. 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను బడిలో చేర్పించాలని, పాఠశాలలో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలను వివరించాలని, భవిత కేంద్రాలకు పిల్లలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి ఉట్నూర్లోని కొమురంభీం కాంప్లక్స్లోని వికాసం ప్రత్యేక పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. 11వ తేదీన 10వ తేదీ వరకు జరిగిన కార్యక్రమ పురోగతిపై చర్చించి, 12వ తేదీ నుండి కార్యచరణ ప్రకారంగా రోజువారి కార్యక్రమాలపై చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 12వ తేదీన పాఠశాలల పున:ప్రారంభించబడి విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందని, బడిబాట కార్యక్రమం ఆవశ్యకత తెలిసేలా పండగ వాతావరణంలో పాఠశాలలను అందంగా ముస్తాబు చేయాలని, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్, ఏక రూప దుస్తుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించాలని, గత విద్యా సంవత్సరంలో విద్యా సంబంధిత అంశాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బుధవారం రోజు రాజన్న గోశాలలో అనారోగ్యంతో ఒక కోడె మృతి.

### వైద్య చికిత్సకు స్పందిస్తున్న కోడెలు. జిల్లా పశు సమర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి.

### అకాల వర్షాలు, అనారోగ్య పరిస్థితుల కారణంగా మృత్యువాత.

### రాజన్న గోశాలలో కోడెల హెల్త్ బులిటెన్ విడుదల చేసిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** తిప్పాపూర్ లోని గోశాలలో అనారోగ్యంతో ఉన్న కోడెలు పశు వైద్యులు అందించే చికిత్సకు స్పందిస్తున్నాయని, కొన్ని పశు వులు యాక్టివ్ అయ్యాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి బుధవారం తెలిపారు.

అకాల వర్షాలు, అనారోగ్య పరిస్థితుల కారణంగా తిప్పాపూర్ లోని గోశాలలో మొదటి రోజు 8 కోడెలు, రెండవ రోజు ఐదు కోడెలు, మూడవరోజు నాలుగు కోడేలు, సోమవారం మరో మూడు కోడెలు, మంగళవారం రోజు ఆరు కోడెలు మరణించడం జరిగిందని, బుధవారం రోజు ఒక కోడె మృత్యువాత చెందిందని, ఇప్పటివరకు మొత్తం గోశాలలో 26 పశు వులు చనిపోయినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి తెలిపారు.

గోశాలలో ఉన్న 1300 పశువులలో ప్రస్తుతం మొత్తం 14 పశువులు అనారోగ్యంతో బాధపడుతున్నాయని, వీటికి పశు వైద్య డాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు, వైద్యానికి పశువులు స్పందిస్తున్నాయని కొన్ని యాక్టివ్ గా తిరుగుతున్నట్లు తెలిపారు. కోడెల ఆరోగ్య సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.

## పద్మశ్రీ మంద కృష్ణ మాదిగను సత్కరించిన సింగరేణి ఎస్సీ ఎస్టీ సంఘం నాయకులు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూన్ 4:** మ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ మందకృష్ణ మాదిగను మందమరి సింగరేణి ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా గత నెల 27న అందూకున్నారు. మంగళవారం హైదరాబాదులోని ఆయన ఆయన నివాసానికి చేరుకుని శాలువాతోపాటు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు. కేంద్ర ప్రచార కార్యదర్శి వాసాల శంకర్ ఉపాధ్యక్షులు ఆసం శంకర్, ఏరియా సెక్రెటరీ నాయిని శ్రీనివాస్, నాయకులు శనిగరామ్ రాజేష్, పాత్రికేయులు సమ్మయ్య, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com